www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 249 | బుధవారం | 28 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 9 తరువాత నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- రాష్ట్ర వ్యాప్తంగా 1294 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షా కేంద్రాలను గుర్తించే యాప్

3 లో

tsbie exam centre locator2018

కేంద్రం వల్లే ఆత్మహత్యలు





రైతు కుటుంబాల్లో విషాదానికి బిజెపి, కాంగ్రెస్ నిర్ణయాలే కారణం

డిఎల పెంపుపై చూపుతున్న శ్రద్ధను మద్దతు ధరపై చూపరు

రైతు ఓర్పును పరీక్షించడం భావ్యం కాదు : ఆదిలాబాద్ సభలో ముఖ్యమంత్రి

మన తెలంగాణ/ ఆదిలాబాద్ : జాతీయ పార్టీల అనాలోచిత నిర్ణయాల కారణంగా దేశంలో అనేక మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, శాంతియుత వాతావరణానికి భంగం వాటిల్లుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా తలాపునే పెన్‌గంగా, గోదావరి నదులు ప్రవహిస్తున్నా ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టక పోవడంతో జిల్లాకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది 70 వేల టిఎంసిల వర్షం కురుస్తుండగా, 24 వేల టిఎంసిల నీటిని మాత్రమే వినియోగించుకుంటున్నామని మిగిలిన నీరంతా వృథా అవుతుందని, గణాంకాలు చూసైనా జాతీయ పార్టీలు తల దించుకోవాల్సిన అవసరముందన్నారు. రైతులకు మేలు చేస్తామని ప్రకటనలు చేస్తున్న కేంద్రం.. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను మాత్రం పెంచడం తరువాయి 6లో

ఆరు నూరైనా సింగరేణిని ప్రైవేటీకరించం 3

కెసిఆర్‌కు తప్పిన ప్రమాదం

- బ్యాటరీ ఓవర్‌హీట్ వల్ల వైర్‌లెస్‌సెట్ బ్యాగ్‌లో పొగలు
- పైకి లేచే ముందు హెలికాప్టర్‌లో ఘటన
- అప్రమత్తమైన గార్డు

3



నేడు ముంబయిలో శ్రీదేవి అంత్యక్రియలు



ముంబయి/దుబాయ్ : దుబాయ్‌లో విషాదరీతిలో కన్నుమూసిన శ్రీదేవి భౌతిక కాయం మంగళవారం రాత్రి పదిగంటల తరువాత ముంబయిలోని ఛత్రపతి విమానాశ్రయానికి చేరుకుంది. భర్త బోనీ కపూర్, అర్జున్ కపూర్‌సహా పది మంది కుటుంబ సభ్యులు ఈ విమానంలో వచ్చారు. కోట్లాది మంది దేశ విదేశీ అభిమానులను తన అందం అభినయంతో అలరించిన నటి శ్రీదేవి ఒక ఊహగా, ఒక జ్ఞాపకంగా మారనుంది. శ్రీదేవి మరణం ప్రమాదవశాత్తూ జరిగిందని ఎట్టకేలకు పలు తరువాయి 6లో

మృతి ప్రమాదం వల్లే, కేసు మూసివేస్తున్నాం దుబాయ్ పోలీసుల ప్రకటన

వాటా మీరిన ఎపి

- కృష్ణలో పరిమితికి మించి నీటిని వాడుకున్న ఆంధ్రప్రదేశ్
- ఇక ముందు తీసుకోవడానికి వీలు లేదు
- తెలంగాణ తన వాటా మేరకు కూడా వినియోగించుకోలేదు
- స్పష్టం చేసిన కృష్ణ బోర్డు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కోటాకు మించి నీటిని వాడుకున్నందువల్ల ఇకపైన ఒక్క చుక్క నీటిని కూడా వాడుకోవడానికి వీల్లేదని ఆ రాష్ట్ర ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు రాసిన లేఖలో స్పష్టం చేసింది. గత నెల 10వ తేదీన రెండు రాష్ట్రాలతో కలిపి నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ 60 టిఎంసిలు, తెలంగాణ 50 టిఎంసిల చొప్పున నీటిని వినియోగించుకునేలా ఒప్పందం కుదిరిందని, ఫిబ్రవరి 26వ తేదీ వరకు వాడుకోవాల్సిన తరువాయి 6లో

తమిళనాడులో దళిత బాలుడి హత్య 10

- సోదరి, తల్లిపై అత్యాచారం

పిఎన్‌బి స్కాం రూ.12,723 కోట్లు 9

కుంచెపోటు



నీళ్లు పట్టుకునే కుండ కావాలా, డబ్బు దాచుకునే కుండ కావాలా..?

భద్రతా సిబ్బందిని ఏజెంట్లుగా నియమించవద్దు

మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల భద్రా సిబ్బందిని ఎన్నికల ఏజంట్లుగా, పోలింగ్ ఏజెంట్లుగా నియమించవద్దని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పట్టణ స్థానిక సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధుల సెక్యూరిటి సిబ్బందికి ఇది వర్తిస్తుందని తెలిపింది. మంత్రులు, ఎంపిలు, ఎమ్ఎల్ఎలు, ఎంఎల్‌సిలతో పాటు నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారి భద్రతా సిబ్బందిని కూడా ఏజెంట్లుగా నియమించరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే నియమించబడిన సెక్యూరిటి సిబ్బంది అందరికి ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. పంచాయతీ సర్పంచ్, సహకార సంఘాల ప్రతినిధులు, మున్సిపాలిటి, జిల్లాపరిషత్ చైర్మన్లు, నగరపంచాయతీ సర్పంచ్‌లు, మండల పరిషత్ అధ్యక్ష్యులకు సంబంధించిన సెక్యూరిటి బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని నియమించవద్దని పేర్కొంది. ప్రస్తుతం పని చేస్తున్న వారినే కాకుండా పనిచేసి విరమించుకున్న వారిని కూడా ఎలక్షన్, పోలింగ్ ఏజెంట్లుగా నియమించవద్దని దీనికనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టంచేసింది.

సిఎంతో మోడీకి క్షమాపణ చెప్పించండి



మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమాఖ్య సభలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రధాన మంత్రి నరేంద్రమోడిపై అవమానకరంగా వ్యాఖ్యలు చేశారని బిజెపి జాతీయ నాయకులు ఎన్.ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలోని బిజెపి ప్రతినిధి బృందం రాజ్‌భవన్‌లో మంగళవారం గవర్నర్ ఇఎస్ఎల్.నరసింహన్‌కు ఫిర్యాదు చేశారు. అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు వెంటనే సిఎం కెసిఆర్‌తో ప్రధాని మోడికి క్షమాపణ చెప్పించాలని కోరారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి మీడియాతో మాట్లాడుతూ సిఎం స్థాయిని దిగజార్చేలా కెసిఆర్ మాట్లాడుతున్నారని, కెసిఆర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడంతో పాటు ప్రధానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎలు రాంచంద్రారెడ్డి, రాజా సింగ్, బిజెపి నేతలు విజయలు పాల్గొన్నారు. కాగా ప్రధాని మోడిపై సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయిలో నిరసన కార్యక్రమరాలను నిర్వహించాలని బిజెపి పిలుపునిచ్చింది.

టిఆర్ఎస్‌కు 'చింతల'సవాల్



మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ రంగంపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని బిజెపి ఎంఎల్ఎ చింతల రాంచంద్రారెడ్డి టిఆర్ఎస్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఇప్పటి వరకు కేంద్రం చేసిన సహాయంపై అసెంబ్లీ సమావేశాల్లో అవకాశం కల్పిస్తే చర్చకు తాము సిద్ధమని, లేదా ప్రగతిభవన్‌కు ఆహ్వానించినా వస్తామని తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బిజెపి నేతలు ప్రేమేందర్ రెడ్డి, రాకేష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌శర్మతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు వివిధ రూపాల్లో రాష్ట్రానికి సుమారు రూ.4లక్షల కోట్లు కేటాయించిందన్నారు. వ్యవసాయం రంగానికి కేంద్ర సహాయం లేదంటూ ప్రధాని మోడిని తీసిపడేసినట్టుగా సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యాలను ఆయన ఖండించారు. మోడిపై చేసిన వ్యాఖ్యాలను తక్షణమే సిఎం కెసిఆర్ ఉపసంహరించుకోవాలని, లేదంటే తాము ప్రజాక్షేత్రంలో కెసిఆర్‌ను దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఇరిగేషన్ డబ్బులు చల్లి ఇతర పార్టీ నేతలను టిఆర్ఎస్‌లో కలుపుకున్న కెసిఆర్, అధికార అహంకారంతో ప్రధానిపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదన్నారు. ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహాయంతో చేపట్టిన వ్యవసాయ ట్రాక్టర్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఎం కెసిఆర్ వెంటనే ప్రధాని మోడికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎస్‌టిల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మన తెలంగాణ / హైదరాబాద్ : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద ఆర్థిక సహాయం పొందగోరే ఎస్టీ అభ్యర్థుల నుంచి గిరిజన సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. అర్హత కలిగిన అభ్యర్థులు మార్చి 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఉప సంచాలకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ ఏడాది జులై 1వ తేదీ నాటికి 35 ఏళ్లు మించకుండా ఉండడంతో పాటు విద్యార్థి కుటుంబం సంవత్సరాదాయం అన్ని విధాలుగా ఐదు లక్షల రూపాయలకు మించరాదని తెలిపారు. అర్హత కలిగిన వారు తమ డ్యాకుమెంట్లను అప్‌లోడ్ చేయడంతో పాటు నిర్ణీత ఫార్మట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్‌తో పాటు దక్షిణ కొరియా దేశాలలోని విశ్వవిద్యాలయాల్లో చదువుకోవాలనుకునే వారికి ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందుతుందన్నారు. వీసాతో పాటు ప్రయాణ ఛార్జీలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు.

1149 రైతు ఆత్మహత్యలు

- నిర్ధారించిన రాష్ట్ర ప్రభుత్వం
- 846 కుటుంబాలకు పరిహారం చెల్లింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ఏడాది ఆగస్టు వరకు నిజంగా వ్యవసాయ రీత్యా 1149 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఇందులో 846 కుటుంబాలకు నష్ట పరిహారం అందించింది. మరో 303 కుటుంబాలకు సంబంధించి కూడా దాదాపు పరిహారం చెల్లింపులు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2వ తేదీ నుంచి ఆగస్టు 2017 వరకు మొత్తం 2066 కేసులు రైతు ఆత్మహత్యలుగా నమోదయ్యాయి.

ఇందులో అధికంగా కరీంనగర్‌లో 281, వరంగల్ అర్బన్‌లో 260, నల్లగొండలో 186, వికారాబాద్‌లో 146, సంగారెడ్డిలో 144, ఆదిలాబాద్, రంగారెడ్డిలలో 125, నిజామాబాద్‌లో 101 కేసులు ఉండగా కామారెడ్డి, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మొత్తం నమోదైన వాటిలో 1808 కేసులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ విచారించి, 1149 మందివి నిజమైన అన్నదాత ఆత్మహత్యలుగానిర్ధారించింది. త్రిసభ్య కమిటీలో రెవిన్యూ, వ్యవసాయ, పోలీసు అధికారి ఉంటారు. పరిహారాన్ని 2016 మే నెలలో 389 కుటుంబాలకు, అక్టోబర్ 2017లో 457 కుటుంబాలకు చెల్లించారు. ఇందులో కొన్ని కేసులకు రూ. 6 లక్షల, మరికొన్నింటికి రూ.1.50 లక్షల చొప్పున ఇచ్చారు.రైతు ఆత్మహత్యల విషయంలో రాష్ట ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. త్రిసభ్య కమిటీ విచారణ పేరుతో ఆత్మహత్య చేసుకున్న రైతుల సంఖ్యను తగ్గిస్తున్నారని ఆరోపిస్తోన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 4 వేల వరకు అన్నదాతలు వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేకే చనిపోయారని వ్యాఖ్యానిస్తున్నారు. గడిచిన ఏడాది జాతీయ నేర విభాగ నివేదిక ప్రకారమే మూడు వేల పైన ఆత్మహత్యలతో దేశంలోనే రాష్ట్రం దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందని పేర్కొంటున్నారు.



2016 ఏప్రిల్ – 2017 ఆగస్టులోపు 872 కేసులు

రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన ఆత్మహత్య కేసులను పరిశీలిస్తే 2016 ఏప్రిల్ నుండి 2017 ఆగస్టు వరకు కేవలం 17 నెలల కాలంలోనే 872 రైతు ఆత్మహత్యల కేసులు నమోదు కావడం గమనార్హం. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన తరువాత కూడా ఈ సంఖ్య పెరగడంపై ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అన్నదాతల ఆత్మహత్యల పాపం గత పాలకులదేనని అంటున్నారని, ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్ల తరువాత కూడా ఎక్కువ సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకున్న విషయం వారి లెక్కలే చెబుతున్నాయని రైతు సంఘాలు పేర్కొన్నారు.

తాగునీటి కోసం 'భగీరథ' ప్రయత్నం

- అవసరానికి సరిపడా లేని నీటి లభ్యత
- సాగునీటికి కోత పెట్టి తాగునీటికి మళ్లింపు!

మన తెలంగాణ/తెలంగాణ : వేసవి సమీపిస్తుండడంతో కొన్ని గ్రామాల్లో ఇప్పుడిప్పుడే నీటి కొరత పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మార్చి రెండవ వారం నుంచే తొలిదశ భగీరథ నీళ్లను అందించడానికి కసరత్తు చేస్తూ ఉంది. జూలై నాటికి పూర్తి స్థాయిలో భగీరథ పనులు పూర్తిచేసి నీరందించాలని భావిస్తోంది. అయితే భగీరథ అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై చర్చలు మొదలయ్యాయి. పూర్తి స్థాయిలో భగీరథ ద్వారా నీరందించాలంటే కృష్ణా, గోదావరి బేసిన్ల నుంచి 59.17టిఎంసీల నీరు అవసరం. ప్రస్తుతం ఈ బేసిన్ల కింద 18 టిఎంసీల నీటి లభ్యతే ఉన్నందున తొలిదశ అవసరాలను అతి కష్టం మీద తీర్చవచ్చని అధికారులు భావిస్తున్నారు. వేసవి ముదిరే కొద్దీ గ్రామాల్లో తలెత్తే నీటి కొరతను ఎలా తీర్చాలన్నదానిపై అధికారుల్లో ఇప్పటి నుంచే ఆందోళన మొదలైంది. జూన్ రెండవ వారం నుంచి వర్షాలు మొదలైతే ఆగస్టు నాటికి భగీరథ కోసం కనీసం 35 టిఎంసీల నీటిని నిల్వ చేసుకునే వీలు కలుగుతుందని భావిస్తున్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోని పది టిఎంసీల నుంచి సాగునీటి అవసరాలకు 4 టిఎంసీలు ఇచ్చి మిగిలిన 6 టిఎంసీలను భగీరథ కోసం వినియోగించుకోవడంపై ప్రత్యామ్నాయ చర్చలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 16 నుంచే కాలువలు మూసివేసేలా సాగునీటిపారుదల శాఖ ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలు జారీచేయడంపై చర్చలు జరుగుతున్నాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్ పరిధిలోని నీటిలో కూడా భగీరథ కోసం కొంత మేరకు వినియోగించాలని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ 5 నుంచి తూముల మూసివేతపై ప్రాజెక్టుల అధికారులకు ఆదేశాలు జారీచేయడంపై చర్చలు జరుగుతున్నాయి. పాలేరు రిజర్వాయర్‌లో 4.70టిఎంసీలు, వైరాలో 1.2టిఎంసీలు, పెద్దదేవులపల్లిలో 0.12టిఎంసీలు, ఉదయసముద్రంలో 2.50టిఎంసీలు టెయిల్‌పాండ్‌లో 2 టిఎంసీల నీటిని నిల్వ చేయాలని భగీరథ అధికారులు నిర్ణయించారు.

ప్రతి ఒక్కరికీ తాగునీటి సంకల్పం నెరవేరబోతోంది: దినేష్ చంద్ర

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలో 2022నాటికి ప్రతి ఒక్కరికి తాగునీరందించాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పం మరి కొన్ని రోజుల్లోనే తెలంగాణలో నెరవేరబోతోందని కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అడిషనల్ అడ్వయిజర్ దినేష్‌చంద్ వ్యాఖ్యానించినట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొనింది. మంగళవారం ఢిల్లీలో 2018–19 వార్షిక తాగునీటి ప్రణాళిక సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మిగతా రాష్ట్రాల కంటే నాలుగేళ్లు ముందుగానే తెలంగాణ ఈ ఘనతను సాధిస్తుండడం గొప్ప విషయంగా వ్యాఖ్యానించినట్లుపేర్కొనింది. అన్ని రాష్ట్రాలూ తెలంగాణ విధానాన్ని అనుసరించాలన్నారు. మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించేందుకు వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను సంస్థాగతంగానే రూపొందించుకోవడాన్ని ఆయన ప్రశంసించారు.దాదాపు రూ. 30 కోట్ల ప్రజాధనాన్ని ఆర్‌డబ్ల్యుస్ అండ్ ఎస్ మిగిల్చిందన్నారు. అందుకే 41.10కోట్ల రూపాయలు ఇన్సెంటివ్ ఇస్తున్నామని, దీనిని వెంటనే విడుదల చేయాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

వచ్చే నెల 5న కేంద్ర హోంశాఖ సమావేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూలులో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపైనా, వాటి పురోగతిపైనా, ప్రస్తుత స్థితిగతులపైనా, చట్టం అమలులో ఎదురవుతున్న సమస్యలపైనా చర్చించేందుకు రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేంద్ర హోంశాఖ సమావేశాన్ని ఏర్పాటు చేస్తోంది. తొలుత ఈ సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు రెండు రాష్ట్రాలకూ సమాచారం ఇచ్చినా జాతీయ ఎస్‌సి కమిషన్ పర్యటన దృష్ట్యా వాయిదా వేయాల్సిందిగా తెలంగాణ ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. దాంతో ఈ నెల 23వ తేదీకి వాయిదా పడింది. అయితే బడ్జెట్ రూపకల్పన పనుల్లో ఉన్నందున హాజరు కాలేమంటూ మళ్ళీ స్పష్టం చేయడంతో నిరవధికంగా వాయిదా పడింది. చివరకు వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీలోనే జరపడానికి కేంద్ర హోంశాఖ తేదీని ఖరారు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో పాటు 'వివాదాల పరిష్కార కమిటీ' కార్యదర్శులు కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు. ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే జోన్, రైలు కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఉద్యానవన విశ్వవిద్యాలయం, పలు రకాల ఉన్నత విద్యా సంస్థలు, జాతీయ రహదారులు, మౌలిక సౌకర్యాల రూపకల్పన.. ఇలా మొత్తం 17 రకాల హామీలను రెండు రాష్ట్రాలకు కలిపి ఇచ్చినందువల్ల ఇవి ఏ మేరకు అమలయ్యాయో, ఎదుర్కొంటున్న ఇబ్బందులేంటో ఈ సమావేశంలో చర్చ జరగనుంది. వీటిపై వివరణ ఇవ్వడానికి కేంద్రం తరపున రైల్వే, మానవ వనరుల అభివృద్ధి, ఉక్కు, రవాణా, న్యాయ, వ్యవసాయ, వాణిజ్య... ఇలా పలు మంత్రిత్వశాఖలకు చెందిన కార్యదర్శులు సైతం హాజరవుతున్నారు. రెండు రాష్ట్రాలూ కేంద్రంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా విమర్శలు చేస్తున్న నేపథ్యంలో సమావేశం జరుగుతుండడం గమనార్హం.

నేర రహిత నగరంగా హైదరాబాద్: డిజిపి మహేందర్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్‌ను నేరరహిత నగరం (క్రైమ్ ఫ్రీ సిటీ)గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని డిజిపి మహేందర్‌రెడ్డి తెలిపారు. మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీసులు చేపట్టే కార్యక్రమాలను ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. మార్చి 3,4 తేదీలలో నెక్లెస్‌రోడ్డులో ఉమెన్ ఎక్స్‌పో, షీ టీమ్ రన్‌ల పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో జరిగే 2కె, 5 కె, 10 కె రన్‌లో సుమారు ఏడు వేల మంది పాల్గొంటారని, ముఖ్య అతిథులుగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు, సినీ హీరో ఫేమ్ విజయ్ దేవరకొండ హాజరవుతారన్నారని తెలిపారు. విజేతలకు బహుమతుల్ని కూడా అందజేస్తామన్నారు. రన్‌లో పాల్గొనే వారు www.events.comలోని she teamsలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే 3,4 తేదీల్లో రెండ్రోజుల పాటు పోలీసు ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నామని, దీన్ని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రారంభిస్తారని మహేందర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేస్తోందని, ఈ మేరకు అక్టోబర్ 24, 2014న ఏర్పాటు ఏర్పడిన షీ–టీమ్స్ అంచెలంచెలుగా అనేక కార్యక్రమాలను చేపట్టాయని తెలిపారు. మహిళల భద్రత, రక్షణపై అవగాహన కోసమే షీ టీమ్ ఆధ్వర్యంలో రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ రన్‌లో పిల్లలు, యువకులు, మహిళలు అందరు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో ఒక ఉత్సాహాన్ని తీసుకువచ్చి మహిళల భద్రతలో భాగస్వాములను చేయడానికి దోహదపడుతుందన్నారు. రన్ సందర్భంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. రన్‌లో పాల్గొనే వారికి టీ షర్టులు, మెడల్స్, అల్పాహారం, త్రాగునీరు, అంబులెన్స్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా రన్‌కు సంబంధించిన టీ షర్టు, పోస్టర్‌ను డిజిపి మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిజి అంజనీకుమార్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావు, అదనపు పోలీసు కమిషనర్ స్వాతిలక్రా, సిసిఎస్ డిసిపి అవినాష్ మహంతి, ఎస్‌పి రమారాజేశ్వరీ, భరోసా సెంటర్ ఎసిపి కవితలు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక లాభాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతులు మల్బరీ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు ఎల్. వెంకట్రామ్ రెడ్డి అన్నారు. సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఆదేశాలకనుగుణంగా మల్బరీ సాగును ప్రోత్సాహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హైదాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మంగళవారం పట్టు పరిశ్రమ అధికారులతో రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ సాగుకు భిన్నంగా వ్యవసాయం చేస్తేనే గిట్టుబాటు అవుతోందన్నారు. వ్యవసాయంతో సంబంధం లేని వారు భూములు కొనుగోలు చేసి, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా మల్బరీ సాగు చేసి లాభాలు పొందుతున్నారని తెలిపారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారులు రైతుల్లో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురి రైతులు మల్బరీ సాగులో సాధించిన విజయాలను మిగతా రైతులతో పంచుకున్నారు.

బోగస్ మోటార్ డ్రైవింగ్ స్కూల్స్

- నిబంధనలు పాటించని అనుమతి పొందిన స్కూల్స్
- డ్రైవింగ్ స్కూల్స్ ప్రక్షాళనకు చర్యలు: జెటిసి
- బోగస్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోండి :టిఎండిఎస్‌ఓడబ్ల్యుఎ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో బోగస్ మోటారు డ్రైవింగ్ స్కూల్స్ రాజ్యమేలుతున్నాయి. ప్రజలు కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనే ఆకాంక్షను, కారు నడపాలనే యువత క్రేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు బోగస్ మోటారు డ్రైవింగ్ స్కూల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గత కొంత కాలంగా నగరాలు, పట్టణాలలోని ఏ రద్దీ ప్రాంతంలో చూసినా మోటార్ డ్రైవింగ్ స్కూల్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ అనుమతి పొందిన మోటారు డ్రైవింగ్ స్కూల్స్ సుమారు 800 ఉండగా, బోగస్ డ్రైవింగ్ స్కూల్స్ అంతకు రెట్టింపు ఉన్నాయని అంచనా. కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి అవసరమైన డ్యూయల్ స్టీరింగ్‌లు, గేర్ బాక్స్‌లు, హెడ్ లైట్లు, సీట్ బెల్టులు తదితర మౌలిక సదుపాయాలు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా బోగస్ స్కూల్స్ నడుస్తుతున్నాయి.

అనుమతి పొందిన వారూ అక్రమార్కులే

ఇక అనుమతి తీసుకున్న మోటారు డ్రైవింగ్ స్కూల్స్ యాజమానులు సైతం కొంత మంది అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ ఒక ప్రాంతంలో డ్రైవింగ్ స్కూల్‌కు తీసుకున్న అనుమతితో ఇతర ప్రాంతాల్లో రెండు మూడు డ్రైవింగ్ స్కూల్స్ నడిపిస్తున్నారు. నిబంధనల ప్రకారం మోటారు డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే మెకానికల్ ఇంజినీరింగ్‌లో లేదా ఐటిఐ డీజిల్ మెకానిక్ డిప్లొమాతో పాటు బ్యాడ్జ్‌తో కూడిన హెవీ మోటారు వెహికిల్ లైసెన్స్ కలిగి ఉండాలి. డ్రైవింగ్ శిక్షణ కోసం వచ్చే వారికి కారు నడిపే విధానం, రోడ్డు నిబంధనలు, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను వివరించడానికి ఒక తరగతి గది ఉండాలి. కారు ఎప్పుడైనా రోడ్డుపై అకస్మాత్తుగా చెడిపోయినా సమస్యను పరిష్కరించుకునేందుకు కనీస అవగాహనను కల్పించాలి. తొలుత మైదాన ప్రాంతాలు, తరువాత ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో శిక్షణ ఇవ్వాలి. ఇవేవి అమలు చేయకుండానే కేవలం మైదానాల్లో తూతూ మంత్రంగా శిక్షణ ఇచ్చేస్తూ 30 రోజుల్లో 30 గంటల్లో వందల మందికి కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు డ్రైవింగ్ స్కూల్స్ సర్టిఫికేట్లు జారీ చేస్తున్నాయని



ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా డ్రైవింగ్ స్కూల్స్‌లో కారు నేర్చుకున్న వారు కారు తీసుకుని ట్రాఫిక్ రద్దీ ఉన్న రోడ్లపైకి రాగానే అయోమయానికి గురవుతున్నారు. ఒక వైపు బోగస్ మోటారు డ్రైవింగ్ స్కూల్స్ యధేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నా, మరోవైపు కొంత మంది అనుమతి పొందిన ప్రైవేటు డ్రైవింగ్ స్కూల్స్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా రవాణ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని డ్రైవింగ్ స్కూల్స్ యాజమానులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ప్రక్షాళనకు చర్యలు : జెటిసి

''మోటారు డ్రైవింగ్ స్కూల్స్‌ను ప్రక్షాళన చేసి బోగస్ స్కూల్స్‌ను ఏరివేసేందుకు చర్యలు చేపట్టాం. అందులో భాగంగా బోగస్ స్కూల్స్‌ను సులువుగా గుర్తించేందుకు ఆర్‌టిఎ గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూల్స్‌కు ప్రత్యేక గుర్తింపు స్టిక్కర్లను జారీచేసి వాటిని శిక్షణ వాహనాలకు అతికించాలని నిర్ణయించాం. నిబంధనలు పాటించని డ్రైవింగ్ స్కూల్స్‌పై కూడా కఠిన చర్యలు తీసుకుంటాం'' అని రవాణ శాఖ సంయుక్త కమిషనర్ జి.పాండురంగ నాయక్ 'మన తెలంగాణ' ప్రతినిధితో చెప్పారు.

బోగస్ స్కూల్స్‌ను అరికట్టండి: టిఎండిఎస్‌ఓడబ్ల్యుఎ

''బోగస్ మోటారు డ్రైవింగ్ స్కూల్స్ మోసాల వల్ల రవాణ శాఖ నుంచి అనుమతి పొంది డ్రైవింగ్ స్కూల్స్‌ను నుడుపుతున్న తాము అప్రతిష్టపాలవుతున్నాం. డ్రైవింగ్ స్కూల్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను రవాణ శాఖ ఆన్‌లైన్ చేసి బోగస్ స్కూల్స్ చర్యలను అరికట్టాలి.అనుమతి పొందిన స్కూల్స్ యాజమానులు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే రవాణ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకున్నా తమకు అభ్యంతరం లేదు'' అని తెలంగాణ ఎల్‌ఎంవి మోటారు డ్రైవింగ్ స్కూల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (టిఎండిఎస్‌ఓడబ్ల్యుఎ) అధ్యక్షులు బి.స్వామి 'మన తెలంగాణ' ప్రతినిధికి చెప్పారు.



విద్యతో నైతిక విలువలు : ఉప రాష్ట్రపతి

మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యార్థులు సత్ప్రవర్తన అలవర్చుకోవడానికి, బాధ్యత కలిగిన పౌరులుగా తయారుకావడానికి, దయా హృదయం కలిగినవారిగా రూపొందడానికి విద్యా వ్యవస్థ దోహదపడాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో నైతికత అలవడడానికి, నీతి నియమాలను అలవర్చుకోడానికి, విద్యార్థి దశ నుంచే దేశభక్తి, జాతీయవాద భావాలు పెంపొందడానికి విద్యా వ్యవస్థ తోడ్పడాలని అన్నారు. నగరంలో మంగళవారం సాయంత్రం జరిగిన శివశివాని కళాశాల 23వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు విద్యార్థులను, విద్యా సంస్థల యజమాన్యాలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఉత్తమ పౌరులుగా, ఆదర్శనీయులుగా తీర్చిదిద్దే తరహాలో విద్యా వ్యవస్థ ఉండాలని, ఇందు కోసం పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగాలని అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులపై సిలబస్ భారం ఎక్కువగా ఉంటోందని, దీన్ని తగ్గించే విధంగా కృషి జరగాలని అన్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో ఎంతసేపు కూర్చుంటున్నారో క్రీడా మైదానాల్లో గడపడానికి కూడా అంతే సమయం ఉండేలా విద్యా సంస్థలు సమయ పాలన రూపొందాలని సూచించారు. భవిష్యత్తులో రాణించే విధంగా విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే కొత్త మెలకువలు, నైపుణ్యం అలవర్చాలని వెంకయ్యనాయుడు సూచించారు.

ధనిక జిల్లాగా పెద్దపల్లి

మనతెలంగాణ/గోదావరిఖని: రైతుల సంక్షేమమే తెలంగాణ లక్ష్యమని,పెద్దపల్లి ధనిక జిల్లాగా ఆవిర్భవిస్తుందని సిఎం కెసిఆర్ అన్నారు. మంగళవారం అంతర్గాం మండలంలో ముర్మూర్ గ్రామం వద్ద నిర్మిస్తున్న రామగుండం ఎత్తిపోతల పథకానికి భూమిపూజ చేసి శంకు స్థాపన చేశారు. లిఫ్టుల నిర్మాణంపై ఇరిగేషన్ శాఖ అధికారులు ముఖ్య మంత్రి కి మ్యాప్‌ల ద్వారా వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణం అనంతరం ప్రాజెక్టు కింద ఉన్న చివరి ఆయకట్టు పొలాల వరకు నీరు ఎప్పుడు చేరలేదని, చివరి ఆయకట్టు పొలాలకు సాగునీటిని స్థిరీకరించడం కోసం రెండు లిఫ్టులు ఏర్పాటు చేయాల్సిందిగా రామగుండం శాసన సభ్యులు పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ పదవి చేపట్టిన మూడు రోజులకు వచ్చి ఈ ప్రాంతాలకు సాగునీరు విషయంపై చర్చించారని అన్నారు. కాళేశ్వరం పథకం ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరందిస్తామని తెలియజేసినప్పటికి పట్టువదలని విక్రమార్కుడిలాగా ప్రజల కొరకు ప్రయత్నించారని, తాను ఇంటిలిజెన్స్ శాఖ ద్వారా నివేదిక తీసుకొని ఎస్సారెస్పీలోని డిజైన్ లోపం వల్ల ఈ ప్రాంతాల పొలాలకు నీరు చేరలేదని, 136కి.మీ ఎస్సారెస్పీ, తర్వాత 32కి.మీ బ్రాంచీ కెనాల్, అనంతరం పెద్దపల్లి 16కి.మీ తర్వాత ఇక్కడకు నీరు చేరుకోకపోవడం ఇబ్బందిగా ఉందని ఆ నివేదిక తెలిపిందని అన్నారు.

కావున రెండు లిఫ్టులు ఒకటి అంతర్గాం వద్ద 27ఎల్ లిఫ్టు, మరొకటి పాలకుర్తి మండలంలోని వేమునూర్ వద్ద 17ఎల్ లిఫ్టు నిర్మాణాలు రూ. 80కోట్లతో మంజూరు చేసానని తెలిపారు. బండ్లవాసి వద్ద నుంచి మరో లిఫ్టును రూ. 10కోట్లతో ఏర్పాటు చేయడానికి వెంటనే అధికారులను ఆదేశిస్తానని, వీటి ద్వారా మీ కాలువలో ఎల్లప్పుడు నీరు ఉంటుందని తెలిపారు. మూడు లిఫ్టుల నిర్మాణంతో 22000ఎకరాలకు రెండు పంటలకు సాగునీరందిస్తామని, ఈ ప్రాజెక్టుల ద్వారా 16గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ ప్రాంతాల వారికి సాగునీరు అందించడం కోసం తపన చెందిన రామగుండం ఎంఎల్‌ఎ సోమారపు సత్యనారాయణను అభినందిస్తున్నానని తెలిపారు. మంత్రి ఈటెల రాజేందర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను తరుచు పర్యవేక్షిస్తూ నాలుగు మాసాల లోపు పనులు పూర్తి చేయాలని, వచ్చే వానాకాలం పంట నాటికి ఈ ప్రాంతాలకు సాగునీరు అందించేలా పనులు జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకధికారిణి స్మిత సభర్వాల్, ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్, పెద్దపల్లి ఎంపి బాల్క సుమన్, రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు, ప్రభుత్వ సలహాదారులు జి. వివేక్, ఐడిసి చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, జడ్‌పి చైర్మన్ తుల ఉమా, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఆర్‌టిసి చైర్మన్, రామగుండం ఎంఎల్‌ఎ సోమారపు సత్యనారాయణ, పెద్దపల్లి ఎంఎల్‌ఎ దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం జడ్‌పిటిసి కందుల సంధ్యారాణి, ఎంపిపి ఆడెపు రాజేశం, నగర మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, టిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సింగరేణిని ప్రైవేటీకరించం



- దానిపై కేంద్రానికి పెత్తనం లేదు
- ఆరు భూగర్భ గనులకు ప్రారంభోత్సవం
- ఆత్మీయ సమ్మేళనంలో సిఎం కెసిఆర్

మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : ఆరు నూరైనా సింగరేణిని ప్రైవేటీకరణ కానివ్వమని సింగరేణిపై కేంద్రానికి పెత్తనం లేదని ఒక వేల కేంద్రం వాటాను విరమించుకున్నా తెలంగాణలో సింగరేణికి డోకా లేదని తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు.మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సింగరేణీయుల ఆత్మీయ సమ్మేళనం బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. గత కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల తవ్వకాన్ని ప్రైవేటీకరిస్తామని అంటున్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ అన్నం పెట్టిన సింగరేణి తల్లిని కాపాడుకుంటామని బలమైన హామీ ఇచ్చారు.ప్రైవేటీకరణ కానివ్వమని ఆశామాషీగా చెప్పడం లేదని, ఒక పాలసీ ప్రకారం ముందుకు సాగుతున్నామని అవసరమైతే ప్రాణం పోయిన సింగరేణిని వదులుకునేది లేదన్నారు. తెలంగాణలో సింగరేణి, విద్యుత్ శాఖ,టిఎస్‌ఆర్‌టిసిని కొనసాగిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేసేది లేదన్నారు.

ఎపిఎస్ ఆర్‌టిసిలో 50 వేల మంది కార్మికులు సమైక్య పాలనలో కత్తినెత్తిన పడుతుందో తెలియని పరిస్థితుల్లో తెలియకుండా ప్రైవేటీకరణ బెదిరింపులతో పని చేశారని , తెలంగాణ వచ్చాక రూ. 750 కోట్లతో కొనసాగిస్తున్నామన్నారు. జైపూర్‌లో 600 మెగావాట్లతోమరో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని,దీని వలన 24 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సింగరేణి కార్మికులకు వడ్డీలేని ఇంటి రుణాన్ని అందిస్తున్నామని,కొత్తగా 7200 మందికి ఉద్యోగాలు కల్పించామని,నూతనంగా 6 కొత్త గనులకు ఈరోజు శంకుస్థాపన చేశామని, దీని ద్వారా 4500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. కొందరు స్వార్థపరులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మారు పేర్లపై పని చేస్తున్న కార్మికులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని,వారు పని చేసినంతకాలం యాజమాన్యం ఎలాంటి ఇబ్బందులు పెట్టదన్నారు. సింగరేణిలోని కొత్తగూడెం, బెల్లంపల్లి, ఇల్లందు ప్రాంతాల్లో నివసిస్తున్న కార్మికులకు ఇప్పటికే ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, అదే విధంగా శ్రీరాంపూర్‌లో ఉన్న కార్మికులకు కూడా 20 రోజుల్లో పట్టాలు ఇస్తామన్నారు.సింగరేణి రిటైర్డ్ కార్మికులు 60 వేల మంది ఉండగా వారికి సంస్థ పరంగా ఆరోగ్య సేవలు అందిస్తామని, పెన్షన్ పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఈ బహిరంగ సభలో మంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్న, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షురాలు ,నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత, ఎంపి బాల్కసుమన్, తెలంగాణ రాష్ట్ర సలహాదారు వివేకానంద, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, విప్ నల్లాల ఓదెలు, జడ్‌పి చైర్మన్ శోభ సత్యనారాయణ, ఎంఎల్‌సి పురాణం సతీష్‌కుమార్, ఎంఎల్‌ఎలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు.

గడువులోగా చనాక కొరాట



- పనులు మందకొడిగా సాగుతున్నాయని సిఎం అసహనం

మన తెలంగాణ/ఆదిలాబాద్ : బ్యారేజ్ నిర్మాణ పనులను వేగవంతం చేసి జూన్‌లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గుత్తేదారును ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని చనాక కొరాట వద్ద నిర్మిస్తున్న బ్యారేజి నిర్మాణ పనులను ముందుగా ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన అనంతరం బ్యారేజ్ వద్ద ఎగ్జిబిషన్ స్టాల్‌లో ఏర్పాటు చేసిన నిర్మాణ పనుల పురోగతికి సంబంధించిన మ్యాపులు, ఛాయచిత్రాలను పరిశీలించారు. అయితే నాలుగు నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పనులు 50 శాతం మాత్రమే పూర్తి కావడంతో మిగిలిన పనులను ఎలా పూర్తి చేస్తారంటూ గుత్తేదారుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగైతే ఇచ్చిన మాట తప్పినట్లవుతుందని పేర్కొన్నారు. బ్యారేజి నిర్మాణ పనులను రేయింబవళ్ళు చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చనాక కొరాట కాలువలు, పంపుహౌజ్, రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. పనులను వేగంగా చేపట్టేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొరాట గ్రామంలో గల పురాతన శివాలయానికి రూ.25లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కోరటా గ్రామంలో 200 డబుల్ బెడ్రూం ఇళ్ళు మంజూరు చేసినట్లు గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి గ్రామ సర్పంచ్ ఇంజనీరింగ్ అధికారులు శివాజీ విగ్రహాన్ని జ్ఞాపికగా బహుకరించారు. మంత్రులు ఈటెల రాజేందర్, హరీష్‌రావు, జోగురామన్న, రాష్ట్ర న్యాయ, గృహనిర్మాణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె కేశవరావు, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి స్మితా సబర్వాల్ , జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్, ఎస్‌పి విష్ణు ఎస్ వారియర్, చీఫ్ ఇంజనీర్ భగవంతరావు, చనాక కోరట బ్యారేజ్ గుత్తేదారు అల్లోల మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగానే ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావ్ ప్రాజెక్టు పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో పనులను గడువులోగా ఎలా పూర్తి చేస్తారంటూ ప్రశ్నించారు. జూన్‌లోగా పూర్తి చేస్తామని అధికారులు చెప్పడం తో ఎలా సాధ్యమవుతుందని నిలదీసినట్లు చెబుతున్నారు. ఇలాగైతే చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం.

సిఎంకు తప్పిన పెను ప్రమాదం

మనతెలంగాణ/కరీంనగర్‌టౌన్:సిఎం కెసిఆర్ మంగళవారం ఉదయం కరీంనగర్ నుంచి పెద్దపల్లి పర్యటనకు హెలికాప్టర్‌లో బయలుదేరే సమయంలో ఓ బ్యాగ్ నుంచి పొగలు వెలువడ్డాయి. పొగలు రావడాన్ని సిఎం ఓ అధికారి గుర్తించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే ఆ అధికారి హెలికాప్టర్ నుంచి పొగ వస్తున్న బ్యాగ్ ను బయటకు తీసుకొని పరిగెత్తారు. అప్రమత్తమైన సెక్యూరిటీ గార్డ్ ఆ బ్యాగ్‌ను వంద మీటర్ల దూరం తీసుకొచ్చి పడేశారు. దీంతో అందరూ ఒక్కసారి ఊపిరిపీల్చుకున్నారు. ఆబ్యాగ్‌సిఎం కాన్వాయ్‌లోని వైర్‌లెస్ సెట్ అని తెలుస్తోంది. సిఎం హెలికాప్టర్‌లో వెళ్లడంతో ఆయనతో పాటు ఆ వైర్ లెస్ సెట్‌ను తీసుకెళ్లారు. సిఎం సెక్యూరిటీ సిబ్బంది బ్యాటరీ ఓవర్ హీట్ కావడంతో బ్యాగ్ నుంచి ఆకస్మాత్తుగా పొగలు వెలువడినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. హెలికాప్టర్ గాల్లోకి లేవకముందే బ్యాగ్‌ను బయట పడేయడం తో పెను ప్రమాదం తప్పినట్టుగా తెలుస్తోంది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం 8.45 గంటలకే సీట్లో కూర్చోవాలి
- 9 తర్వాత నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- రాష్ట్రవ్యాప్తంగా 1,294 కేంద్రాల ఏర్పాటు

మనతెలంగాణ/హైదరాబాద్: ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. వచ్చే నెల 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే తమకు కేటాయించిన సీట్లో కూర్చోవాలి. ఆ తర్వాత 15 నిమిషాల పాటు అంటే 9 గంటల వరకు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఉదయం 9 తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాలు ఉదయం 8 గంటలకు తెరిచి, 8.30 గంటల నుంచి విద్యార్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 1,294 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే ఈ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 9,63,546 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ యాజమాన్యాలు వేధిస్తున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఇంటర్ బోర్డు విద్యార్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. www.admi. tsbie. cgg.gov.in, www.tsbie. cgg. gov.in, వెబ్‌సైట్లలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచారు. కళాశాలతో ప్రమేయం లేకుండా విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ హాల్‌టికెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకుండానే విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ ఎ.అశోక్ ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షా కేంద్రాలను గుర్తించే సెంటర్ లోకేటర్ యాప్ : ఇంటర్ విద్యార్థులు సులువుగా తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకునేందుకు వీలుగా ఇంటర్‌బోర్డ్ ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గూగుల్ ప్లేస్ స్టోర్ నుంచి tsbieexam centre locator2018 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందు లో విద్యార్థులు తమ హాల్‌టికెట్ నెంబర్ ఎంటర్ చేసి క్లిక్ చేస్తే వెంటనే పరీక్షా కేంద్రం ఫొటో, విద్యార్థి ఉన్న చోటు నుంచి పరీక్షా కేంద్రం ఎంత దూరం ఉంది,ఏ మార్గంలో వెళ్లవచ్చు, ప్రయాణానికి ఎంత సమయం పడుతుంది తదితర వివరాలు వస్తాయి. ఒకే పేరుతో ఉన్న కళాశాలలు అధికంగా ఉన్నందున సరైన కేంద్రాన్ని గుర్తించేందుకు యాప్ దోహదపడుతుంది.

సెల్‌ఫోన్లపై జిపిఎస్ నిఘా: పరీక్షలలో మాల్ ప్రాక్టీస్ అరికట్టేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు.

పరీక్షా కేంద్రంలో విద్యార్థులతో సహా ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులకు కూడా సెల్‌ఫోన్లు వినియోగించేందుకు అనుమతించలేదు. సెల్‌ఫోన్ల వినియోగంపై పోలీసులు జిపిఎస్‌తో నిఘా పెడతారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు, మిషన్లు పనిచేయకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రశాంతంగా టిఆర్‌టి

మనతెలంగాణ/హైదరాబాద్ : టిఆర్‌టి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిసినట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. ఉదయం జరిగిన ఎస్‌ఎ(ఫిజికల్ సైన్స్) పరీక్షకు 70.7 శాతం హాజరు నమోదు కాగా, మధ్యాహ్నం జరిగిన లాంగ్వేజ్ పండిట్ (ఉర్దూ, మరాఠి, హిందీ) 87.5 శాతం హాజరు నమోదైనట్లు కమిషన్ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నిర్వహించనున్నపిఇటి, ఎస్‌ఎ(హిందీ,కన్నడ, తమిల్, ఉర్దూ) పరీక్షలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మార్చి 2 ఐచ్ఛిక సెలవు

- ఒకటో తేదీనే హోలీ

మనతెలంగాణ/హైదరాబాద్ : మార్చి 2వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం ఐచ్చిక సెలవుగా ప్రకటించింది. హోలీ పండుగ సందర్భంగా మార్చి 1వ తేదీని సాధారణ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మార్చి 2ను ఐచ్చిక సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు పెట్టుబడికి 'ఆర్డర్' చెక్కులు

మన తెలంగాణ/హైదరాబాద్ : వ్యవసాయ పెట్టుబడి పథకం కింద ప్రభుత్వం పంపిణీ చేయనున్న ఎకరాకు రూ. 4 వేలకు 'ఆర్డర్' చెక్కులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఆర్డర్ చెక్కులుంటే బ్యాంకులో ఇచ్చిన వెంటనే నగదు తీసుకోవచ్చు లేదా నేరుగా ఖాతాలోకి జమ చేసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. ఎవరి పేరు మీద చెక్కు వస్తుందో వారికే బ్యాంకులు నగదును చెల్లిస్తాయి. రెవిన్యూ రికార్డుల ప్రక్షాళనలో తేలిన వివరాల ప్రకారం 72 లక్షల చెక్కులు ముద్రించాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనావేసింది. వీటి ముద్రణా బాధ్యతను 8 బ్యాంకులకు అప్పగించాలని మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల స్టీరింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం జరిగింది. ఇందులో ఆంధ్రా, ఎస్‌బిఐ, కెనరా, ఇండియన్ ఓవర్సీస్, సిండికేట్, యాక్సిస్, ఐసిఐసిఐ బ్యాంకులు ఉన్నట్లు తెలిసింది. ఏ జిల్లాను, ఏ మండలాన్ని ఏ బ్యాంకుకు అప్పగించాలన్నదానిపై త్వరలోనే ప్రభుత్వం బాధ్యతలు అప్పజెప్పనుంది. ఏ బ్యాంకు ముద్రించినా ఆ చెక్కును ఏ బ్యాంకులోనైనా జమ చేసి నగదు తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించనుంది. రెవిన్యూ శాఖ నుంచి భూరికార్డుల వివరాలు అందిన వెంటనే చెక్కుల ముద్రణ ప్రారంభం కానుంది.

తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు




మన తెలంగాణ/హైదరాబాద్: రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని షియా ఇస్మాయిలి ముస్లిమ్స్ ఇమామ్, ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్(ఎకెడిఎన్) ఛైర్మన్ ఆగాఖాన్ అన్నారు. దేశ పర్యాటన నిమిత్తం హైదరాబాద్‌కు విచ్చేసిన ఆగాఖాన్ రాజ్ భవన్‌లో మంగళవారం గవర్నర్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆగాఖాన్ సంస్థ తెలుగు రాష్ట్రాలలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై వారు చర్చించారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో చేపట్టబోతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను ఆగాఖాన్ గవర్నర్‌కు వివరించారు. తెలుగు రాష్ట్రాలలో ఆగాఖాన్ సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులను గవర్నర్ అభినందిస్తూ ఇందుకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. ప్రధానంగా విద్య, వైద్య సేవలతో పాటు హైదరాబాద్‌లోని కుతుబ్‌షాహి సమాదుల పునరుద్ధరణ, వాటి సంరక్షణ, చారిత్రక స్మారకాల పునరుద్ధరణ, సంస్కృతి తదితర అంశాలపై పరస్పరం చర్చించారు. ప్రధానంగా ప్రజలకు సరసమైన ధరలకు విద్యను, అలాగే వైద్యాన్ని అందించాలని, అందుకు కావాల్సిన సౌకర్యాలను కూడా కల్పించాలని గవర్నర్ వారికి సూచించారు.


కేంద్రంపై నెపం : జీవన్‌రెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతు సమన్వయ సమితి సమావేశాలు ప్రభుత్వ సమావేశాలా? లేక టిఆర్‌ఎస్ పార్టీ సమావేశమా? అని సిఎల్‌పి ఉప నేత టి.జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. సిఎల్‌పి మీడియా హాల్‌లో మంగళ వారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చొరవ చూపకుండా కేంద్రంపై నెపం నెట్టి చేతులు దులుపుకుంటోందన్నారు. రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఉద్యమ నాయకుడని టిఆర్‌ఎస్ నేతలు అంటున్నారని, అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఉద్యమ నాయకులేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తో కుమ్మక్కై టిఆర్‌ఎస్ తెలంగాణకు ద్రోహం చేస్తోందన్ని ఆరోపించారు.

తెలంగాణలో రక్షణ ఉత్పత్తుల కారిడార్

- డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించండి
- కేంద్ర మంత్రి సీతారామన్‌కు మంత్రి కెటిఆర్ లేఖ
- తెలంగాణకు అన్ని అర్హతలు ఉన్నాయని పలు అంశాల ప్రస్తావన






మన తెలంగాణ /హైదరాబాద్ : తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి పరిశ్రమల శాఖ మంత్రి కె.టి. రామారావు లేఖ రాశారు. ఈ కారిడార్ ఏర్పాటు కోసం తెలంగాణకు అన్ని రకాల అర్హతలున్నాయన్నారు. ఈ కారిడార్ ఏర్పాటు ద్వారా తెలంగాణ స్థానిక యువతకు మరింత ఉపాధి లభిస్తుందన్నారు. గత 5 దశాబ్దాలుగా అద్భుతమైన ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ ఈకో సిస్టమ్ తెలంగాణలో ఉన్నదన్నారు. ఈ మధ్య బుందేల్ ఖండ్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించిన తీరుగానే తెలంగాణకు సైతం కేటాయించాలన్నారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి కెటిఆర్ మంగళవారం ఒక లేఖను రాశారు. ఈ బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్లను ప్రకటించిన కేంద్రం అన్ని విధాలా అనువైన పరిస్థితులున్నప్పటికీ తెలంగాణను విస్మరించడం పట్ల మంత్రి కెటిఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతన రాష్ట్రానికి ఇలాంటి కారిడార్లను కేటాయిస్తే ఇక్కడి యువతకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని కెటిఆర్ అన్నారు. తెలంగాణలో ఉన్న ఏరో స్పేస్ డిఫెన్స్ అనుకూల వాతావరణాన్ని మంత్రి తన లేఖలో వివరించారు. ఈకో సిస్టమ్ ఉన్న చోట డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయిస్తేనే మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. తెలంగాణ వ్యూహాత్మకంగా మంచి ప్రదేశంలో ఉన్నదని, ఇక్కడి డిఆర్‌డిఒ, బిడిఎల్, డిఆర్‌డిఎల్, మిధాని, ఆర్‌సిఐ, ఎన్‌సిఎల్ వంటి రక్షణ రంగ సంస్థలు ఇక్కడే ఉన్నాయని మంత్రి తన లేఖలో గుర్తు చేశారు. దీంతో పాటు టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్, హెచ్‌బిఎల్, అస్ట్రా మొదలైన ప్రైవేటు రంగ సంస్థలు ఏరో స్పేస్ , డిఫెన్స్ రంగంలో పని చేస్తున్నాయన్నారు. ఆయా సంస్థలు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు భాగస్వాములుగా ఉన్నాయని, ఇలాంటి చోటనే డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేస్తే పెట్టుబడులు భారీగా వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రపంచం నలుమూలల నుండి విమాన సౌకర్యం ఉన్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, వరంగల్, బేగంపేట, దుండిగల్, హకీంపేటలో విమానాశ్రయ సదుపాయం ఉందన్నారు. దీంతో పాటు ఇతర నగరాలకు లేని 8 లైన్ల హైస్పీడ్ ఔటర్ రింగ్ రోడ్ సౌకర్యం హైదరాబాద్ నగర సొంత మన్నారు. తెలంగాణకు ఉన్న మౌలిక వసతులతో పాటు తెలంగాణ ప్రభుత్వం ఏరోస్పేస్ డిఫెన్స్ రంగాన్ని ప్రాధాన్యత రంగంగా పెట్టుకున్నదన్నారు. ఈ మేరకు ఆదిభట్ల, జిఎంఆర్ ఏయిర్ పోర్టుకు ఆనుకుని ఉన్న రెండు పార్కుల్లో ఇప్పటికే ఈ రెండు రంగాల్లో ఉత్పత్తులు కొనసాగుతున్నాయన్నారు. దీంతో పాటు ఎలిమినేడులో మరో ఏరో స్పేస్ పార్కు, మెదక్ జిల్లాలోని నిమ్జ్‌లో మరొక ఏరో స్పేస్ డిఫెన్స్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. దీంతో పాటు నగరంలో డిఫెన్స్ ఇంక్యూబేటర్ ఏర్పాటును సైతం ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ప్రాట్ అండ్ విట్నీ వంటి సంస్థలు తమ ఇంజిన్ శిక్షణ కేంద్రంగా నగరాన్ని ఎంపిక చేసుకుందన్నారు. తెలంగాణలో 26 యూనివర్సిటీలు, 700లకు పైగా ఇంజనీరింగ్ కాలేజీలు సుమారు 280 పాలిటెక్నిక్ కాలేజీలున్నాయని, వీటి ద్వారా ప్రతి ఏటా టెక్నికల్ పరిజ్ఞానం ఉన్న యువకులు బయటకు వస్తున్నారన్నారు. నగరంలో కనీసం 1000 ఎంఎస్‌ఎంఈ డిఫెన్స్, ఏరో స్పేస్ రంగంలో పని చేస్తున్నాయని లేఖలో ప్రస్తావించారు. అనేక భారత రక్షణ, అంతరిక్ష కార్యక్రమాల్లో వీటికి భాగస్వామ్యం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించి తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను కేటాయించాలని కోరారు.

ఓట్ల కోసమే పెట్టుబడి పథకం

మన తెలంగాణ/హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసమే ఎకరాకు రూ.4 వేల పథకాన్ని తీసుకువస్తున్నారని మాజీ మంత్రి డి.కె.అరుణ ఆరోపించారు. రైతులను పట్టించుకోవాలనే సోయి నాలుగేళ్ళ తరువాత వచ్చిందన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాలుగు విడతలుగా చేసిన రుణమాఫీ వడ్డీ చెల్లింపుల మాఫీకే సరిపోయిందన్నారు.వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని రౌడీ సమన్వయ సమితిలను ఏర్పాటు చేశారని, వాటినే నే రైతు సమన్వయ సమితి అంటున్నారని ఆరోపించారు.

పాదయాత్రకు రూట్ మ్యాప్ : అలంపూర్ నుండి అదిలాబాద్ వరకు పాదయాత్ర చేసేందుకు పార్టీ అనుమతి కోరానని, దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధమవుతోందని డి.కె.అరుణ అన్నారు. జర్నలిస్టులతో ఆమె ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో ముఖ్య ప్రాంతాలను కలుపుతూ పాదయాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ హామీల అమలు, సర్కారు వైఫల్యాలపై ప్రజలకు వివరిస్తానని తెలిపారు.



"నీ మాటలను, చేతలను పొగిడేవారికంటే, నీ తప్పిదాలను మృదువుగా వివరించేవారే నమ్మదగిన వారు. – సోక్రటీస్"

చైనాలో మళ్లీ జీవితకాల అధ్యక్షపదవి



సంపాదకీయం

చైనా పీపుల్స్ రిపబ్లిక్ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు పదవీ కాలాల పరిమితిని ఎత్తివేస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని చైనా కమ్యూనిస్టుపార్టీ ఉన్నత స్థాయి నాయకత్వం తీసుకున్న నిర్ణయం తిరోగమన చర్యగా గర్హించాల్సిన విషయం. ఇది వ్యక్తిపూజకు, నియంతృత్వానికి దారితీస్తుందని చైనా విప్లవ సారథి మావో సే టుంగ్(మావో జెడాంగ్) పాలన నిరూపించింది. మావో చివరికాలంలో పరిణామాలు చైనా కమ్యూనిస్టుపార్టీకి, సమాజానికి ఎంతో చేటు చేశాయి. ఆ చేదు అనుభవం నేర్పిన పాఠాలనుంచే డెంగ్ సియావో పింగ్ సమష్టి నాయకత్వ సూత్రాన్ని అమలులోకి తెచ్చారు. అధ్యక్ష పదవీకాలాన్ని రెండు టరంలకు (పదేళ్లు) పరిమితం చేస్తూ రాజ్యాంగంలో పొందుపరిచారు. దాన్ని అనుసరించే జియాంగ్ జెమిన్, హు జింటావో చెరో రెండు పదవీకాలా లు బాధ్యతలు నిర్వహించారు. ఈ సూత్రం సజావుగా నాయకత్వ మార్పు ను సుగమం చేసింది. ప్రస్తుత అధ్యక్షుడు క్సిజిన్‌పింగ్ 2013లో ఆ విధంగానే అత్యున్నత పదవిలోకి వచ్చారు. చైనా దేశ అధ్యక్ష పదవి మన దేశంలో లాగా అలంకార ప్రాయమైనదికాదు. అది కార్యనిర్వాహక పదవి. అత్యంత శక్తి మంతమైన చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి అతని చేతిలోనే ఉంటుంది. కాబట్టి పార్టీ, ప్రభుత్వం రెండింటిపై ఏకవ్యక్తి ఆధిపత్యం నెలకొంటుంది. వ్యక్తి నియంతృత్వానికి దారితీసే ప్రమాదం ఇందులో ఎప్పుడూ పొంచి ఉంటుంది.

క్సి జిన్‌పింగ్ గొప్ప నాయకుడే కావచ్చు. ప్రస్తుతం అమెరికా తదుపరి రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగి ఉన్న చైనాను అగ్రరాజ్యం స్థానానికి తీసుకెళ్ళటం, చైనా సమాజాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లగల దార్శనికత, ఆలోచన ఉన్న నాయకుడే కావచ్చు. పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక పార్టీలో, సమాజంలో అవినీతిపై పెద్ద పోరాటమే చేస్తున్నారు. ఆసియాను యూరప్‌తో కలిపే పాత వాణిజ్య మార్గం ''సిల్క్‌రోడ్'' పునరుద్ధరణ ఆయన తలపెట్టిన బృహత్ కార్యక్రమం. వర్ధమాన దేశాల అభివృద్ధికి పెద్ద ఎత్తున సహాయం అందిస్తున్నారు. అదే సమయంలో సర్వ సైన్యాధ్యక్షుడైన క్సి రెడ్ ఆర్మీని ఆధునికీకరిస్తున్నారు. దక్షిణ చైనా సముద్రం, తూర్పు చైనా సముద్రంలో తమ భౌగోళిక ఆధిపత్యం కొరకు సైనిక శక్తిని ఉపయోగిస్తున్నారు. చైనా లక్ష్యాలపట్ల అనేక ఆసియా దేశాల్లో అనుమానాలున్నాయి.

2012 లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన క్సి జిన్‌పింగ్‌కు చైనా కమ్యూనిస్టు పార్టీ ఇప్పటికే మావో సే టుంగ్ ప్రతిపత్తిని కల్పించింది. చైనా లక్షణాలతో సోషలిజం నిర్మాణం గూర్చిన ఆయన ఆలోచనను పార్టీ నిబంధనావళిలో చేర్చింది. మావో తదుపరి ఈ అరుదైన గౌరవం జిన్‌పింగ్‌కు దక్కింది. ఆయనకు జీవితకాల నాయకత్వ ప్రమోషన్ రాబోతున్నట్లు గత అక్టోబర్‌లో జరిగిన చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభలోనే సూచన వెల్లడైంది. చైనా కమ్యూనిస్టుపార్టీ అనుసరిస్తున్న సునాయాస అధికార బదిలీ ఏర్పాటు ప్రకారం, ఒక నాయకుడు తన రెండవ పదవీకాలంలోకి వచ్చినపుడు అతని వారసుణ్ణి పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా నియమిస్తారు. ఆ తదుపరి అతడు దేశ ఉపాధ్యక్ష స్థానంలోకి వస్తాడు. పరిపాలనా నిర్వహణలో అనుభవం సంపాదించేందుకు ఈ ఏర్పాటు చేశారు. అయితే అక్టోబర్ మహాసభలో జిన్‌పింగ్ డిప్యూటీని నియమించలేదు. మార్చి ఐదున ప్రారంభమయ్యే పీపుల్స్ కాంగ్రెస్ 64 ఏళ్ల జిన్‌పింగ్ కు దేశాధ్యక్ష రెండవ ఐదేళ్ల పదవీకాలాన్ని ఖరారు చేయటంతో పాటు పదవీ కాలాల పరిమితిని తొలగించే రాజ్యాంగ సవరణను ఆమోదిస్తుంది.

ఇది ఏ నాయకునికైనా అధికారాన్ని నిలుపుకోవటానికి ఒక వ్యసనంగా మారవచ్చు. దీన్ని అంటిపెట్టుకుని ఉండే వ్యక్తిపూజ వందిమాగధులను చేరదీస్తుంది, అప్రియాలను విననొల్లదు. ఇది పరిమిత పదవీకాలాలకు భిన్నంగా నియంతృత్వానికి దారితీస్తుంది. జిన్‌పింగ్ అలా వ్యవహరిస్తాడా లేడా అన్నది ప్రశ్నకాదు. అది దాని లక్షణం. అందువల్ల ఏక వ్యక్తికి అనిర్దుష్ట కాల అధికారం అప్పగించే చైనా కమ్యూనిస్టుపార్టీ నిర్ణయం నిస్సందేహంగా చరిత్రను దాటవేస్తున్న తిరోగమన చర్య.


తుపాకీ మెడపై ఫ్లోరిడా కత్తి!



ఫ్లోరిడా స్కూలులో ఇటీవల సస్పెండైన ఒక విద్యార్థి 17 మంది సహవిద్యార్థులను, టీచర్లను దారుణంగా తుపాకీతో కాల్చిచంపిన ఘటన అమెరికాలో తుపాకుల సంస్కృతిపై ఏవగింపును పెంచింది. తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతుండడంతో తమ మిత్రులను తాజా ఘటనలో కోల్పోయిన ఫ్లోరిడా విద్యార్థులు ఈ సంస్కృతిని దేశం నుండి తరిమేయాలని ప్రతిన పూనారు. వారు చేపట్టిన ఉద్యమ ఫలితంగా తుపాకి సంస్కృతిపై సాగుతున్న చర్చ హఠాత్తుగా తీవ్రత సంతరించుకుంది. త్వరలో అమెరికాలో ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే అధికార పదవులకు జరగనున్న మధ్యంతర ఎన్నికలను ఈ ఉద్యమం ప్రభావితం చేసే అవకాశం ఉంది. తన తోటి విద్యార్థులను ఈ దారుణంలో కోల్పోయిన డేవిడ్ హోగ్ అనే విద్యార్థి ఈ ఉద్యమానికి సారథ్యం వహిస్తున్నాడు. తనలాగే మిత్రులను కోల్పోయిన మరికొంతమంది సహవిద్యార్థులను కలుపుకుని ముందుకు సాగుతున్నాడు.

తుపాకుల అమ్మకాలను నియంత్రించడంలో చట్టసభ సభ్యులు తోడ్పడాలన్నది వారి డిమాండ్. తుపాకుల సంస్కృతికి అనుకూలంగా వ్యవహరిస్తున్న నేషనల్ రైఫిల్ అసోసియేషన్(ఎన్ఆర్ఎ) నుంచి నిధులను స్వీకరించవద్దని వారు రాజకీయ వేత్తలను డిమాండ్ చేస్తున్నారు. మార్చి 14న ఈ అంశంపై జాతీయ స్థాయిలో 'స్కూల్ వాకౌట్' నిర్వహించాలని ఉద్యమకారులు పిలుపు నిచ్చారు. 10 రోజుల తరువాత వాషింగ్టన్‌లో 'మన ప్రాణాలకోసం యాత్ర' కార్యక్రమాన్ని కూడా వారు తలపెట్టారు. అమెరికాలో చాలాకాలం గా తుపాకుల సంస్కృతిపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో తుపాకులు కలిగి ఉండడాన్ని సమర్థించేవారు, వ్యతిరేకించేవారుగా అమెరికా పౌరులు చీలిపోయి వున్నారు. సామూహిక కాల్పుల ఘటనలను తక్షణం నివారించాలని ప్రజలలో కొందరు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. నవంబర్‌లో జరుగనున్న ఎన్నికలపై ఈ విద్యార్థులు ఇప్పుడు దృష్టిపెట్టారు. ఈ ఏడాది మొదటిసారి ఓటుహక్కు వినియోగించబోతున్న విద్యార్థులకు వారు ప్రత్యేకంగా విజ్ఞప్తిచేస్తున్నారు. అంతేకాకుండా ఓటర్లందరూ తుపాకి హక్కులపై నియంత్రణ సాధించాల్సిన పరిస్థితిని ఓటింగ్ సమయంలో దృష్టిలో పెట్టుకోవాలని వారు కోరుతున్నారు. చాలాఏళ్లుగా వస్తున్న సలహాల కంటే ఈ విషయంలో కొద్ది రోజులలోనే వీరి ఉద్యమం గట్టి ప్రభావాన్ని చూపుతోందన్న వార్తలు వినపడుతున్నాయి.

తుపాకుల సంస్కృతిని నియంత్రించాలన్న డిమాండ్‌ను అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్‌లు వ్యతిరేకిస్తున్నారు. తుపాకులు కలిగి ఉండడం రాజ్యాంగ హక్కని వాదిస్తున్నారు. జాతీయ రైఫిల్ సంఘం ఎన్ఆర్ఎకు నిధులివ్వడం మానాలని దాని దాతలను విద్యార్థులు కోరుతున్నారు. రాజకీయంగా ఎంతో పలుకుబడి గల ఈ గ్రూపునుంచి నిధులు తీసుకోవద్దని కాంగ్రెస్ సభ్యులపై కూడా వారు ఒత్తిడి తెస్తున్నారు. ఈ యుక్తవయసు ఉద్యమ కారులు ఓప్రావిన్ ఫే, జార్జి క్లూని వంటి సెలబ్రిటీల నుంచి లక్షలాది డాలర్ల విరాళాలు ఈ సరికే సేకరించారు. హాలీవుడ్‌లోని ప్రముఖులు కొందరు వీరి ఉద్యమానికి ప్రచారం కల్పించడంలో సహకరిస్తు న్నారు. ప్రత్యేకంగా ఈ డిమాండ్‌తో మహిళల యాత్రను నిర్వహించ టానికి ఉద్యమ కారులు సంకల్పించారు.



ఫ్లోరిడా వద్ద పార్క్‌లాండ్ ప్రాంతంలోని స్కూలులో ఇటీవల జరిగిన కాల్పుల ఘటన అమెరికాలో తుపాకి సంస్కృతికి తెరపడాలన్న డిమాండ్‌ను తెరమీదికి బలంగా తీసుకువచ్చింది. సోషల్ మీడియాలో ఉద్యమం ప్రచారం విస్తృతంగా సాగించడం ఈ విద్యార్థులు సాధించిన ఘనత. ఉద్యమ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రసంగాలు సామాజిక మీడియాలో విశేషంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఇది అమెరికా యువతరంలో ఊహించని తుపానును సృష్టిస్తోంది. నిర్వహణపరమైన పకడ్బందీ ఏర్పాట్లతో విద్యార్థి ఉద్యమకారులు ముందుకు సాగుతున్నారని సివిక్ మీడియా నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఈ టీనేజర్లకు డెమొక్రాట్లనుంచి విశేషంగా మద్దతు లభిస్తోంది. ఈ ఉద్యమం ఫలితంగా యువడెమొక్రాట్ ఓటర్లు రానున్న ఎన్నికలలో పెద్దగా పాల్గొనకుండా ఎన్నికలకు దూరం పాటిస్తారని వారు భావిస్తున్నారు.

ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని అధికారిక పదవులలోని వారు రాజీనామా చేయగా, కొందరిని ట్రంప్ తొలగించారు. ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే ఆ పదవులకు త్వరలో పోలింగ్ జరగనుంది. ఈ ఏడాది వేరువేరు తేదీలలో ఈ ఎన్నికలు జరుగుతాయి. వాటిపై ఉద్యమప్రభావం అధికంగా ఉండవచ్చు. అయితే ఈ విద్యార్థి ఉద్యమంపై రిపబ్లికన్‌లు పెదవి విరుస్తున్నారు. అది ఫ్లోరిడాను మించి వ్యాపించదని జోస్యం చెబుతున్నారు.తమ ఉద్యమంపై వ్యాఖ్యానించవలసిందిగా ఎన్ఆర్ఎను విద్యార్థులు కోరారు. అయితే అది ఇంతవరకు మౌనం పాటించింది. పార్కు లాండ్ కాల్పుల ఘటనను డెమొక్రాట్లు రాజకీయం చేస్తున్నారని ఇటీవల ఎన్ఆర్ఎ పెద్దలు బాహాటంగా విమర్శించారు. వారు చాలా కాలం నుంచి తుపాకుల నియంత్రణ సలహాదారులను తప్పుపడు తున్నారు. అనేక అమెరికా కాలేజీలు, యూనివర్శిటీలతో పాటు 3 ఐవి లీగ్ స్కూళ్ల విద్యార్థులు కూడా ఫ్లోరిడా విద్యార్థులకు మద్దతు పలుకు తున్నారు. శనివారం నాడు తమ ఉద్యమంపై ట్విట్టర్‌లో వ్యాఖ్యలు చేస్తూ, రానున్న సెలవులలో ఉద్యమంలో ఉధృతంగా చేరాలని హోగ్ పిలుపు నిచ్చారు.

2012లో కూడా తుపాకి కాల్పులలో అనేకమంది విద్యార్థులను ఊచకోత కోసిన ఘటనలు జరిగాయి. అప్పటినుంచి తుపాకులు కలిగి ఉండడాన్ని నిషేధించాలని ఆ సంస్కృతి నియంత్రణ వాదులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని ప్రతిపాదనలను అప్పట్లో సృష్టించారు. ప్రస్తుత ఉద్యమంలో ఆ ప్రతిపాదనలు మళ్లీ తెరమీదకు వస్తున్నాయి. గన్‌మాగ్ డాట్ కామ్ సీనియర్ ఎడిటర్ డేవ్ వర్క్‌మాన్ విద్యార్థి ఉద్యమ కారులవంటి తుపాకుల నియంత్రణ గ్రూపులు ఉన్నాయన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. 'సెకండ్ ఎమెండ్‌మెంట్ ఫౌండేషన్' పేరిట తుపాకీ హక్కుల గ్రూపు చేసే వాదనలను ఆ పత్రిక విశేషంగా ప్రచురిస్తూ ఉంటుంది. తమకు ఏ ఒక్కరి ఆమోదముద్ర అవసరం లేదని విద్యార్థి ఉద్యమకారులు అంటున్నారు. తాము రిపబ్లికన్, డెమొక్రాట్‌లో ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉద్యమం చేయటం లేదని, భవిష్యత్‌లో కూడా అదే వైఖరి కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. రెండు పార్టీల రాజకీయ వాదులు ఈ విషయం లో అవినీతిపరులని హోగ్ విమర్శించాడు. 2016లో ఫ్లోరిడాలోని ఓర్లాండో వద్ద పల్స్ నైట్ క్లబ్ కాల్పుల ఘటనలో బ్రతికి బయటపడ్డ బ్రాండన్ ఉల్ఫ్ పార్క్‌లాండ్ స్కూలు విద్యార్థుల ఉద్యమాన్ని ప్రశంసించారు. ఇది ఏళ్లతరబడి పేరుకున్న స్తబ్దతను ఛేదించే ఉద్యమమని పేర్కొన్నారు.

* ఆండ్రూ హే

ఎత్తుపెరిగిన H-1B కంచె



బి.నర్సన్
9440128169

ట్రంప్ వలసలపై కత్తెరెత్తినప్పుడల్లా మనదేశం గగ్గోలు పెడుతుంది. అమెరికాపై ఆశలు గల్లంతు, వలసలపై బుసకొట్టిన ట్రంప్ అని పతాక శీర్షికలు పత్రికల్లో చేరుతాయి.

ఏప్రిల్ 2 నుంచి హెచ్–1బి వీసాలకు దరఖాస్తులు స్వీకరించే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిబంధనలను మరింత కఠినతరం చేశాడు. 'అమెరికా ఉత్పత్తులను కొనాలి – అమెరికన్లనే నియమించుకోవాలి' అంటూ ఆయన జారీ చేసిన విధానపత్రాన్ని అమెరికా పౌర, వలసల సేవల విభాగం ప్రకటించింది.

వలసలను, ఉదార వాణిజ్య సూత్రాలను ఎండగడుతూ ట్రంప్ ఎన్నికల్లో అమెరికన్లకు ఇచ్చిన హామీలే. అవే ఆయన్ను శ్వేతసౌధం వైపు నడిపించాయి. ఆయన జాతీయవాద ధోరణి సగటు అమెరికా పౌరుడిని ఆకర్షించింది. గత ప్రభుత్వాల సమయంలో దేశీయ అవసరాల నిమిత్తం వలసలు పెరిగినా అది అమెరికా స్థానిక పౌరుల జీవనశైలిపై అధికంగా ప్రభావం చూపింది. ఆ అసహనం ట్రంప్‌కు గెలుపు కార్డు అయింది. ఎన్నికల విశ్లేషణ పండితుల అంచనాలు తారుమారు చేస్తూ డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా గెలవడంలోనే ఎవరి ఊహకు అందని 'స్థానిక' మద్దతు ఆయనకుంది. ఉన్న వ్యవస్థను కొనసాగించేలా హిల్లరీ, మార్పును కోరే మనిషిగా ట్రంప్ అమెరికన్లకు కనపడ్డారు.

హెచ్–1బి వీసాల జారీ కఠినతరం చేయడం అమెరికా దేశీయ అవసరాల్లో ఒకటి. పారిశ్రామికాభివృద్ధికై అమెరికా కంపెనీలు బయటి దేశాల నిపుణులపై ఆధారపడడం పెరిగి పెరిగి స్థానికుల ఉద్యోగిత దెబ్బతింది. తక్కువ వేతనంతో పనిచేయడానికి చైనా, ఇండియా తదితర దేశాలనుంచి ఉద్యోగులు సిద్ధమవడంతో అమెరికా కంపెనీలే కాకుండా భారత ఐటి కంపెనీలు కూడా వలసలపై ఆధారపడ్డాయి.

అమెరికా ప్రతి ఏడు హెచ్–1బి వీసాలను జారీ చేస్తుంది. క్రమంగా వాటి సంఖ్య పెంచుతూ గత ఏడాది 85,000 హెచ్–1 వీసాలు ప్రకటించింది. వాటికోసం ప్రకటించిన వారం రోజుల్లోనే 2,33,000 దరఖాస్తులు వచ్చాయి. హెచ్–1 బి వీసాల్లో 70% భారతీయులకే సొంతమవుతున్నాయి. 85,000 వీసాలు ప్రకటించినా వివిధ కంపెనీల ఒత్తిడికి, ప్రాబల్యానికి లోనై వాటి సంఖ్య లక్షకు చేరింది. హెచ్–1 బి వీసా పొందినవారు మూడేళ్లు అమెరికాలో ఉండొచ్చు. అవసరమైతే మరో మూడేళ్ల కాలానికి పొడిగించవచ్చు. ఇలా అమెరికా వెళ్లిన వారిలో అధికులు అక్కడే ఉండిపోతున్నారు. పంపిన కంపెనీ ఉద్యోగాన్ని ఒదిలి పెట్టి అమెరికా కంపెనీలో ఉద్యోగం సంపాదించి అక్కడే కొనసాగేందుకు ఇష్టపడుతున్నారు.

అమెరికాలో తగిన నిపుణులు దొరకని పక్షంలో బయటినుంచి తగిన వారిని తాత్కాలిక ప్రాతిపదికన దేశంలోకి అనుమతించడమే హెచ్–1బి వీసా విధానం. అయితే ఇది ఇంతకాలం ఐటి కంపెనీల ఇష్టారాజ్యంగా నడిచిందనవచ్చు.

ఇప్పుడు హెచ్–1బిలో తెచ్చిన మార్పుల ప్రకారం వచ్చే ఉద్యోగి ఎంతకాలముంటాడో ముందే చెప్పేయాలి. ఉండాల్సిన కాలం పెరిగే పక్షంలో ముందే అనుమతి తీసుకోవాలి. అంతే కాకుండా లక్షా ముప్పై వేల డాలర్ల ప్యాకేజీ ఆ పైన ఉన్న ఉద్యోగులనే ఈ వీసాపై అమెరికాకు పంపించాలి. అంటే అంతకన్నా చిన్న జీతాలు ఉన్న ఉద్యోగులను బయటినుండి రప్పించుకోకుండా స్థానికులతోనే ఆ పనులు చేయించుకోవాలి. అయితే స్థానికుల నియామకంతో కంపెనీలపై ఆర్థిక భారం పడుతుంది. ఎందుకంటే బయటి ఉద్యోగుల కన్నా స్థానిక ఉద్యోగులకు రెండు, మూడు రెట్ల అధిక జీతం చెల్లించవలసి ఉంటుంది. ఇంత కాలం ఐటితో సహా అన్ని రకాల పరిశ్రమలు హెచ్–1 బి వీసాను వాడుకొని లాభపడ్డాయి.

> మనదేశం నుండి అమెరికా వెళ్లేవారి సంఖ్య 1980–2010 మధ్య ప్రతి దశాబ్దానికి రెండింతలైంది. 1980–2015సం॥ మధ్యన భారతీయుల సంఖ్య 2 లక్షల నుండి 24 లక్షలకు పెరిగిందని అమెరికా జనాభా బ్యూరో వెల్లడించింది. అమెరికాలో ఉన్న 4కోట్ల విదేశీయుల్లో మనం 6% ఉన్నాం. మెక్సికన్ల తర్వాత మనదే పెద్ద సంఖ్య. ఒకప్పుడు మేధోసంపద తరలింపు (బ్రెయిడ్ డ్రెయిన్) దేశానికి నష్టమని వ్యాసరచనలు సాగేవి. ఇప్పుడు విదేశాలకు వెళ్లి విలాసంగా బతకండని ప్రభుత్వాలే సాగనంపుతున్నాయి. దీని ఫలితం కాలమే చెబుతుంది.

ఇక మన తెలుగురాష్ట్రాల విషయానికొస్తే ఎదిగిన పిల్లల వీపులపై బిటెక్ ముద్ర వేయించి వారిని అమెరికాకు సరఫరా చేయడమే తల్లిదండ్రుల లేదా పిల్లల లక్ష్యమైపోయింది. పిల్లలు సైతం అమెరికా కాన్సొలేటు స్టాంపింగ్ చేస్తే చాలు జీవితం ఇంద్రధనుస్సుపై నడయాడుతుందనుకుంటారు.

ఏదో ఓ కాలేజీలో ఎంఎస్ అడ్మిషన్ దొరికి ఐ–20 చేతిలో పడితే చాలు రెక్కలు కట్టుకొని అందాల లోకానికి బదిలీ అవుదామని లక్షలాది విద్యార్థులు ఆశపడుతున్నారు. చదువు నెపంతో అమెరికాలో కాలుపెట్టి అక్కడే స్థిరపడడమే అందరి లక్ష్యం. చదువు పూర్తయ్యాక తిరిగి వచ్చిన వారి శాతం అయిదుకు మించదు.

చదువుకునే సమయంలో కూడా పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ తమ ఖర్చులు భారం కాకుండా చూసుకోవడం విద్యార్థులకు అలవాటై పోయింది. దీనివల్ల కూడా స్థానిక శ్రామికులు చిక్కు ల్లో పడ్డారు. పుట్టిన దేశాన్ని వదిలిపెట్టి పరాయి దేశం లో బతకాలని కలలు కనడమే దోషగుణం. గుట్టకు ఆవలివైపున్న గడ్డి మరింత పచ్చగా ఉంటుందని ఆశపడడంలోని మంచిచెడులు అవతలివైపుకు వెళితేగాని బోధపడదు.

అమెరికాలో ఎన్నేళ్లున్నా పరాయి వాళ్లే. అక్కడ జాత్యాహంకారం పెరిగితే బలిపశువులు కాక తప్పదు. పాలకులు మారుతుంటారు. పాలనా విధానం మారుతుంది. చిన్నచిన్న సంస్కరణలకే బెంబేలు పడుతుంటే భవిష్యత్తులో మరింత కఠినమైన నిబంధనలు రావచ్చు. గ్రీన్‌కార్డు సైతం కాపాడని రోజులు రావచ్చు. ట్రంప్ విజయంతో వెర్రితలలు వేసిన జాతి గర్వం 'మాదేశం నుండి వెళ్లిపో' అంటూ కూచిబొట్ల శ్రీనివాస్ ప్రాణాల్ని తీసుకుంది.

అమెరికాలో విశాలమైన రోడ్లు, శుభ్రమైన వీధులు, ఆకాశహర్మ్యాలతో జీవితం గొప్పగా కనిపించవచ్చు. కాని కాలక్రమంగా ఇంటికి దూరమైనతనం వెంటాడుతుందని గోప్యంగా చెప్పుకునే వాళ్లున్నారు. తమ సంతానం అమెరికా వెళ్లిందని అందరికీ గర్వంగా చెప్పుకునే తల్లిదండ్రులు వయసు మీదపడి శారీరక మానసిక క్షోభకు గురవుతున్నారు. యాభైఏళ్లు దాటిన తర్వాత పుట్టిన నేలపై మమకారం చంపుకోలేక, ఇక్కడికొచ్చి ఎలా గడపాలో అర్థంకాక అక్కడే సతమతమవుతున్నారు.

నిజంగానే ఆ దేశం మా దగ్గరికి రండి మీకు గౌరవప్రదమైన జీవితం అందిస్తామని పిలిస్తే మంచిదే గాని చదువుపేరు మీద, రకరకాల వీసాలమీద అక్కడ వాలి అధికారికంగానో, అనధికారికంగానో పట్టుకుని వేలాడడాన్ని ఏమనాలి?

లాటరీ పద్ధతికి స్వస్తి చెప్పి, ప్రత్యేక నైపుణ్యం గల వాళ్లనే అమెరికాకు ఆహ్వానించటం ఇరు వర్గాలకు మంచిదని, ఇదొక సుసంప్రదాయాన్ని పాదుకొల్పుతుందని అమెరికా ఆర్థికవేత్తలు అంటున్నారు.

చట్టాలను సవరించుకోవడం ఆ దేశ ఆవశ్యకతగా భావించాలి. అది బయటివారికి కష్టం కలిగినా స్వదేశీయులకు మేలు చేస్తే చాలు.

మనదేశం నుండి అమెరికా వెళ్లేవారి సంఖ్య 1980–2010మధ్య ప్రతి దశాబ్దానికి రెండింతలైంది. 1980–2015సం॥మధ్యన భారతీయుల సంఖ్య 2 లక్షల నుండి 24లక్షలకు పెరిగిందని అమెరికా జనాభా బ్యూరో వెల్లడించింది.

అమెరికాలో ఉన్న 4కోట్ల విదేశీయుల్లో మనం 6% ఉన్నాం. మెక్సికన్ల తర్వాత మనదే పెద్ద సంఖ్య.

ఒకప్పుడు మేధోసంపద తరలింపు (బ్రెయిడ్ డ్రెయిన్) దేశానికి నష్టమని వ్యాసరచనలు సాగేవి. ఇప్పుడు విదేశాలకు వెళ్లి విలాసంగా బతకండని ప్రభుత్వాలే సాగనంపుతున్నాయి. దీని ఫలితం కాలమే చెబుతుంది.

శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించాలి



సి.రామరాజు,
రాష్ట్ర ఉపాధ్యక్షులు,
జన విజ్ఞాన వేదిక
9441967100

ఎడిటర్ కు లేఖలు

ప్రజలెదుర్కొంటున్న అన్ని రకాల ఆర్థిక, సామాజిక, నైతిక , సాంస్కృతిక సమస్యలకు పరిష్కార మార్గాలను శాస్త్ర, సాంకేతిక రంగాలు చూపించగలవు. ఉత్పత్తి సాధనాల ద్వారా వచ్చే ఉత్పత్తులను ప్రజలకందించినపుడు వారి సమస్యలైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, వినోదం, వికాసం వంటి మానవీయ అవసరాలన్నీ తీరుతాయి.కానీ దీనికనుకూలమైన సామాజిక నిర్మాణం నేటి మన సమాజంలో లేదు. కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు ప్రకృతి వనరుల్ని ప్రభుత్వాలే కట్టబెట్టిన దోపిడి వర్గ వ్యవస్థ నేటి సమాజంలో నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో అసమానతలను, దోపిడి పాలనను కొనసాగించడానికి ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తాయి. శాస్త్రీయ నియమాలకు వ్యతిరేకంగా జరిగే ప్రతీ చర్య, ప్రతీ భావన మూఢనమ్మకంగా భావించాలి. ప్రజలు తమ కష్టాలు పోవడానికి ఏ వాస్తవిక పరిష్కారం అందుబాటులో లేనపుడు నిస్సహాయత, అభద్రతా భావానికి లోనవుతారు. అప్పుడు అలౌకిక శక్తులను ఆశ్రయిస్తారు. అభూత శక్తుల ఆసరాను కోరుకుంటారు. అలాంటి అభద్రతా భావం నుంచే, అజ్ఞానం నుంచే మతం ఆవిర్భవించింది. కాని పాలక వర్గాలు ప్రజలెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వాస్తవ జగత్తులో (వర్తమాన భౌతిక ప్రపంచంలో) కాకుండా మిథ్యా జగత్తులో పరిష్కార మార్గాలను చూపించడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంటాయి.

నేడు ప్రపంచ వ్యాప్తంగా పాలక వర్గాలు వేగంగా అమలు చేస్తున్న స్వేచ్ఛా మార్కెట్ అనుకూల ఆర్థిక విధానాలతో ఒకవైపు పోటీ ప్రపంచాన్ని నెలకొల్పుతూ, మరోవైపు వ్యక్తి వాదాన్ని బలం గా ముందుకు తీసుకువస్తున్నారు. వ్యక్తివాదాన్ని, పోటీతత్వాన్ని ఏకకాలంలో ప్రోత్సహించడం వల్ల ఎవరి కష్టాలకు వారే బాధ్యులన్నట్టుగా ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరిస్తున్నాయి. దేశం లో 73శాతం సంపద కేవలం ఒక్కశాతం ప్రజల వద్దే (ధనికుల వద్దే) కేంద్రీకృతమైందన్న కఠోర నిజం పాలకుల నిజస్వరూపాన్ని తెలియ చేస్తుంది. పాలకులు చెప్పే మానవ ముఖంతో కూడిన ప్రపంచీకరణ అబద్ధమని, సమ్మిళిత అభివృద్ధి బూటకమని తేలిపోయింది.

చారిత్రకంగా మన తెలంగాణ రాష్ట్రానికి భూస్వామ్య, జమీందారీ వ్యవస్థగా పేరుంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం నేటికీ కొనసాగుతోంది. అసమానతలు, నిరక్షరాస్యత, వెనుకబాటుతనం, చివరకు అంటరానితనం కూడా వివిధ రూపాల్లో నేటికీ కొనసాగుతుండడం ఒక కఠోర వాస్తవం. ఈ విధమైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యంలో పెరిగిన మన సమాజంలో సహజంగానే మూఢనమ్మకాలు కూడా హెచ్చుగా ఉంటాయి. నేడు పాలకులు మతప్రసక్తి లేని లౌకిక రాజ్యమైన భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారానికి వచ్చిన తర్వాత దానికి పూర్తి భిన్నంగా ప్రవర్తించడాన్ని మనం చూస్తున్నాం. యజ్ఞాలు, చండీయాగాలు, వాస్తు, జ్యోతిష్యం, మొక్కులు, మొదలైన మూఢ విశ్వాసాలకు మన పాలకులే ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ప్రచారం కల్పిస్తున్నారు. ఇటీవల మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరగాల్సిన సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు వాయిదా పడటం పాలకుల అశాస్త్రీయ భావజాలానికి పరాకాష్ఠ. ప్రజలు శాస్త్రీయతవైపు కాకుండా నమ్మకాలు, విశ్వాసాల వైపు మరలేలా ఇవన్నీ దోహదపడుతున్నాయి.

బాణామతి, చేతబడి, చిల్లంగి, మంత్రాలు, తాయెత్తులు, చేప మందు, స్వస్థత కూటములు ...ఇలా రకరకాల పేర్లతో అశాస్త్రీయ రోగనివారణ పద్ధతులు, టెలిథెరపి, న్యూమరాలజీ, ఉంగరాలు, దిష్టి లాంటి అనేక రకాల అశాస్త్రీయ ప్రచారాలకు, పద్ధతులకు ప్రజ లు నేడు బలైపోతున్నారు. పాలకులు ఈ మధ్య ఒక మతానికి, మత విశ్వాసాలకు చోదకులుగా ఉంటూ సెక్యులరిజం అనే రాజ్యాంగ స్ఫూర్తిని అవహేళన చేస్తున్నారు. దేశభక్తికి తప్పుడు నిర్వచనాన్నిస్తూ, వక్రీకరిస్తూ మతతత్వమే దేశభక్తిగా చూపుతున్నారు.

నేటి శాస్త్ర ఆవిష్కరణలు మనకు ఎప్పుడో తెలిసినవే అనే కుహనా ధోరణిని ప్రదర్శిస్తూ ప్రజల్ని గందరగోళ పరుస్తున్నారు. అంతర్జాతీయ శాస్త్ర ప్రపంచం ముందు మన దేశ పరువును తీస్తున్నారు. భారత రాజ్యాంగంలోని '' ప్రతిపౌరుడూ ప్రాథమిక విధిగా శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, మానవత్వాన్ని, సంస్కరణాభిలాషణ అలవర్చుకోవాలి'' అన్న ఆర్టికల్ 51.ఎ(హెచ్) కు తూట్లుపొడుస్తున్నారు. అంతేకాదు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే అభ్యుదయ శక్తుల గొంతును నలిపివేస్తున్నారు. చివరికి హేతువాదులను హత్య చేయడానికి కూడా వెనుకాడడం లేదు. మత విద్వేషాలనిపెంచడం, అభ్యుదయ శక్తుల్ని అణచివేయడమే లక్ష్యంగా ఈ రకమైన భౌతిక దాడులు జరుగుతున్నాయి. ప్రజలు ఏమి తినాలో, ఏ దుస్తులు ధరించాలో, ఏ సంస్కృతి పాటించాలో, ఎలాంటి పెళ్ళిల్లు చేసుకోవాలో వంటి అంశాలను ఈ ఛాందస శక్తులే నిర్వచిస్తున్నాయి. ప్రజల్ని తిరోగమన దిశలోనెట్టే ఈ మూఢ నమ్మకాల్ని తిప్పికొట్టడానికి 2018 ఫిబ్రవరి 28 జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా డిమాండ్ చేస్తున్నాను. ఈ జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల తరహాలో మన తెలంగాణ ప్రభుత్వం కూడా ''మూఢ నమ్మకాల నిరోధక చట్టం'' వెంటనే తేవాలని జన విజ్ఞాన వేదిక పక్షాన కోరుతున్నాను.

ప్రయోగశాలలు ఎరుగని విద్యార్థులు

నేడు మనిషి అనుభవించే ప్రతి వస్తువును కనుగొన్న ఆ శాస్త్రవేత్తల ఆలోచనలకు, ఆవిష్కరణలకు నేటి ప్రతిజీవి వారికి రుణపడి ఉండవలసిందే. ఆ శాస్త్రజ్ఞులు తయారు చేసిన, ఆవిష్కరించిన వస్తువులను అనుభవిస్తున్నామే తప్ప వారి ఆలోచనలకు తిరిగి పదునుపెట్టి భవిష్యత్తుకు అవసరమైన విజ్ఞానాన్ని మాత్రం నేటి విద్యార్థులు, యువత, నేర్చుకోవడం లేదు. నేర్పించే శాస్త్రీయ విద్యావిధానం, ఇటు పాఠశాలల్లోగాని, కళాశాలల్లోగాని, విశ్వవిద్యాలయాలలో, కనీసం పాఠ్యాంశాలలో ఎక్కడా కనిపించడం లేదు. పాఠశాలల్లో ప్రయోగశాలలు ఉండవు. విజ్ఞానశాస్త్ర పాఠాలు బోధించే ఉపాధ్యాయ నియామకాలు ఉండవు. ఇంటర్ విద్య పూర్తిగా భ్రష్టుపట్టి విద్యార్థులకు ప్రయోగాలు తెలియవు. ప్రయోగశాలలు ఉండవు. కాని కార్పొరేట్ విద్యార్థులకు నూటికినూరు మార్కులు వస్తాయి. కాని నేటి విద్యార్థుల తల్లిదండ్రులది కూడా ఒకే ఆలోచన. తమ పిల్లలు ఏదో ఒకటి చదవాలి. ఉద్యోగం చేయాలి లేక అవినీతిపరంగానో, అక్రమంగానో డబ్బు సంపాదించాలి. మా పిల్లలు, ఒక సివి రామన్, ఒక అరిస్టాటిల్, ఒక గ్రహంబెల్, ఒక మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఒక అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు కావాలనే తపన, తల్లిదండ్రులలో కూడ కలగాలి.

– వై.కరుణాకరరెడ్డి

ఈ జాగ్రత్తలు తీసుకుంటే హోలీ ఆనంద కేళి



చిన్నా, పెద్దా తేడా లేకుండా హోలీ పండుగను ప్రతి ఒక్కరు ఆనందంతో జరుపుకోవడానికి ఇష్టపడతారు. ఆనందాల హోలీ అందరిని సంతోషంగా ఉంచాలంటే కొన్నిజాగ్రత్తలు తీసుకోవల్సిందే.. హోలీ రంగులల్లో దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండుట వల్ల కొందరికి ముక్కునుంచి నీరు కారడం, ముక్కు బిగుసుకొనిపోయి శ్వాస ఆడక పోవడం, తుమ్ములు రావటం, దగ్గుతో పాటు ఆయాసం రావటం, ఛాతి బరువుగా అనిపించటం, కళ్ళు ఎర్రబడి నీరు కారడం, ఒంటిపై దద్దుర్లు, చర్మం పొడిగా మంటగా అనిపిస్తుంది. అలాగే కలుషిత రంగు నీళ్ళను చల్లు కోవటం వల్ల నీరు నోట్లోకి పోయి ఉన్నట్లుండి వాంతులు, విరేచనాలు అవుతాయి. కావున హోలీని అధిక రసాయనాలున్న రంగులతో కాకుండ ఇంట్లో తయారు చేసిన రంగుతో ఆడుకుంటే హోలీ పండుగ ఇస్తుంది ప్రతి ఇంటా ఆనందాల కేళి.

జాగ్రత్తలు....

రంగు కలిపిన నీటిలో ఎక్కువ సేపు గడపటం వలన దగ్గు, జలుబు , జ్వరం, గొంతునొప్పి లాంటివి వస్తాయి కావున నీటిలో ఎక్కువ సేపు ఉండకుండా చూసుకోవాలి.

తడిసిన బట్టలు ఎక్కువ సేపు ఒంటి మీద ఉండటం వల్ల చర్మవ్యాధులు వస్తాయి. హోలీ అనంతరం తడిసిన బట్టలను వెంటనే మార్చుకోవాలి.

హోలీ రంగుల దుమ్ము, ధూళి వల్ల ఆయాస పడుతున్నప్పుడు రోగి వెల్లకిల పడు కోకుండా, తల ఎత్తులో పెట్టుకొని కూర్చొన్న స్థితిలో ఉంచవలెను. ఆయాసము తీవ్రంగా ఉన్నప్పుడు రోగిని త్వరగా దగ్గరలోని ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకొని వెళ్లాలి.

కలుషిత రంగు నీరు, వల్ల వాంతులు, విరోచనాలు అవుతున్నప్పుడు రోగికి వెంటనే ద్రవపదార్థాలు ఇవ్వాలి. కొబ్బరి నీరు, మంచినీరు, మజ్జిగ మొదలైనవి ప్రారంభం నుంచి ఇవ్వాలి. డీహైడ్రేషన్ నివారణకు కాచి చల్లార్చిన ఒక గ్లాసు నీటిలో రెండు స్పూన్ల పంచదార, చిటికెడు ఉప్పు కలిపి ఇవ్వాలి. లేదా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఇవ్వాలి.



చికిత్స : హోలీ వల్ల వచ్చే సమస్యలకు హోమియో మందు ఆర్సెనికం ఆల్బం 30ను ఉదయం, సాయంత్రం ఒక డోసు చొప్పున వేసుకుంటే చాలావరకు ముక్కునుండి నీరు కారడం, దగ్గు, కళ్ల నుంచి నీరు కారడం, ఒంటిపై దద్దుర్లు, చర్మం పొడిగా మంటగా అనిపించటం, దురద రావటం, విపరీతమైన నీరసం వంటి సమస్యలు తగ్గుతాయి.

యంగ్ లుక్ కోసం..

ఎప్పటికీ యంగ్ లుక్‌తో కనిపించాలని ప్రతి ఒక్కరికి ఇష్టం ఉంటుంది. దీని కోసం రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు కానీ మీరు అందంగా కనిపించాలనుకుంటే మనం తీసుకొనే ఆహారంలో కొన్ని మార్పులను మార్చుకుంటే చాలు. మన అందం కూడా ఆహారం మీద ఆధారపడుతుంది. అందంగా ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషకాహారంను మనం నిత్యం తినే ఆహారనియామాలల్లో చేర్చుకోవాలి ఇలా చేయడం వల్ల ప్రస్తుతం మీరున్న వయస్సు కన్నా తక్కువగా...యంగ్‌గా స్మార్ట్ గా కనిపిస్తారు.



తృణధాన్యాలు : తృణ ధాన్యాల్లో బ్రౌన్ రైస్, క్వీనా, ఓట్స్ లలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల డైజెస్టివ్ హెల్త్ ను ప్రోత్సహిస్తుంది. తేనె: తేనెలో యాంటీఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండటం వల్ల ఇంకా క్యాల్షియం, నియాసిన్, విటమిన్ బి6, విటమిన్ సి, లు పుష్కలంగా లభిస్తాయి. రెగ్యులర్‌గా తేనె తినడం వల్ల మెమరీ లాస్, ఆందోళన సమస్య తక్కువవుతుంది. **గ్రీన్ టీ :** శరీరంలో అనవసర కొవ్వును కరిగించడమేకాకుండా యంగ్ గా కనబడేలా చేస్తుంది . రోజూ రెండు కప్పులు గ్రీన్ టీ తాగితే కొలెస్ట్రాల్ తగ్గి హార్ట్ డిసీజస్ క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు.

ఆలివ్ ఆయిల్ : ఆలివ్ ఆయిల్లో కొన్ని రకాల ఫ్యాట్స్, మోనో సాచురేటెడ్ ఫ్యాట్స్ పుష్కలంగా ఉంటాయి. హార్ట్ రిస్క్ లను తగ్గించడంతో పాటు, టిష్యు బిల్డింగ్ కు సహాయపడుతాయి. పాలీఫినాల్స్ , యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉండటంతో ఇది ఒక బెస్ట్ యాంటీఏజింగ్ ఫుడ్ గా చెప్పవచ్చు.

నట్స్ : నట్స్ మన రెగ్యులర్ హెల్తీ డైట్ లో భాగం అయితే శరీరానికి ఎలాంటి అదనపు క్యాలరీలు చేరవు. ఇవి విటమిన్స్, న్యూట్రిషియన్స్ ఎక్కువగా అందేలా చేస్తాయి. కాబట్టి బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్ ఎక్కువగా తీసుకోవాలి.

పెరుగు : పెరుగులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి, ప్రోటీనులు ఎక్కువగా లభిస్తాయి . దీనిలో మంచి బ్యాక్టీరియా జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది . పెరుగులో రిబోఫ్లెవిన్, ఫాస్పరస్, క్యాల్షియం, విటమిన్ బి12 అధికంగా ఉంటాయి.

వెల్లుల్లి : వెల్లుల్లిని రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం వల్ల వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. వెల్లుల్లి ఒక మంచి యాంటీ వైరల్ ఏజెంట్ గా పనిచేస్తుంది . క్యాన్సర్ సెల్స్ పెరగకుండా పోరాడుతుంది. ఇలాంటి ఆహార నియామాలు పాటించడం ద్వారా మంచి ఆరోగ్యం మీ సొంతం అవుతుంది.

జీర్ణకోశంలో అల్సర్లు.. చికిత్స

ఈ నవీనయుగంలో చాలా మందిని వేధిస్తున్న సమస్య ఇది. దీనికి కారణం మారిన జీవనశైలి విధానాలే అని చెప్పవచ్చు. క్షణం తీరిక లేక కాలంతో పరుగులు, వేళకు తీసుకోని ఆహారం ఒకవేళ తీసుకున్నా హడావిడిగా క్షణంలో ముగించడం, చీటికి మాటికి చిరాకు, కారణం లేకుండానే కోపం, వీటితో పాటు నిత్యం ఎదుర్కొనే రకరకాల మానసిక ఒత్తిళ్లు తోడు కావడంతో జీర్ణకోశంలో అల్సర్ (గ్యాస్ట్రిక్ అల్సర్) సమస్య తీవ్రరూపం దాలుస్తున్నది.



లక్షణాలు : జీర్ణాశయంలో అల్సర్ ఏర్పడటం వల్ల కడుపులో నొప్పి, మంట రావటం.
త్రేన్పులు ఎక్కువగా ఉండటం.
గ్యాస్‌తో పొట్ట మొత్తం ఉబ్బినట్లుగా ఉండటం.
కడుపులో గడబిడలతో పుల్లటి తేన్పులు రావడం.
తిన్నది సరిగ్గా జీర్ణం కాకపోవడం,
వాంతులు కావడం.

జాగ్రత్తలు : ఫాస్ట్‌ఫుడ్స్, ఆయిల్‌ఫుడ్స్, మసాలాలు, వేపుళ్లు మానివేయాలి.ఆల్కహాలు మానివేయాలి.
నిలువ ఉంచిన పచ్చళ్లు తినడం మానాలి. వేళకు ఆహారం తీసుకోవాలి.
నీరు సరిపడినంతగా తాగాలి.
మానసిక ఒత్తిడిని నివారించడానికి యోగా,మెడిటేషన్ వంటివి చేయాలి.టీ,కాఫీలు మానివేయాలి.

పరీక్షలు : ఎండోస్కోపి ద్వారా ఈ వ్యాధిని నిర్ధారిస్తారు.

చికిత్స : హోమియో వైద్యంలో గ్యాస్ట్రిక్ అల్సర్‌తో బాధపడే వారికి మంచి చికిత్స ఉంది. శారీరక, మానసిక లక్షణాల ఆధారంగా మందులను ఎంపిక చేసుకొని ఇవ్వడం వల్ల వ్యాధి సమూలంగా నివారణ అవుతుంది.

మందులు:

నక్స్‌వామికా: మసాలాలు, ఫాస్ట్‌ఫుడ్స్, కాఫీలు ఎక్కువగా సేవించడం, శారీరకశ్రమ తక్కువగా ఉండి, మానసిక శ్రమ ఎక్కువగా ఉన్నవారికి ఈ మందు ఆలోచించదగినది. మానసిక స్థాయిలో వీరికి కోపం ఎక్కువ. శబ్దాలు, వెలుతురు భరించలేరు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు బాగా పని చేస్తుంది.

అర్జెం నైట్రికం: పొట్టలో నొప్పి ఉండి త్రేన్పులు ఎక్కువగా ఉంటాయి. తిన్న తరువాత పొట్టలో నొప్పి ప్రారంభమవుతుంది. వీరు మానసిక స్థాయిలో ఆందోళన చెందుతుంటారు. ఎక్కడికైనా వెళ్లవలసి వచ్చినా ఎవరైనా వస్తున్నారని తెలిసినా ఏదైనా పని తలపెట్టినా గందరగోళంలో పడిపోతారు.

ఎనాకార్డియం: వీరికి పొట్టలో నొప్పి ఏదైనా తిన్న తరువాత తాత్కాలికంగా తగ్గుతుంది. మళ్లీ నొప్పిరెండు గంటల తరువాత మొదలవడం గమనించదగిన లక్షణం. వీరు మానసికస్థాయిలో మతిమరుపు ఎక్కువగా ఉండి, దుర్భాషలాడే స్వభావంతో ఉంటారు. ఇటువంటి వారికి ఈ మందు బాగా పని చేస్తుంది.

ఫాస్పరస్: పొట్టలో అల్సర్ ఉండి రక్తం కూడా పడుతుంటుంది. విపరీతమైన నొప్పి ఉంటుంది.చల్లటి పదార్థాలు ఐస్‌క్రీమ్‌లు తింటే నొప్పి ఉపశమిస్తుంది. వీరు మానసిక స్థాయిలో భయస్థులు ఉరుములు మెరుపులు అంటే భయపడతారు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారికి ఈ మందు ప్రయోజనకారి. ఈ మందులే కాకుండా గ్రాఫైటీస్, ఇపికాక్, బ్రయోనియా, ఆర్సెనికం ఆల్బం, సల్ఫర్, కార్బోవెజ్, చైనా, లైకోపోడియం వంటి మందులను లక్షణ సముదాయాన్ని అనుసరించి వాడితే మంచి ఫలితం ఉంటుంది.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్, హన్మకొండ

నదులే కనుమరుగయ్యే ప్రమాదం : హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: ఇసుక మాఫియాను ప్రభుత్వాలు అడ్డుకోకపోతే నదులే కనబడకుండాపోయే ప్రమాదం పొంచి ఉందని హైకోర్టు తీవ్ర ఆందోళనతో వ్యాఖ్యానించింది. ఎపిలో గతంలో కృష్ణానదిలోనే ఇసుక మాఫియా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు గోదావరి నదికి ఆ మాఫియా చేరింది. తెలంగాణ రాష్ట్రంలోనూ ఇసుక మాఫియా పెరిగింది. రెండు ప్రభుత్వాలు ఇసుక మాఫియా రాకెట్‌కు అడ్డుకట్ట వేయకపోతే జీవనదులు లేకుండా పోయే ప్రమాదం ఉంటుంది.. అని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ హెచ్చరించింది. సీతానగరం మండలం వంగలపూడి గ్రామంలో వెంకటేశ్వరరావు, దుర్గమ్మ ఇతరుల ఇసుక తవ్వకాలపై ఓ న్యాయాధికారితో విచారణ జరిపించి నివేదిక అందజేయాలని తూర్పు గోదావరి జిల్లా జడ్జిని హైకోర్టు బెంచ్ మంగళవారం ఆదేశించింది. అదే మండలంలోని ములకలలంకలో గోదావరి నది ఒడ్డున పట్టా భూముల్లో కృష్ణారావు విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేయడంపై బెంచ్ స్టే విధించింది. రెండు గ్రామాల్లో ఇసుక తవ్వకాలను తప్పుపడుతూ వంగలపూడి గ్రామస్తుడు వీర వెంకట శ్రీనివాస్ వేసిన ప్రజాహిత వ్యాజ్యాలను బెంచ్ విచారించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.



రేపు, ఎల్లుండి అడ్వకేట్ల విధుల బహిష్కరణ

తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు మార్చి 1, 2 తేదీల్లో విధుల్ని బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ భవనం నుంచి మదినా భవనం వరకూ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తితోపాటు సగానికిపైగా ఉన్న న్యాయమూర్తులు (మొత్తం పోస్టులు 61) భర్తీ చేయాలని రెండు సంఘాల తీర్మానించినట్లు సంఘ అధ్యక్షులు ధనుంజయ, కనకయ్యలు తెలిపారు. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పోస్టు 2015 నుంచి ఖాళీగా ఉంది. 61 న్యాయమూర్తుల పోస్టుల్లో సగం ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయకపోగా 2012 లోపు దాఖలైన కేసుల్ని పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలి. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ నెలకొల్పాలి. సిఆర్‌పిపి సెక్షన్ 41ఎ సెక్షన్‌కు సంబంధించి కేంద్రంతో పాటు తెలుగు రాష్ట్రాలు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. ఈ ఆందోళనల తర్వాత సుప్రీంకోర్టు/కేంద్ర సర్కార్ నుంచి చర్యలు లేకపోతే తమ తదుపరి ఆందోళనను త్వరలో తర్వాత వెల్లడిస్తాం.. అని వారు తెలిపారు.

డైరీ ఆవిష్కరించిన చీఫ్ జస్టిస్

మన తెలంగాణ/హైదరాబాద్: ఇరు రాష్ట్రాల న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం జుడీషియర్ డైరీ–2018ను చీఫ్ జస్టిస్ రమేష్ రంగనాథన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వివిధ కోర్టులలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఇరు రాష్ట్రాల ఉద్యోగుల సర్వీసు రూల్స్ గురించి ఆయనకు వివరించారు. వారి సమస్యలపై చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా న్యాయ శాఖ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మారెడ్డి, ఇరు రాష్ట్రల అధ్యక్షులు జగన్నాథం, ఆనందరావు, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాలకు నిధులు



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మైనారిటీ గురుకుల పాఠశాలల మౌలిక వసతులకు నిధులు కేటాయించాలని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి కోరారు. మైనారిటీ అభివృద్ధి, సంక్షేమ ఫలాల అమలులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ఈ సందర్భంగా కితాబు ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని పండిత్ అంత్యోదయ భవన్ (సిజిఒ కాంప్లెక్స్) లో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీతో మంత్రి పోచారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మైనారిటీ గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని మంత్రి పోచారం కోరారు. కేంద్ర మంత్రి అబ్బాసీ సమావేశం అనంతరం, ఢిల్లీ తెలంగాణ భవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నిజామాబాద్ – కామారెడ్డి జిల్లాలలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన మైనారిటీ గురుకుల పాఠశాలలకు మౌలిక వసతులు, ఆర్థిక సాయం అందించాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోటగిరి, బాన్సువాడ, బీచ్కుంద కామారెడ్డి, లింగంపేటలలోని మైనారిటీ రెసిడెన్సియల్ విద్యాలయాలలో మౌలిక వసతులు పెంచడానికి నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామని మంత్రి వివరించారు.

కేంద్రం వల్లే ఆత్మహత్యలు

(మొదటిపేజీ తరువాయి)

లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఎలను పెంచుతున్న సర్కారు రైతుల విషయంలో మాత్ర అశ్రద్ధ చేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో అందరం కలిసి పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. రైతుల సహనాన్ని పరీక్షించాలనుకోవడం భావ్యం కాదన్నారు. గత పాలకుల కారణంగా వెనుకబాటుకు గురైన ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సంపన్నమైందని, గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులను పూర్తి చేసి ఏడాదిన్నర కాలంలో ఏకంగా కోటిన్నర ఎకరాల సాగు భూమికి నీటిని అందిస్తున్నామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని అనుకున్న సమయంలోగా పూర్తి చేసి పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకునేందుకు ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. గత పాలకుల తెలివి తక్కువ విధానాలతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అతీగతీ లేకుండా పోయిందని, రీడిజైన్ చేయించి త్వరలోనే ఈ ప్రాజెక్టును సైతం పూర్తి చేస్తామని ప్రకటించారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని పథకాలను ప్రవేశపెట్టి ప్రజల అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం ముందుందని పేర్కొన్నారు. 500 గురుకులాలను మంజూరు చేసి ప్రతి విద్యార్థిపై ఏడాదికి 1.10 లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నామని అన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అన్నిరంగాలలో అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కె కేశవరావు, రాష్ట్ర మంత్రులు జోగురామన్న, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపి గోడం నగేష్, జడ్‌పి చైర్‌పర్సన్ శోభారాణి, ఎంఎల్‌ఎలు రాథోడ్ బాపూరావ్, విఠల్‌రెడ్డి, కోనేరు కోనప్ప, రేఖా శ్యాం నాయక్, డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వాటా మీరిన ఎపి

(మొదటిపేజీ తరువాయి)

నీటి లెక్కలపై అంగీకారం కుదిరిందని, అయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కోటాకు మించి 2.324 టిఎంసిల నీటిని ఎక్కువగా వినియోగించుకుందని బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం మంగళవారం రాసిన లేఖలో పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని వినియోగించుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ వెంటనే నిలిపివేయాలని, ఆగస్టు వరకు సాగునీటి, తాగునీటి వినియోగానికి సంబంధించి నిర్దిష్ట ప్రతిపాదనలతో తదుపరి సమావేశానికి రావాలని ఆయన కోరారు. గత నెల 8వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ఈ రెండు రిజర్వాయర్ల నుంచి 62.324 టిఎంసిల నీటిని వాడుకున్నదని, తెలంగాణ మాత్రం తనకు కేటాయించిన 50 టిఎంసిల కోటాలో కేవలం 33.504 టిఎంసిల నీటిని మాత్రమే వాడుకున్నదని, ఇంకా 16.493 టిఎంసిలను తెలంగాణ వినియోగించుకోవచ్చునని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనవరి 8 నుంచి నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా 27.695 టిఎంసిలు, కృష్ణా డెల్టా స్కీమ్ ద్వారా 8.285 టిఎంసిలు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి 8.391 టిఎంసిల చొప్పున నీటిని వాడుకున్నదని, శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 6.812 టిఎంసిలు, హంద్రీనీవా ద్వారా 11.142 టిఎంసిల చొప్పున మొత్తం 66.324 టిఎంసిలను వాడుకున్నదని బోర్డు సభ్య కార్యదర్శి స్పష్టం చేశారు. తనకు కేటాయించిన మోతాదుకు మించి ఎక్కువగా నీటిని వాడుకోవడాన్ని అనధికారికంగా హెచ్చు మొత్తంలో వాడుకున్న నీటిగానే పరిగణించాల్సి ఉంటుందని, తక్షణం ఈ రెండు ప్రాజెక్టుల నుంచి నీటిని వాడుకోవద్దని తేల్చి చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టులో రెండు వైపులా ఉన్న విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ద్వారా ఫిబ్రవరి 26 నాటికి మొత్తం 14.335 టిఎంసిల నీరు వినియోగమైందని, శ్రీశైలం కుడి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అవసరాలకు నీటిని వాడుకోవడం ఈనెల 8న జారీ చేసిన ఉత్తర్వులను ఉల్లంఘించడమేనన్నారు. ఇంతకాలం తెలంగాణను తప్పుపట్టిన ఆంధ్రప్రదేశ్ తన కోటాకు మించి వాడుకున్నట్లు వివరాలతో సహా బోర్డు సభ్య కార్యదర్శి లేఖలో పేర్కొనడం గమనార్హం.

2022లోపు ఆధార్‌తో పౌర సేవలు అనుసంధానం

- ఇ–గవర్నెన్స్ ముగింపు సమావేశంలో కేంద్ర మంత్రి జితేంద్ర కుమార్
- తెలంగాణ ప్రభుత్వ మీ–సేవ 2.0'కు రజత పతకం ప్రదానం



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశవ్యాప్తంగా అందిస్తున్న పౌర సేవలన్నింటినీ 2022 లోపు ఆధార్‌తో అనుసంధానం చేస్తామని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. అప్పటికల్లా అందరికీ డిజిటల్ అక్షరాస్యతను అందించేందుకు వీలుగా 'జన్‌ధన్, ఆధార్ మొబైల్ (జామ్) సేవలను ఉత్తమంగా వినియోగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఇ గవర్నెన్స్' జాతీయ సదస్సు ముగింపు ఉత్సవానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి పైవిధంగా వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి కార్యాలయానికి వచ్చే ప్రజల వినతుల్లో 90% పరిష్కరిస్తున్నామని, ప్రతీ వారం సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంవత్సరానికి 2 లక్షల ఫిర్యాదులు మాత్రమే వచ్చేవని, ఇప్పుడు ఇది 16 లక్షలకు చేరిందన్నారు. ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్న 'నవభారత్' సాకారానికి ఇది అత్యవసరమని జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇ–పరిపాలనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గత మూడున్నరేళ్లలో పెన్షన్ చెల్లింపులకు పోర్టల్‌ను ఏర్పాటు చేయడం, ప్రధాన మంత్రి స్కిల్ డెవలప్‌మెంట్ పురస్కారాలతో యువతలో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని ప్రోత్సహించడం తదితరాలను చేపట్టినట్లు ప్రస్తావించారు. పాలనను సరళతరం చేయడం ద్వారా మానవ జీవనాన్ని సులభతరం చేయడమే ఇ గవర్నెన్స్ ప్రధాన ధ్యేయం కావాలని ఆకాంక్షించారు. పరిపాలనపై ప్రాంతీయ సమావేశాలను నిర్వహించాలన్న ప్రయత్నాల్లో భాగంగా గత మూడేళ్ళుగా హైదరాబాద్, విశాఖపట్టణం, జైపూర్, గౌహతి, జమ్ము, నాగ్‌పూర్, చండీగఢ్ వంటి చోట్ల ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. గడచిన నాలుగేళ్లలో 16 లక్షల పిటిషన్లు వచ్చాయని, ఇందులో 86 శాతం పరిష్కారమయ్యాయన్నారు.

తెలంగాణ ప్రభుత్వ మీ –సేవ 2.0కు సిల్వర్ అవార్డు ప్రదానం : జాతీయ 'ఇ పరిపాలన' పురస్కారాల ప్రదానంలో భాగంగా సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడంలో చక్కని ప్రయత్నాలు చేసిన సంస్థలకు 8 కేటగిరీలలో 19 అవార్డులను కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా ప్రదానం చేశారు. తెలంగాణ ప్రభుత్వ 'మీ–సేవ 2.0'కు రజత పతకాన్ని ప్రదానం చేశారు. ప్రతీ విభాగంలో స్వర్ణ పురస్కారానికి రూ.2 లక్షల నగదు బహుమతిని, ప్రశంసాపత్రాన్ని, రజత పురస్కారంలో భాగంగా రూ.1 లక్ష నగదు బహుమతిని ఎంపికైన సంస్థలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్ పిజి) కార్యదర్శి శ్రీ కె.వి. ఇయాపెన్, డిఎఆర్ పిజి అదనపు కార్యదర్శి వసుధ మిశ్రా, తెలంగాణ అదనపు ముఖ్య కార్యదర్శి శ్రీ అజయ్ మిశ్రా లు కూడా ప్రసంగించారు. 'అభివృద్ధిని వేగవంతం చేయడం లో సాంకేతిక విజ్ఞానం' అనే అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొన్న ఈ సమావేశం మంగళవారం ముగిసింది.

ఇంకా తెలంగాణలోనే ఎపి డిప్యూటీ కలెక్టర్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాల మధ్య డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల విభజన జరిగి రెండు నెలలవుతున్నా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడిన పలువురు ఇంకా తెలంగాణలోనే కొనసాగుతున్నారు. తెలంగాణకు కేటాయించబడి ఏపీలో పనిచేస్తున్నవారిని ఆ ప్రభుత్వం రిలీవ్ చేయడమూ, వారు కూడా తెలంగాణకు రావాలని కోరుకోవడంతో పది మంది వచ్చి నివేదించారు. కానీ ఏపీకి కేటాయించబడిన 18 మంది మాత్రం ఇంకా తెలంగాణలోనే కొనసాగుతూ ఉన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు వారిని విధుల నుంచి రిలీవ్ చేయలేదని సమాచారం. ఈ 18 మందిలో ఒకరు పదవీ విరమణ చేయగా ముగ్గురు మాత్రం పోస్టు కోసం 'వెయిటింగ్'లో ఉన్నారు. మిగిలినవారంతా వివిధ హోదాల్లో విధులు నిర్వరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడి రెండు నెలలు అవుతున్నా ఇంకా ఎందుకు తెలంగాణలోనే కొనసాగుతున్నారని రెవిన్యూ ఉద్యోగుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం వారిని ఎందుకు రిలీవ్ చేయకుండా ఉందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. తెలంగాణకు కేటాయించబడిన డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు వెంటనే ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ రిపోర్టు సమర్పించినా వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచారని, మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడినవారిని మాత్రం రిలీవ్ చేయకుండా ఉంచుకోవడంలో ఉద్దేశమేంటని రెవిన్యూ ఉద్యోగులు చేస్తున్న వాదనలకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేదు. రెండు నెలలుగా లక్షలాది రూపాయల తెలంగాణ డబ్బులు వేతనాల రూపంలో వారికి చెల్లించాల్సి వస్తోందని, మరోవైపు తెలంగాణకు చెందిన పది మంది అధికారులు మాత్రం వేతనాలు లేకుండా 'వెయిటింగ్'లోనే ఉంటున్నారని ఉదహరించారు. మొత్తం 18 మంది ఆంధ్ర అధికారుల్లో ఒకరు పదవీ విరమణ చేయగా నలుగురు పోస్టింగ్ కోసం 'వెయిటింగ్'లో ఉన్నారు. మిగిలినవారు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వీరిని రిలీవ్ చేయడం ద్వారా వెయిటింగ్‌లో ఉన్న తెలంగాణ అధికారులకు బాధ్యతలు అప్పగించవచ్చని రెవిన్యూ ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

నేడు టిడిపి నేతలతో చంద్రబాబు సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం తెలంగాణ టిడిపి నేతలతో సమావేశం కానున్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా టిడిపిని వీడి ఇతర పార్టీలలో చేరాలనుకుంటున్న సీనియర్ నేతల కోసమే జరుగుతుందని తెలిసింది. ఇప్పటికే ఉన్న కొద్ది ముఖ్య నాయకులు కాంగ్రెస్, టిఆర్‌ఎస్‌లలో చేరిపోవడంతో మిగిలిన వారిలో కొద్ది మంది నేతలు కూడా పార్టీని వీడితే రాష్ట్రంలో టిడిపి పని అయిపోయినట్లేనని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చంద్రబాబు రాష్ట్ర టిడిపిపై దృష్టి సారించారు. ఎన్‌టిఆర్ వర్ధంతి నాడు టిఆర్‌ఎస్‌లో తెలంగాణ టిడిపిని విలీనం చేయాలని సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యానించిన తరువాత జరుగుతున్న ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలోనే మాజీ ఎంఎల్‌ఏ బండి పుల్లయ్య టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు.

హజ్ యాత్రపై అవగాహన కోసం శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రపై యాత్రికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న హజ్ కమిటీ రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని మార్చి 4వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.ఎ.స్కూకూర్ తెలిపారు. దారుషాఫాలోని జామా మసీదులో ఈ శిక్షణను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హజ్ యాత్రకు వెళ్ళే వారికి తగిన సలహాలు, సూచనలతో పాటు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలతో పాటు యాత్రకు ఎలా సన్నద్ధం కావాలనే అంశాలను కూడా వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని హజ్ కమిటీ ఛైర్మన్ మహ్మద్ మసియు ల్లా ఖాన్ అధ్యక్షతన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో చార్మినార్ ఎంఎల్‌ఎ అహ్మద్ పాషాఖాద్రీ, కార్పొరేటర్ మిర్జా రియాజ్ పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ మత విశ్వాసకులు దీనిపై ఉపన్యాసిస్తారని తెలిపారు. ప్రైవేటు క్యాబ్ అపరేటర్లు సైతం ఈ కార్యక్రమంలోపాల్గొంటారని తెలిపారు. మహిళా యాత్రికుల కోసం ప్రత్యేకమైన ఏర్పా ట్లు చేసినట్లు చెప్పారు. మైనర్ బాలురు, బాలికలను ఈ కార్యక్రమానికి తీసుకరాకపోవడం మంచిదని ఎగ్జిక్యూటివ్ అధికారి విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాల కోసం 040 23298793 నెంబర్లోగానీ హజ్ కమిటీ కార్యాలయంలోగానీ సంప్రదించవచ్చని తెలిపారు.

రెండు పాస్‌పోర్టులున్న వ్యక్తి అరెస్టు



మన తెలంగాణ/సిటీబ్యూరో : రెండు పాస్‌పోర్టులున్న వ్యక్తిని రాచకొండ పోలీసులు అరెస్టుచేసి మరింత విచారణ కోసం చైతన్యపురి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చైతన్యపురి పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తపేట్ న్యూ నాగోల్‌కు చెందిన రావిల వెంకట క్రిష్ణారెడ్డి (57)కు రెండు పాస్‌పోర్టులున్నాయి. మొదటిది ఉండగానే రెండవది తీసుకున్నాడు. అందుకు వాస్తవ సమాచారాన్ని దాచిపెట్టి, తప్పుడు సమాచారం, ధ్రువీకరణ పత్రాలను సమర్పించి పాస్‌పోర్టు అధికారులను తప్పుదోవపట్టించినాడు. మొదటి పాస్‌పోర్టుతో వీసాపొంది అమెరికా వెళ్ళి వచ్చాడు. మరో మారు కూడా వెళ్ళి వీసా గడువు ముగిసినా అక్కడే ఉండటంతో అమెరికా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అత్యవసర ధృవీకరణ పత్రంను జారీచేసి తిరిగి భారత్‌కు పంపించివేశారు. అనంతరం సింగపూర్ వెళ్ళేందుకు మరో వీసా తీసుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న రాచకొండ మల్కాజిగిరి టాస్క్‌ఫోర్స్ పోలీసులు క్రిష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు పాసుపోర్టులున్నట్టు వెల్లడించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని మరింత సమాచారం కోసం చైతన్యపురి పోలీసులకు అప్పగించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు నేడు తుది గడువు

- సమాచారం మేరకు రుసుంలు చెల్లించాలి : చిరంజీవులు
- ధృవీకరణ పత్రాలను జతపరచాలి

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : నేటితో హెచ్‌ఎండిఎలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో రుసుంలు చెల్లించేందుకు తుది గడువు ముగియనున్నదని కమిషనర్ చిరంజీవులు వెల్లడించారు. ఈ గడువు ముగిసిన అనంతరం రుసుంలను స్వీకరించబడవని ఆయన సూచన ప్రాయంగా తెలిపారు. దరఖాస్తుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. అథారిటీ అధికారుల నుండి వచ్చిన సమాచారం మేరకు నాలా రుసుంలు, ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులను వెంటనే చెల్లించి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో సహకరించాలని కోరారు. దరఖాస్తుదారులకు సేవలందించడం కోసం సంస్థ ఉద్యోగులు సెలవు రోజుల్లోనూ విధులకు హాజరయ్యారని, ఆన్‌లైన్ చెల్లింపులు చేయలేని వారికి నగదు తీసుకునే వెసులుబాటును కల్పించడం జరిగిందని కమిషనర్ చిరంజీవులు వెల్లడించారు. ధరఖాస్తులకు జతపరచాల్సిన ధృవీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో జతపరచాలని కమిషనర్ సూచించారు.

లక్ష దరఖాస్తులకు మోక్షం : గత రెండేళ్ళుగా ఒక యజ్ఞంలా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తోన్న హెచ్‌ఎండిఎ నేటి(ఈ నెల 28)తో పూర్తిచేయాలని నిర్ణయించింది. అయితే 2015లో జిఓ జారీచేయడంతో హెచ్‌ఎండిఏకు మొత్తం 1,75,406 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించేందుకు కమిషనర్ ప్రత్యేక దృష్టిసారించారు. ప్లానింగ్ విభాగంలో అధిక శాతంమంది అధికారులను పూర్తిగా ఈ దరఖాస్తుల పరిష్కారానికే కేటాయించారు. ప్రత్యేకంగా ఎఇఇలు 30 మందిని కేటాయించారు. మరో 30 మంది తహశీల్దార్లను తీసుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మరో 30 మందిని తీసుకున్నారు. పరిష్కార ప్రక్రియలో ఆరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో పలు మార్లు అధికారులను మార్చారు. మందగించినట్టు వచ్చిన విమర్శల నేపథ్యంలో పలుమార్లు అధికారులను మార్చుతూ పరిష్కార ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటి వరకు సుమారు లక్ష దరఖాస్తులను పరిష్కరించింది. సుమారు 76 వేల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. పరిష్కారానికి మరో 5 వేల వరకు దరఖాస్తులున్నాయనేది అధికారులు వెల్లడిస్తున్నారు. అధికారుల నుండి దరఖాస్తుదారుల ఫోన్‌లకు దరఖాస్తులు తిరస్కరణకు నోచుకున్నా... మరల దరఖాస్తులను పున:పరిశీలించాలని కోరొతే వాటిని తిరిగి పరిష్కరించేందుకు అనుమతులను జారీచేసి దరఖాస్తుదారులకు ఏ విధమైన అసౌకర్యం కల్గకుండా చూశారు. మరి నేటితో తుదిగడువుగా ప్రకటించారు. మరి ప్రభుత్వం మరికొంత గడువు ఇస్తుందాలేదా..? వేచి చూడాలి.

నేడు శ్రీదేవి అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తు ప్రక్రియల అనంతరం దుబాయ్ విచారణాధికారులు క్లియరెన్స్ ఇచ్చారు. దీనితో ఈ కేసు ముగింపు జరిగి, భౌతిక కాయం తరలింపునకు వీలేర్పడింది. ముంబై విమానాశ్రయంలో ప్రముఖ నటుడు అనిల్ కపూర్, అనిల్ అంబానీ ఇతరులు వేచి ఉన్న దశలో అత్యంత విషాదభరిత వాతావరణంలో శ్రీదేవి భౌతిక కాయం ముంబైకి చేరుకుంది. విమానాశ్రయం వెలుపల వేలాదిగా అభిమానులు గుమికూడారు. తరువాత అక్కడి నుంచి భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో శ్రీదేవి నివాసం గ్రీన్ ఏకర్స్‌కు తరలించారు. ఎయిర్‌పోర్టు వద్ద, దారిపొడుగునా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయం రెండో గేట్ నుంచి పార్థివదేహం తరలించారు. సర్వీసు రోడ్ మీదుగా శ్రీదేవి నివాసానికి చేరుకుంది. వేలాదిగా ఫ్యాన్స్ ఉరుకులు పరుగుల మధ్య శ్రీదేవి నివాసం వద్దకు చేరుకున్నారు.

నేడు అంత్యక్రియలు

శ్రీదేవి అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం జరుగుతాయని వెల్లడైంది. శ్రీదేవి నివాసం వద్ద ప్రజా సందర్శనకు ఉదయం ఎనిమిదిగంటల వరకు ఉంచి తరువాత భౌతికకాయాన్ని సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఉంచుతారు. తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు అంతిమయాత్ర ఆరంభం అవుతుంది. అంతకు ముందు నివాసంలో ప్రత్యే క పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో విలే పార్లే సేవా సమాజ్ హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అనిల్ అంబానీకి చెందిన ప్రైవేట్ జెట్ విమానంలో శ్రీదేవి భౌతికకాయాన్ని తీసుకుని సమీపబంధువులు, భర్త బోనీ కపూర్ గేట్ నెంబర్ 8వ వద్దకు విమానం చేరుకుంటుందని అధికారులు తొలుత ప్రకటించారు. అంతకు ముందు దుబాయ్‌లో శ్రీదేవి మేనల్లుడు సురభ్ మల్హోత్రా మార్చురీ వద్ద శ్రీదేవి భౌతిక కాయాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు దుబాయ్ పోలీసులు శ్రీదేవి మరణంలో ఎలాంటి అనుమానం లేదని తెలిపే పత్రాలను సమర్పించారు. భౌతిక కాయం అప్పగింతకు అనుమతి పత్రాలను విడుదల చేశారు. దుబాయ్‌లో అన్ని చట్టపరమైన చర్యలు పూర్తయిన తరువాత శ్రీదేవి భౌతిక కాయాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు దుబాయ్‌లోని భారతీయ అంబాసిడర్ నవదీప్ సూరి తెలిపారు. దుబాయ్ విమానాశ్రయం నుంచి ఆమె భౌతిక కాయాన్ని ముంబైకి తరలించామని అంతకు ముందు ఆయన ప్రకటన వెలువరించారు. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఎప్పటికప్పుడు స్పందించడం, సిజిఐదుబాయ్ సిజి విపుల్ బృందం చేసిన యత్నాలతో త్వరితగతిన పార్థివదేహం ముంబైకి తరలించేందుకు వీలేర్పడిందని సూరి తెలిపారు. విదేశాలలో కష్ట పరిస్థితిలో ఉండే భారతీయులను ఆదుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని వెల్లడించారు.

శ్రీదేవి నివాసం వద్ద పలు రాష్ట్రాల అభిమానులు

తమ అభిమాన నటి శ్రీదేవికి అంతిమ వీడ్కోలు పలికేందుకు ముంబైలో శ్రీదేవి లోకండ్వాలా నివాసానికి వేలాదిగా అభిమానులు చేరుకున్నారు. ఇప్పటికే కర్నాటక నుంచి 150 మందితో కూడిన ఒక బృందం అక్కడికి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా శ్రీదేవి ఫ్యాన్స్ బృందం వచ్చినట్లు, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల వారు కూడా వచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి పలువురు సినీ ప్రముఖులు మంగళవారం రాత్రి కూడా ముంబైకి వెళ్లారు. శ్రీదేవి అంతిమయాత్రలో వారు పాల్గొంటారు. అనిల్ కపూర్ నివాసంలో ఉన్న శ్రీదేవి కూతుర్లు జాన్వి, కుషీలను పరామర్శించారు. అనిల్ నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కరోజు క్రితమే ఫర్హాఖాన్, నటి టబూ, ఫర్హాన్ అక్తర్, డాన్సర్ సరోజ్ ఖాన్, ప్రముఖ నటి రేఖ, రాణిముఖర్జీ, కరణ్ జోహార్, మనీష్ మల్హోత్రా, అనుపమ్ ఖేర్‌లు వచ్చి శ్రీదేవి కూతుళ్లను పలకరించారు. రోదిస్తున్న వారిని ఓదార్చారు.

అందరికీ వందనాలు: కుటుంబ సభ్యులు

శ్రీదేవి మరణవార్త తెలియగానే ప్రగాఢ సంతాపం తెలియచేసిన సిని రంగం వారికి, మీడియాకు, కోట్లాది మంది అభిమానులకు , ఆమె కోసం నివాళులు అర్పించి, ప్రార్థనలు నిర్వహించిన వారికి అందరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నామని శ్రీదేవి కుటుంబం తరపున మంగళవారం రాత్రి ప్రకటన వెలువడింది. వారి స్పందన కదిలించివేసిందని, తమ కష్టకాలంలో వారి సానుభూతికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని ఇందులో తెలిపారు. గణనీయ చిరస్మరణీయ నటి తుది యాత్రలో పాల్గొనేందుకు తరలిరావాలని నటిగా భార్యగా , ఒక తల్లిగా అందరి మన్ననలు పొందిన మహనీయ వ్యక్తికి శ్రద్ధాంజలి ఘటించాలని కోరుతున్నట్లు ఈ ప్రకటనలో వెల్లడించారు.

ఆర్‌టిసికి ప్రతిష్టాత్మక అవార్డులు

ఢిల్లీలో అవార్డులను స్వీకరించిన ఎండి జి.వి.రమణారావు

మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఎఎస్ఆర్‌టియు) 'వాహన ఉత్పాదకత', 'ఇంధన పొదుపు' అవార్డులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) కైవసం చేసుకుంది. వాహన ఉత్పాదకతలో 2016–17లో 318.27 నుంచి 328.27 (కి.మీ/ వెహికిల్ /డే) మెరుగుదలను సాధించడమే కాకుండా 7500 వాహన రవాణా సంస్థ కేటగిరిలో ఇంధన పొదుపులో అత్యధికంగా 5.51 కెఎంపిఎల్ సాధించినందుకు టిఎస్‌ఆర్‌టిసికి అవార్డులు లభించాయి. గతంలో 5.46 నుంచి 5.50 కె.ఎం.పి.ఎల్‌తో అవార్డు దక్కించుకున్న టిఎస్‌ఆర్‌టిసి ఈ సారి 5.51 సాధించి తన రికార్డును తానే తిరగరాసుకుంది. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన ఎఎస్‌ఆర్‌టియు 62వ వార్షిక సమావేశంలో కేంద్ర రోడ్డు రవాణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి యధువీర్ సింగ్ మాలిక్, జాయింట్ సెక్రటరీ అభయ్ దామ్‌లే అవార్డులను టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణా రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎండి జి.వి.రమణారావు మాట్లా డుతూ ఉత్పాదకత, రోడ్డు భద్రత, ఇంధన సంర క్షణ విభాగాలలో డ్రైవర్, కండక్టర్స్, మెకానిక్స్, శ్రామిక్స్, కోచ్ బిల్డర్స్ తదితర గ్యారేజీ సిబ్బందితో పాటు సూపర్‌వైజర్స్ నుంచి అధికారుల వరకు సమిష్టి కృషితోనే టిఎస్‌ఆర్‌టిసికి ఈ ఖ్యాతి లభించిందన్నారు.





గోదావరి నీటి సద్వినియోగంలో గత పాలకులు విఫలం : కవిత

మన తెలంగాణ / మంథని (పెద్దపల్లి జిల్లా) : ఒక వైపు తెలంగాణ ఎడారిగా మారుతుండగా, మరో వైపు గోదావరి నది నుంచి వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయిన గత సమైక్య పాలకులు గోదావరి నది నీటిని సద్వినియోగించుకోవడంలో విఫలమయ్యారని నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం స్థానిక మంథని ఎంఎల్‌ఎ పుట్ట మధుతో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎంఎల్‌ఎలు జీవన్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బాజీరెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన రైతు సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి ఆమె కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపు హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక, సిఎంగా కెసిఆర్ గద్దెకు ఎక్కిన వెంటనే వృధాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి నీటిని సద్వినియోగించుకొని ఎడారిగా మారిన తెలంగాణ రెండు పంటలతో సస్యశ్యామలం చేసి, రాష్ట్రంలో కరువును తరిమికొట్టడమే లక్ష్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.ఈ వార్షిక రాష్ట్ర బడ్జెట్‌లో సైతం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంకు రూ. 25 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించే అవకాశం ఉందన్నారు. జూన్ చివరి వరకు కాళేశ్వరం మొదటి దఫా పనులు పూర్తి చేసి, రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పంటలకు సాగు నీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో పత్తి రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/ సదాశివపేట : అప్పుల బాధ తట్టుకోలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొబ్బిలిగామ గ్రామంలో చోటు చేసుకుంది. సదాశివపేట మండలంలోని బొబ్బిలిగామ గ్రామానికి చెందిన తలారి శ్రీశైలం (52) తనకున్న రెండు ఎకరాలలతో పాటు 13 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేసినప్పటికీ దిగుబడి తగ్గిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులకు లోనయ్యాడని బంధువులు తెలిపారు. పంటసాగుకోసం దాదాపు మూడు లక్షల రూపాయలు అప్పు ఉందని తీర్చే మార్చం లేక, అప్పుల వారి వత్తిళ్లను తట్టుకోలేక శ్రీశైలం తెల్లవారు జామున ఇంట్లోంచి పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని శ్రీశైలం బందువులు ఫిర్యాదు చేసినట్లు సదాశివపేట సిఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సదాశివపేట ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కురవిలో నకిలీ పాసు పుస్తకాలు



మన తెలంగాణ/కురవి : రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంతో భూ రికార్డుల ప్రక్షాళన పక్కదారి పడుతోంది. విఆర్‌ఓలు నిర్లక్ష్యం వ్యవహరిస్తూ కాసులకు కక్కురిపడి తహసీల్దార్‌కు తెలియకుండా పాస్‌వర్డ్‌ను గుట్టు రట్టు చేసి నకిలీ 1బి పాస్ పుస్తకాలను తయారు చేసిన సంఘటన కురవిలో చోటు చేసుకుంది. తహసీల్దార్ జన్ను సంజీవ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల 17న హైదరాబాద్‌లో శిక్షణకు వెళ్ళారు. అదే సమయంలో కురవి మండలం తాళ్ళ సంకీస శివారు తండాకు చెందిన వాంకుడోత్ సుమన్ నల్లెల్ల గ్రామ శివారు సూరతండాకు చెందిన తేజావత్ లక్ష్మిని నమ్మించి 153, 166, సర్వే నెంబర్‌లో 2.16 ఎకరాల భూమికి 1బి చేయిస్తానని ఆమె వద్ద ఖర్చుల కోసం రూ.15 వేలు తీసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ కంప్యూటర్ నెట్ సెంటర్‌లో విఆర్‌ఓతో కలిసి తహసీల్దార్‌కు తెలియకుండా ఆయన పాస్‌వర్డ్ తెలుసుకుని నకిలీ 1బి తయారు చేశారు. దానిపై పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. ఆ దళారికి ఎవరు పాస్‌వర్డ్ ఇచ్చారు అనేది విచారణలో తేలుతుందని, తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంజీవ తెలిపారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు : రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తున్నామని రైతులు మధ్య దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, భూములపై ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తహసీల్దార్ దృష్టి తీసుకురావాలని, రైతులు మధ్య దళారుల మాటలు నమి డబ్బులు చెల్లించవద్దన్నారు.

మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య

మన తెలంగాణ/గుర్రంపోడ్ : మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన మండలంలోని తెరాటిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే తెరాటిగూడెం గ్రామానికి చెందిన సాయిలు భార్య గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందింది. అతని కుమారుడు పది రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. దీనికంతటికి కారణం అదే గ్రామానికి చెందిన కన్నెబోయిన రాములు (65) అని అతను చేతబడి చేయడం వల్లనే తన భార్య, కొడుకు మృతి చెందారని అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రాములు కుమారుడిపై దాడికి కత్తితో ప్రయత్నించి గాయపర్చాడు. రాములు, అతని కుమారుడు, భార్యతో కలిసి వెళ్తున్న సమయంలో సాయిలు మరో ఐదుగురు వ్యక్తులతో కలిసి దాడిచేసి, రాయితో మోది హతమార్చారు. మృతునికి ఇద్దరు కుమారులు,భార్య ఉన్నారు. సంఘటన స్థలాన్ని కొండమల్లేపల్లి సిఐ శివరాంరెడ్డి,ఎస్ఐ క్రాంతి కుమార్ సందర్శించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు వారు తెలిపారు.

భూ మాయగాళ్ల ముఠా నాయకుడు అరెస్టు



మన తెలంగాణ/ హైదరాబాద్/ బాచుపల్లి : విలువైన భూములకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించే నకిలీ భూ మాయగాళ్ల ముఠా నాయకుడు చంద్రకాంత్ యాదవ్ ఎట్టకేలకు బాచుపల్లి పోలీసులకు చిక్కాడు. బాచుపల్లి గ్రామంలోని 140, 141 సర్వే నంబర్‌లోని 32 ఎకరాల భూమికి నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మార్కెట్‌లో అమ్మకానికి ప్రయత్నించడంతో దామోదర్‌రావు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మోసాన్ని భూ మాయగాళ్లు అనే శీర్షికతో 'మన తెలంగాణ' కథనం ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్‌రెడ్డి, మేడ్చల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే సాయిబాబా, మురళీకృష్ణలను ముగ్గురిని గత నాలుగు రోజుల క్రితమే రిమాండ్‌కు తరలించగా మంగళవారం నాడు చంద్రకాంత్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుంచి కారు, మోటార్ సైకిల్, ఆరు మొబైల్ ఫోన్లు,ల్యాప్‌టాప్, ప్రింటర్, రబ్బరు స్టాంపులు తయారు చేసే మిషన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి చేసుకోవాలని ప్రియురాలి ధర్నా

మన తెలంగాణ/అర్వపల్లి :ప్రేమించి పెండ్లి చేసుకుంటానని మోసం చేసి ముఖం చాటేసిన ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు మంగళవారం ధర్నా చేసింది.పెండ్లి చేసుకోవాలని మహిళ సంఘాలతో పాటు ఇంటి ఎదుట బైఠాయించింది. రామన్నగూడెం గ్రామానికి చెందిన రమావత్ గౌతమ్‌కు మండలపరిదిలోని కాసర్లపాడు ఆవాసం తూర్పుతండాకు చెందిన ధరావత్ కవిత సూర్యాపేటలో పరిచయమైంది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. వీరిద్దరూ 3 సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. రెండుసార్లు అబార్షన్ చేయించాడని అమ్మాయి పేర్కొంది. పెద్ద మనుషులు, పోలీసుల సమక్షంలో గతంలో పెళ్ళి చేసుకుంటానని చెప్పి ఇప్పుడు మాటమార్చారని, తనకు న్యాయం చేయాలంటూ మహిళ సంఘాలను ఆశ్రయించింది. మంగళవారం మహిళ సంఘాలతో ఇంటి ముందు బైఠాయించింది. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదన కూర్చింది. ఆమె వెంట మహిళ సంఘాల నాయకురాలు సారగొండ్ల వెంకటమ్మ, బొమ్మిశెట్టి భారతమ్మ, గూగుంట్ల పద్మ, భాషబోయిన మహాలక్ష్మి ,కోసూరి హేమలత, గోపెల్లి ఎల్లమ్మ లు ఉన్నారు.

రాష్ట్రంలో దోపిడీ రాజ్యమేలుతోంది



తాండూరు సభలో ప్రసంగిస్తున్న ఉత్తమ్

▸▸ ప్రజా చైతన్య బస్సు యాత్రలో ధ్వజమెత్తిన పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మన తెలంగాణ/తాండూరు, సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్రంలో దోపిడీ రాజ్యమేలుతోందని, తెలంగాణ కెసిఆర్ జాగీరుకాదని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్రలో భాగంగా మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేయడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 17 పంటలకు మద్దతు ధర అందిస్తామని చెప్పారు. క్వింటాల్ కందులకు రూ.8 వేలు, పత్తికి రూ.6 వేలు, పసుపు, మిర్చికి రూ.10 వేలు, వరి, మొక్క జొన్న పంటలకు రూ.2 వేలు చెల్లిస్తామని చెప్పారు. పంట బీమా కూడా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మంది మహిళలు 6 లక్షల సంఘాలలో ఉన్నారని, వారికి రూ.లక్ష రివాల్వింగ్ ఫండ్ అందిస్తామని చెప్పారు. అదే విధంగా ముదిరాజ్‌లను గ్రూప్ డి నుండి గ్రూప్ ఎ కు మార్పు చేస్తామన్నారు.ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కుంతియా మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిపాలన స్తంభించి పోయిందని. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయన్నారు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోని యాకు తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. పిసి సి మాజీ అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, హన్మంత్‌రావు, ప్రతి పక్ష నేత జానారెడ్డి, షబ్బీర్ అలీ, మాజీ మంత్రులు ప్రసాద్ కుమార్, దానం నాగేందర్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజా వ్యతిరేక విధానాలు

▸▸ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ



మన తెలంగాణ/హుజూరాబాద్ టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు.మంగళవారం సిపిఐ 21వ జిల్లా మహాసభలు పట్టణంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన సాగడం లేదని, కుటుంబ పాలన సాగుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను అరికట్టేందుకు సిపిఐ గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఉద్యమించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. బిజెపి, టిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజానిరంకుశ పాలనను సాగిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను అరికట్టేందుకు సిపిఐ ముందుంటుందని పేర్కొన్నారు. సిపిఐని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పట్టణ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి కొమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, నాయకులు కాల్వ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ'యత్నం అత్యద్భుతం

కర్ణాటక ప్రెస్ అకాడమి చైర్మన్ సిద్దరాజు



మన తెలంగాణ/గజ్వేల్ : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల దాహార్తిని తీర్చడం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టి మిషన్ భగీరథ ఓ అద్భుత పథకమని కర్ణాటక ప్రెస్ అకాడమి చైర్మన్ సిద్దరాజు ప్రశంచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబడ మిషన్ భగీరథను కర్ణాటక ప్రెస్ అకాడమి సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ కోమటిబండ వద్ద ఘన స్వాగతం పలికారు. బృందం సంప్ హౌస్ నిర్మాణాలను, నీటి సరఫరా తీరు పరిశీలించారు. మిషన్ భగీరథ పంపింగ్ విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా బృందం సభ్యులకు అధికారులు వివరించారు. అనంతరం సిద్దిరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభు త్వం నిర్మించిన మిషన్ భగీరథ తీరు బాగుందని, గ్రామ గ్రామానికి మంచినీరు అందేలా గప్ప పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని ప్రశంచించారు. తెలంగాణ ప్రెస్ అకాడమి వైస్ ప్రెసిడెంట్ పల్లె రవికుమార్, సభ్యుడు సిహెచ్ గౌరీశంకర్, టియూడబ్ల్యూజె అస్కాని మారుతిసాగర్, మెదక్ ప్రెస్ అకాడమి సెక్రటరీ బి.రాజమౌళి, ఈఈ రాజయ్య, ఆర్‌డబ్ల్యూస్ నాగార్జున పాల్గొన్నారు.

వైభవంగా ధర్మపురి నృసింహుని కళ్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



మన తెలంగాణ/ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో శ్రీయోగ, ఉగ్రలక్ష్మి నరసింహస్వామి, శ్రీవేంకటేశ్వ ర స్వామి వారల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మ ంగళవారం నిర్వహించిన స్వామి కళ్యాణాన్ని పురస్కరించుకుని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్‌లు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని శేషప్ప కళా వేదికపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ముష్వరు స్వాములను ఆశీనులను చేసి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, బాచంపెల్లి సంతోష్‌శర్మల ప్రవచనముల మధ్య వేదపండితుల మంత్రోత్సవాలతో స్వామి వారల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల కలెక్టర్ డా ఎ శరత్, జగిత్యాల ఎస్‌పి అనంతశర్మ, దేవస్థాన చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఈఓ నాయిని సుప్రియ, ఎంపిపి కొండపెల్లి మమత, జడ్‌పిటిసి బాదినేని రాజమణి రాజేందర్, సర్పంచ్ సంగి సత్తమ్మ పాల్గొన్నారు.

టిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

మంత్రి ఆజ్మీరా చందూలాల్



మన తెలంగాణ/వెంకటాపూర్/ములుగు: తెలంగాణ ప్రభుత్వంతోనే గ్రామాలలో అభివృద్ధి అని మంత్రి చందూలాల్ అన్నారు. ఎస్‌సి కమ్యూనిటీ హాల్ పనులను రాష్ట్ర గిరిజన సంక్షేమ, పర్యాటక శాఖ మంత్రి ఆజ్మీరా చందూలాల్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ములుగు మండలం నుండి సి సి రోడ్డు ప్రారంభించిన అనంతరం వెంకటాపూర్ మండలంలోని కేశవాపూర్ గ్రామంలో రూ.92లక్షలతోటి బిటి రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. కేశవాపూర్ గ్రామం లో రూ.20 లక్షలతోని సిసి రోడ్డు పనులు పూర్తి చేశారు. రూ. 11లక్షల ఎండోమెంట్ ద్వారా రామాలయం గుడి పనులకు మంజూరి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ములుగు డివిజన్ లో అనేక అభివృద్ధి పనులు చేసి వృద్ధులకు పెన్షన్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, 24గంటల కరెంట్, కళ్యాణలక్ష్మి , షాదీము బారక్ తదితర అభివృద్ధి పథకాలు చేపట్టి గ్రామా ల అభివృద్ధి కొరకే తెలంగాణ ప్రభుత్వం ఉంద న్నారు. ములుగు మార్కెట్ చైర్మన్ డాక్టర్ ఆజ్మీరా ప్రహ్లాద్, సర్పంచ్ పుల్లాల కవిత, జడ్‌పి ఫ్లోర్ లీడర్ సకినాల శోభన్, ఎంపిపి భూక్యా మంజుల, ఎంపిటిసి కునుకూరి రమాదేవి స్వామిరావు, పిఎసిఎస్ చైర్మన్ గై అశోక్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు హర్జీ నాయక్, జడ్‌పిటిసి దగ్గు ప్రభాకర్ పాల్గొన్నారు.

ముంపు భూముల్లో అక్రమ కట్టడాలు



ముంపు భూముల్లో నిర్మాణంలో ఉన్న ఇండ్లు, స్థానికేతరులు నిర్మించిన ఇండ్లు

▸▸ ప్యాకేజీపై స్థానికేతరుల కన్ను
▸▸ నేతల అండతో యథేచ్ఛగా ఆక్రమణలు
▸▸ పునరావాస సర్వేలో పేర్లు నమోదు, ఆర్థిక లబ్ధి కోసం ఎత్తులు

మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలోని ముంపు భూములపై అక్రమార్కుల కన్ను పడింది. పాండ్ ముంపు బాధితుల పునరావాసం కోసం చేపట్టిన సర్వేను ఆసరా చేసుకొని కొంత మంది స్థానికేతరులు వృథాగా ఉన్న భూములలో రాత్రికి రాత్రే కట్టడాల నిర్మాణం కొనసాగిస్తున్నారు. పునరావాస సర్వేలో తమ పేర్లు నమోదు చేయించుకొని ఆర్థిక లబ్ధి పొందేందుకు ఎత్తులు వేస్తున్నారు. వంద మీటర్ల పరిధిలో చిట్యాల గ్రామంలో నివసిస్తున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు రెవెన్యూ శాఖ, జెన్‌కో సంయుక్తంగా భూసర్వే చేపట్టింది. పాండ్ నీటి నిల్వ సామర్థ్యం మేరకు ముంపుకు గురయ్యే భూమిని గుర్తించి అక్కడ వరకు హద్దులు పాతారు. ఈ భూమిపై ప్రభుత్వం చెల్లించే పరిహారాన్ని అక్రమంగా దక్కించుకునేందుకు కొందరు స్థానిక నేతల అండదండలతో కుయుక్తులు పన్నారు. రాత్రి సమయాల్లో సిమెంట్ ఇటుకలు రెడీమేడ్ తలుపులు, కిటికీలు, పైకప్పు రేకులను రవాణా చేసి ఇండ్లు నిర్మాణం చేశారు. స్థానికంగా ఉన్న నాపరాళ్లనే గోడలకు ఉపయోగించి ఇండ్లను నిర్మిస్తున్నారు. చీకట్లో నిర్మాణమవుతున్న ఇండ్లపై రెవెన్యూ శాఖ దర్యాప్తు ప్రారంభించింది. గ్రామ పంచాయితీ కార్యదర్శి అనుమతి లేకుండా ఇల్లు నిర్మించుకున్న వారి ఇళ్లను తొలగించాలని నోటీసులు జారీ చేసింది. అందుబాటులో లేనివారి ఇండ్లకు నోటీసులు అంటించారు. మరోవైపు అధికారుల ఆదేశాలను పట్టించుకోని మరికొందరు ఇళ్ల ను నిర్మిస్తూనే ఉన్నారు. గ్రామంలో గతంలో ఉన్న 190 నివాస గృహాల కంటే అదనంగా 70 నివాస గృహాలను అక్రమార్కులు నిర్మించారు. ముంపు బాధితుల ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ కింద నష్టపరిహారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పొందేందుకు అక్రమార్కులు ఎత్తులు వేశారు. ఈ విషయమై స్థానికులు మాట్లాడుతూ ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన వారు గ్రామం చుట్టుపక్కల నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నారని, వారికి స్థానిక నేతల సహకారం ఉందని వాపోతున్నారు. ఆక్రమణ దారుల వల్ల వాస్తవ నిర్వాసితులకు పరిహారం అందుతుందో.. లేదో అని భయందోళనలను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని, నిజమైన లబ్ధిదారులను గుర్తించి పరిహారం అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

వివాహితపై లైంగిక దాడి
ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

మన తెలంగాణ/దుగ్గొండి: వివాహితపై లైంగికంగా దాడి చేసి ఆనంతరం తీవ్రంగా గాయపర్చడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తొగర్రాయిలో జరిగింది. నల్ల అనిత ఆదివారం అదే గ్రామానికి చెందిన ఓరైతు వ్యవసాయ పొలంలో పనికోసం వెళ్లింది. ఉదయం 11 గంటలకు అశోక్ పొలం వద్దకు వచ్చి కారులో అనితను తీసుకుని బయటకు వెళ్లాడు. సాయంత్రం 6 గంటలకు సంబంధిత పొలం యజమాని తన పంట చేనులో అపస్మారక స్థితిలో ఉన్న అనితను గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజిఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం ఉదయం మరణించినట్లు తెలిపారు. మృతురాలి బావ సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బోనాల కిషన్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని నర్సంపేట ఎసిపి సునితామోహన్ పరిశీలించారు. నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు. త్వరలోనే అతన్ని అరెస్టు చేసి అనిత మృతికి కారణాలను వెల్లడిస్తామని తెలిపారు. మృతురాలికి భర్త నర్సయ్య, ఇద్దరు కూతుళ్లు రిజ్వానా, జోత్స్నలు ఉన్నారు.

అందుకే హర్రర్ సినిమాలు చేయను



'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో వెండితెరకు పరిచయమైన బ్యూటీ అలియాభట్. విభిన్న పాత్రలతో అలరిస్తున్న ఈ భామకు చీకటి, హర్రర్ అంటే చాలా భయమట. అందుకే హర్రర్ సినిమాల్లో నటించాలనుకోవడం లేదని చెబుతోంది. బాలీవుడ్‌లో హర్రర్ సినిమాలకు పేరొందిన మహేష్‌భట్ కుమార్తె అలియాభట్ ఇలా హర్రర్ సినిమాలంటే భయమని చెప్పడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. హర్రర్ సినిమాలంటే భయమని చెప్పిన అలియా తనకు గాడ్జిల్లా వంటి పెద్ద జంతువులన్నా భయమేనని చెబుతోంది. అంత భయమెందుకు అంటే... ''ఒకసారి నా పుట్టినరోజు పార్టీకి గాడ్జిల్లా రావాలని అనుకున్నా. నా కోసం మా వాళ్లు గాడ్జిల్లా బొమ్మను ఏర్పాటుచేశారు. కానీ అంత పెద్ద ఆకారాన్ని చూడగానే భయపడిపోయా. ఆ రోజు ఏడ్చుకుంటూ మా అమ్మ ఒడిలోనుంచి దిగనేలేదు. అప్పటి నుంచి నాకు గాడ్జిల్లా అన్నా... పెద్ద జంతువులన్నా... హర్రర్ సినిమాలన్నా చాలా భయం'' అని తన చిన్ననాటి సంఘటన గురించి చెప్పుకొచ్చింది అలియాభట్. ''నా సినిమాలు పిల్లలు కూడా చూస్తారు...అందులో వాళ్లు నన్ను చూసి ఇష్టపడాలే కానీ భయపడకూడదు. అందుకే హర్రర్ సినిమాల్లో నటించాలనుకోవడం లేదు''అని చెప్పింది ఈ భామ.


నాగార్జున

పోలీస్'ఆఫీసర్'గా నాగార్జున

సీనియర్ స్టార్ నాగార్జునతో రామ్‌గోపాల్‌వర్మ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. విభిన్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. గత ఏడాది నవంబర్ 20న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అయితే ఈ సినిమాకు 'ఆఫీసర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈనెల 25నే ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేద్దామని అనుకున్నారు ఫిల్మ్‌మేకర్స్. కానీ శ్రీదేవి హఠాన్మరణతో మూడు రోజులు ఆగి ఇప్పుడు సినిమా టైటిల్‌ను ప్రకటించారు. సినీ వర్గాల సమాచారం మేరకు ఈ సినిమాను మే 25న విడుదల చేయబోతున్నట్లు తెలిసింది. పోలీస్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నాగార్జున సరసన హాట్‌బ్యూటీ మైరా సరీన్ నటిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను ప్రస్తుతం ముంబయిలో చిత్రీకరిస్తున్నారు. నాగార్జుతో పాటు పలువురు ప్రధాన నటులు ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. నాగార్జున, రామ్‌గోపాల్‌వర్మ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకులు, అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.

హోలీ పండుగ కానుకగా...

ప్రముఖ రచయిత వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతూ అల్లుఅర్జున్ హీరోగా తెరకెక్కు తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. ఈ చిత్రం టీజర్‌ను కొన్ని రోజుల క్రితం విడుదల చేశారు ఫిల్మ్‌మేకర్స్. టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో ఇది హల్‌చల్ చేసింది. ఆతర్వాత సినిమాలోని రెండు పాటలను విడుదల చేశారు కానీ వాటికి అనుకున్నంత స్పందన రాలేదు. విజువల్స్‌తో చూసినప్పుడే ఈ పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయనిపించింది. ఇదిలాఉండగా ఇప్పుడు పోస్టర్ ఇంపాక్ట్ పేరుతో మరొకటి విడుదల చేయబోతున్నారు. హోలీ పండుగ సందర్భంగా మార్చి 1వ తేదీన ఈ పోస్టర్ ఇంపాక్ట్‌ను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఈ పోస్టర్ ఎంత ఇంపాక్ట్ కలిగిస్తుందన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఈ చిత్రం విడుదలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. అందుకే ఇప్పటినుంచే అన్నీ విడుదల చేయకుండా... ఒక్కొక్కటి రిలీజ్ చేస్తూ సినిమాపై ప్రేక్షకుల అంచనాలను పెంచేస్తున్నారు. ఇక దర్శకుడు వక్కంతం వంశీ ఈ చిత్రాన్ని సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండే స్టోరీతో తెరకెక్కిస్తున్నాడు. లగడపాటి శ్రీధర్‌తో కలిసి నాగబాబు, బన్నీవాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అందాల తార అను ఇమ్మాన్యుయల్ ఈ చిత్రంలో బన్నీతో రొమాన్స్ చేస్తోంది. ఈ చిత్రాన్ని మే 4న విడుదల చేయనున్నారు.



ఎన్నో ప్రత్యేకతలతో 'రాజరథం'


నిరూప్ భండారి

ట్రైలర్ విడుదలైనప్పటి నుండి 'టాక్ ఆఫ్ ది టౌన్'గా ఉన్న చిత్రం 'రాజరథం'. ఇప్పుడు ఈ చిత్రానికి పనిచేస్తున్న టెక్నీషియన్స్ గురించి ఇండస్ట్రీ పెద్దలు మాట్లాడుకుంటున్నారు. ఈ చిత్రానికి సౌండ్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న రాజాకృష్ణన్ దేశంలోనే పేరొందిన టాప్ టెక్నీషియన్. ప్రేమమ్, బెంగుళూర్ డేస్, విక్రమ్ వేద, అర్జున్‌రెడ్డి, అ..ఆ, నా పేరు సూర్య.. వంటి చిత్రాలకు ఆయన పనిచేశారు. ఇక దర్శకుడు అనూప్ ఈ చిత్రాన్ని సాంకేతికంగా అత్యున్నతంగా తీర్చిదిద్దిన విధానం చూసి రాజాకృష్ణన్ మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. బాహుబలి, ఈగ, దృశ్యం, రంగితరంగా వంటి చిత్రాలకు పనిచేసిన 'కలరిస్ట్' శివకుమార్ ఈ చిత్రానికి పనిచేయడం ఒక గొప్ప అనుభవంగా చెబుతున్నారు. దర్శకుడు అనూప్‌తో చర్చలు జరిపి... శివకుమార్ స్క్రిప్ట్‌కి తగ్గట్టు ఆకట్టుకునే కలర్ పాల్లేట్స్‌ను ఈ సినిమా కోసం వాడారు. నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య, రవిశంకర్ నటిస్తున్న ఈ చిత్రంలో రానా దగ్గుబాటి వాయిస్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో ఉండనుంది. ఈ చిత్రంతో దర్శకుడు అనూప్ భండారి మరోసారి తెరమీద తన మ్యాజిక్‌ను చూపించబోతున్నాడు. జాలీహిట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది.


నితిన్

'శ్రీనివాస కళ్యాణం'కు సిద్ధమవుతున్నాడు

నితిన్ ప్రస్తుతం కృష్ణచైతన్య దర్శకత్వంలో 'ఛల్ మోహన్ రంగ' చిత్రం చేస్తున్నాడు. పవన్‌కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ అందించడం జరిగింది. టాకీ పార్ట్ పూర్తిచేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా పూర్తయ్యాక 'శ్రీనివాస కళ్యాణం' సినిమాలో నటించేందుకు నితిన్ సిద్ధమవుతున్నాడు. సతీష్ వేగేశ్న దర్శకత్వం వహించనున్న ఈ సినిమా మార్చి 3న పూజా కార్యక్రమాలతో ప్రారంభంకానుంది. అదే నెల 23 నుండి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టుకోనుంది. మిక్కీ జె.మేయర్ సంగీతాన్ని అందించే ఈ సినిమాను దిల్‌రాజు నిర్మించనున్నాడు. అందాల భామలు రాశీఖన్నా, నందిత శ్వేతలు హీరోయిన్లుగా నటించనున్నారు.


శ్రియా

మూడు రోజుల పెళ్లి వేడుక

ఈమధ్య కాలంలో ఒక్క హీరోయిన్ కూడా ముందుగా చెప్పి పెళ్లి చేసుకోవట్లేదు. అదే-విధంగా ఇలియానా తన పెళ్లి గురించి ఏమాత్రం చెప్పకుండానే వివాహానికి సిద్ధమవుతోంది. దాదాపు 18 సంవత్సరాలుగా చిత్ర పరిశ్రమలో ఉంటున్న ఈ 35 ఏళ్ల సుందరి త్వరలో పెళ్లి చేసుకోబోతోందనే మాట ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇక అందరు హీరోయిన్లలాగా శ్రియా కూడా ఎవరో హీరోనో లేదా బిజినెస్‌మ్యాన్‌నో పెళ్లి చేసుకోబోవడం లేదు. ఆమె పెళ్లి చేసుకో-బోతోంది రష్యా దేశపు క్రీడాకారుడిని. మార్చి 17, 18, 19 తేదీలలో శ్రియా మూడు రోజుల పాటు తన వివాహ వేడు-కను జరుపుకోనుందని విశ్వసనీయ వర్గాల నుండి అందిన సమాచారం. ఇది నిజమేనా అని అడిగితే మాత్రం అవుననో లేదా కాదనో చెప్పకుండా మీడియాపై విరుచుకు-పడింది ఈ సుందరి. ''నా జీవితంలో బోలెడు ఆసక్తికరమైన కథలు ఉన్నాయి. అందుకే నా ప్రొఫెషనల్ లైఫ్ గురించి మాట్లాడుకుందాం. నా వ్యక్తిగత జీవితం గురించి ఏమీ చెప్పలేను. నేను ఒక నటిని. కాబట్టి నేను నా సినిమాల గురించి మాత్రమే చెబుతాను''అని గట్టిగా సమాధా-నమిచ్చింది శ్రియా. అయితే రష్యన్ క్రీడా-కారుడు ఆంద్రీ కోస్చీవ్‌తో శ్రియా వివాహం ఉదయ్‌పూర్‌లో వచ్చే నెల 17, 18, 19 తేదీలలో మూడు రోజుల పాటు జరుగ-నుందని శ్రియా సన్నిహితులు ఈ పెళ్లి వార్తను లీక్ చేశారు. పెళ్లి ఏర్పాట్లన్నీ చాలా వేగంగా జరుగుతున్నాయట. హోలీ పండుగ థీమ్‌తో హిందూ సంప్రదాయాల ప్రకారం శ్రియా, ఆంద్రీ ఒకటవ్వబోతు-న్నారని తెలిసింది. ఇక శ్రియా ఇప్పటికే తనకు కాబోయే అత్త మామలను రష్యా వెళ్లి కలిసి వచ్చిందని సమాచారం.


హన్సిక

అందరినీ ఆశ్చర్యపరుస్తోంది

అందాల తార హన్సిక టీనేజీ వయసులోనే 'దేశ ముదురు' సినిమాలో హీరోయిన్‌గా నటించి తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించింది. కొన్ని సినిమాల తర్వాత ఈ ముద్దుగుమ్మ బరువు పెరిగి... ఆతర్వాత క్రమేణా టాలీవుడ్ నుంచి దూరమైంది. కోలీవుడ్‌లో బొద్దుగుమ్మలకు ఉన్న క్రేజ్ హన్సికకు ప్లస్ అయి అక్కడ అగ్ర నాయికగా రాణించేందుకు తోడ్పడింది.

ప్రస్తుతం కోలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్న హన్సిక వరుసగా సినిమాలు చేస్తూ ఎంతో బిజీగా ఉంది. తమిళ ప్రేక్షకులు ఈ భామను 'చిన్న ఖుష్బూ'గా ఆరాధిస్తున్నారు. ఇటీవల హన్సికకు తమిళ ఇండస్ట్రీలో మరో పేరు కూడా వచ్చింది. ఆమెను 'టైమ్ బాంబు'గా అభివర్ణిస్తున్నారు. ఇలా ఎందుకు తనను అంటున్నారో హన్సికనే స్వయం గా చెప్పింది. సినిమా షూటింగ్‌లకు తాను కరెక్ట్ టైమ్‌కు వస్తానంటోంది. షూటింగ్ షెడ్యూల్‌కంటే 10 నిమిషాల ముందే సెట్స్‌కు వచ్చి అందరినీ ఆశ్చర్యపరుస్తుందట. దీంతో హన్సికను కోలీవుడ్‌లో అందరూ 'టైమ్ బాంబు' అని అంటున్నారట. ఇక ట్విట్టర్‌లో తన అభిమానులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటోంది ఈ భామ. తన సినిమాల అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటూ వారిని పలకరిస్తోంది. అభిమానుల ప్రేమాభిమానాలతోనే కోలీవుడ్‌లో తాను కథానాయికగా అగ్రస్థానానికి చేరుకోగలిగానని హన్సిక చెబుతోంది. ఈమధ్యన తెలుగు సినిమాలకు దూరంగా ఉంటూ ఇక్కడి అభిమానులను మాత్రం నిరాశపరుస్తోంది ఈ బ్యూటీ.


సన్నీలియోన్

మెప్పించడానికి కష్టపడాల్సిందే

పోర్న్‌స్టార్‌గా ఓ వెలుగువెలిగిన తర్వాత బాలీవుడ్‌లో అడుగుపెట్టి గ్లామరస్ తారగా రాణిస్తున్న ముద్దుగుమ్మ సన్నీలియోన్. ప్రస్తుతం ఆమెకు బాలీవుడ్‌లో భారీ క్రేజ్ ఉంది. ఈ భామ సౌత్‌లో రెండు, మూడు సినిమాల్లో ఐటమ్‌సాంగ్స్ కూడా చేసి ప్రేక్షకులను మురిపించింది. ఇప్పుడు సన్నీలియోన్ టైటిల్ రోల్‌లో త్రిభాషా చిత్రం 'వీరమహాదేవి'లో నటిస్తోంది. సౌత్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా ఈ షూటింగ్‌ను జరిపించేస్తున్నారు ఫిల్మ్‌మేకర్స్. ఈ చిత్రంలో సన్నీలియోన్‌ను 'రుద్రమదేవి'లోని అనుష్కలాగా చూపిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే అనుష్క స్టార్ రేంజ్‌కు ధీటుగా సన్నీ కనిపిస్తుందా అనేది సందేహమే. కెనడా సుందరి సన్నీని తీసుకొచ్చి వీరమహాదేవి అంటూ తమిళ సంస్కృతిలోని ఒక వీరనారి గెటప్ వేయించడం బాగానే ఉన్నా ఆమె ఏమేరకు ఈ పాత్రలో రాణిస్తుందో చూడాల్సిందే. రౌద్రం, పౌరుషం, వీరత్వం, కసి నిండిన పాత్రలో ప్రేక్షకులను మెప్పించాలంటే సన్నీ బాగా కష్టపడాల్సిందే.


తమన్నా

బాలీవుడ్‌లో బిగ్ ఆఫర్

తమన్నా తన కెరీర్‌లో ఎన్నో వైవిధ్యమైన సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. 'బాహుబలి' సినిమాను మినహాయిస్తే ఏ చిత్రంలోని పాత్ర కూడా ఆమెకు పెద్దగా పేరు తెచ్చిపెట్టలేదు. అయితే అందంలో తమన్నా మంచి మార్కులే కొట్టేసిందని చెప్పుకోవచ్చు. ఈ బ్యూటీ స్పెషల్ సాంగ్స్‌లో కూడా సందడిచేసి ప్రేక్షకులను అలరించింది. ఇక అసలు విషయానికొస్తే తమన్నా తాజాగా బాలీవుడ్‌లో ఓ బిగ్ ఆఫర్‌ను దక్కించుకుందట. డైనోసార్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని తెలిసింది. ఇందులో తమన్నా కీలకమైన పాత్రలో కనిపించనుండగా... అమితాబ్‌బచ్చన్ ప్రధాన పాత్రలో నటించనున్నాడు. ఆస్కార్ విజేత ఏ.ఆర్.రెహమాన్ దీనికి సంగీతాన్ని అందిస్తాడు. 'బాహుబలి' కంటే భారీ రేంజ్‌లో ఈ సినిమాను తెరకెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారట. సౌత్‌లో అవకాశాలు అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో ఈ అమ్మడు బాలీవుడ్‌లో ఏకంగా డైనోసార్స్ సినిమాలో నటించడానికి సిద్ధమవుతుండటం విశేషం. ప్రస్తుతం తమన్నా హీరో కళ్యాణ్‌రామ్‌కు జోడీగా 'నా నువ్వే' సినిమాతో పాటు సందీప్‌కిషన్‌తో కలిసి మరో సినిమాలో నటిస్తోంది.



జనవరిలో స్వల్పంగా తగ్గిన జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ: జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వసూళ్లు నెలనెలా తగ్గుముఖం పడుతున్నాయి. జనవరి నెలలో జిఎస్‌టి వసూళ్లు రూ.86,318 కోట్లు నమోదయ్యాయి. డిసెంబర్‌లో వసూళ్లు రూ.86,703 కోట్లతో పోలిస్తే ఈసారి తగ్గాయని ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. 2017లో చివరి నెలలో జిఎస్‌టి వసూళ్లు పెరిగాయి. అయితే డిసెంబర్‌లో రూ.86,703 కోట్లు వసూళ్లతో పోలిస్తే జనవరిలో రూ.385 కోట్లు తగ్గాయి. అక్టోబర్ తర్వాత జిఎస్‌టి కౌన్సిల్ దాదాపు 200 వస్తువులపై పన్ను రేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. జిఎస్‌టిలో ఫిబ్రవరి 25 వరకు 1.03 కోట్ల మంది రిజిస్టర్ అయినట్లు ప్రభుత్వం తెలిపింది. వీరిలో 17.65 లక్షల మంది కాంపోజిషన్ డీలర్లు ఉండగా.. వీరు మాత్రమే మూడునెలకు ఒక సారి పన్ను రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుంది. మిగిలిన వారు ప్రతినెలా పన్ను రిటర్న్‌లను ఫైల్ చేయాలి. జనవరి నుంచి ఫిబ్రవరి 25 వరకు జిఎస్‌టిఆర్ 3బి రిటర్న్‌లను 57.78 లక్షల మందికి పైగా దాఖలు చేశారు. మొత్తంలో 69 శాతం మంది నెల నెలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. జనవరిలో వసూళు అయిన రూ.86,318 కోట్లలో.. సి–జిఎస్‌టిగా రూ.14,233 కోట్లు, ఎస్–జిఎస్‌టిగా రూ.19,961 కోట్లు, ఐ–జిఎస్‌టిగా రూ.43,794 కోట్లు వసూలు అయ్యాయి.

కాస్త తగ్గింపుతో ఒరిగేదేమీ లేదు

భారత్ దిగుమతి సుంకంపై ట్రంప్ విమర్శలు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్ దిగుమతి సుంకంపై విమర్శలు చేశారు. హార్లే – డేవిడ్సన్ మోటార్‌సైకిళ్లపై భారత్ దిగుమతి సుంకం పెంచినందుకు గతంలో ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. మరోసారి అదే విధంగా వ్యాఖ్యలు చేశారు. 75 శాతం పెంచిన దిగుమతి సుంకాన్ని 50 శాతానికి తగ్గించినట్టు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించినప్పటికీ.. ఇది అమెరికాకు అంత అనుకూలమేమీ కాదంటూ అమెరికాలో తయారయ్యే హార్లీ డేవిడ్‌సన్ బైక్‌ల వ్యవహారంలో ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. ఈ నిర్ణయం వల్ల అమెరికాకు ఒరిగేదేమీ లేదని అన్నారు. దిగుమతి సుంకం తగ్గింపుతో అమెరికాకు ఏదో మేలు చేసినట్లు భారత్ అనుకుంటూ ఉన్నా అలాంటిదేమీ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌కు మాత్రం 50 శాతం దిగుమతి సుంకం రూపంలో ఆదాయం సమకూరుతుందని, భారత్‌లో తయారయ్యే ద్విచక్ర వాహనాలను దిగుమతి చేసుకుంటున్నా తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ట్రంప్ అన్నారు. హార్లీ డేవిడ్‌సన్ బైకుల విషయంలో ట్రంప్ మండిపడడం రెండు వారాల వ్యవధిలో ఇది రెండోసారి. అవసరమైతే అమెరికాలో అమ్ముడయ్యే భారతీయ మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని పెంచుతామని ఈ నెల 14న ఆయన హెచ్చరించారు. దిగుమతి సుంకం విషయంలో అమెరికా నుంచి ఒత్తిడి పెరుగుతోంది.

బ్లూ టూత్ కనెక్టివిటీతో టివిఎస్ ఎస్‌టార్క్ 125



మన తెలంగాణ / హైదరాబాద్ : ద్విచక్ర, త్రిచక్ర వాహన తయారీ సంస్థ టివిఎస్ తన నూతన బ్రాండ్ 'ఎన్‌టార్క్ 125 సిసి' స్కూటర్‌ను రాష్ట్ర మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టింది. టివిఎస్ ఎస్‌టార్క్ 125 పేరిట ఈ వాహనాన్ని ఆ సంస్థ జిఎం బెనోయ్ ఆంటోనీతో కలిసి టివిఎస్ మోటర్ కంపెనీ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) అనిరుద్ ఆల్ధార్ ఆవిష్కరించారు. ఈ నూతన స్కూటర్ ప్రత్యేకతలను వివరిస్తూ సెల్ ఫోన్ కనెక్టివిటీతో ఈ స్కూటర్ ఇంజన్‌ను ఆన్ చేసుకోవచ్చన్నారు. దేశంలోనే తొలిసారిగా బ్లూ టూత్ కనెక్టెడ్ స్కూటర్‌గా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రూ.61,450 ధరలో హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34346.39	–99.36	–0.29%
నిఫ్టీ	10554.30	–28.30	–0.27%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29240	31272.73	–0.1%
ముంబై	30080	32171.12	0.57%
ఢిల్లీ	29800	31871.66	0.17%
కోల్‌కతా	30190	32288.77	0.37%
కేరళ	28300	30267.38	–0.35%
బెంగళూరు	28700	30695.19	0.17%
హైదరాబాద్	29200	31229.95	–0.1%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	41700.00	41600.00	0.24
ముంబై	41700.00	41600.00	0.24
ఢిల్లీ	41700.00	41600.00	0.24
కోల్‌కతా	41700.00	41600.00	0.24
హైదరాబాద్	41700.00	41600.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	350
వరంగల్	357	చిత్తూరు	388
విజయవాడ	348	చెన్నై	395
గోదావరి	348	బెంగళూరు	385




అత్యున్నత ప్రమాణాలు పాటించేది ప్రభుత్వరంగ సంస్థలే..

- ఎన్‌సిఎల్‌టి వద్ద ఉన్నవన్నీ ప్రైవేటు కంపెనీలే..
- అద్దాల మేడలో ఉంటూ రాళ్లు విసరొద్దు..
- బ్యాంకుల ప్రైవేటీకరణపై విరుచుకుపడిన ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలంటూ వస్తున్న విమర్శలను ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్ తిప్పికొట్టారు. అద్దాల మేడలో ఉంటూ ఇతరులపై రాళ్లు విసరొద్దని విరుచుకుపడ్డారు. మొండి బకాయిలు, తక్కువ స్థాయి ప్రమాణాలున్న కేసులు దాదాపు ప్రైవేటు రంగంలోనే ఉన్నాయని.. ప్రభుత్వ సంస్థలే అత్యున్నత పరిపాలనా ప్రమాణాలు పాటిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ బ్యాంకుల్లో మొండి బకాయిలు, దివాలా కేసులు పెరిగిన నేపథ్యంలో అత్యున్నత కార్పొరేట్ పాలనా ప్రమాణాలు లోపించాయంటూ వస్తున్న విమర్శలపై రజనీష్ ఈవిధంగా స్పందించారు. 'ప్రైవేటు రంగంలోని సంస్థల్లో కార్పొరేట్ పరిపాలనా విధానాలు మెరుగ్గా ఉంటే ఏ ప్రభుత్వరంగ సంస్థ ఇప్పుడు ఎన్‌సిఎల్‌టి (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) వద్ద ఉందో చెప్పాలి' అని రజనీశ్ ప్రశ్నించారు. ప్రస్తుతం లా ట్రిబ్యునల్ వద్ద ఉన్న కంపెనీలన్నీ ప్రైవేటువే కదా అని చెప్పుకొచ్చారు. 'రుణ ఎగవేత సంస్థలన్నీ పరిశ్రమ సంఘాల ముందు వరసులో కూర్చున్నాయి. ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడినప్పుడు హితబోధనలు చేస్తారు. కానీ ఇప్పుడు జరుగుతున్న వాస్తవం ఇది' అని రజనీష్ అన్నారు. ఎగవేతదారులంతా ముందు వరుసలో కూర్చుంటే.. బ్యాంకర్లంతా వెనక వరుసలో ఎందుకు కూర్చోవాలి? అని ఆయన ప్రశ్నించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఇటీవల భారీ మోసం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే అంశంపై చర్చలు పెరిగాయి. వజ్రాల వ్యాపారులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ కంపెనీలు కొందరు బ్యాంక్ ఉద్యోగులతో కుమ్మక్కై పిఎన్‌బిలో రూ.11,400 కోట్ల మేర మోసం చేశాయి. అనంతరం నీరవ్ మోడీ విదేశాలకు పారిపోయాడు. దీంతో ప్రభుత్వరంగ బ్యాంక్‌లపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పాలనా విధానాలు పటిష్ఠంగా లేవని, ప్రమాణాలు ఘోరంగా ఉన్నాయని, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎక్కువగా అవసరం లేదని కొటక్ మహింద్రా బ్యాంకు ఎక్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉదయ్ కొటక్ విమర్శించారు. ఇటీవల గ్లోబల్ బిజినెస్ సదస్సులో మరికొందరు వ్యాపార వేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. పిఎస్‌యు బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవాల్సి సమయం ఆసన్నమైందంటూ పలు నిపుణులు సూచనలు చేశారు. దీంతో ప్రభుత్వ రంగ సంస్థలపై విమర్శలు చేస్తున్న వారిపై ఎస్‌బిఐ చైర్మన్ రజనీశ్ ప్రతి విమర్శలు చేశారు. సమాజం మెరుగుపడేందుకు ప్రభుత్వ సంస్థలు ఎంతగానో కృషి చేస్తున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్నవి ప్రభుత్వరంగ బ్యాంకులేనని అన్నారు. దేశంలోని అనేక మారుమూల ప్రాంతాల్లో.. పల్లెల్లో, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో శాఖలను నడుపుతున్న ప్రైవేటు సంస్థలు ఏమైనా ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉదంతంతో ప్రజల్లో బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం పోతుందని తాను భావించడం లేదని అన్నారు. ప్రజల్లో ఇప్పటికే బ్యాంకింగ్ వ్యవస్థపై అపారమైన నమ్మకం ఉందని భావిస్తున్నామని అన్నారు.


పిఎన్‌బి మోసం లావాదేవీలు పెరిగాయ్

- అదనంగా రూ.1300 కోట్లు
- మొత్తం రూ.12,700 కోట్లకు చేరిన కుంభకోణం
- స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) మరో షాకింగ్ వార్తను వినిపించింది. డైమండ్ వ్యాపారి నీరవ్ రూ.11,400 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డాడని గతంలో ప్రకటించిన బ్యాంక్.. తాజాగా మోసం లావాదేవీలు మరింతగా పెరిగాయని ప్రకటించింది. నీరవ్ మోసం కేసులో మరో రూ.1300 కోట్లు (204.25 మిలియన్ డాలర్లు) లావాదేవీలు అక్రమంగా జరిగినట్టు గుర్తించామని బ్యాంక్ వెల్లడించింది. ఈమేరకు మంగళవారంనాడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం అందించింది. దీంతో మొత్తం కుంభకోణం విలువ రూ.11,400 కోట్ల నుంచి రూ.12,700 కోట్లకు పెరిగింది. పిఎన్‌బిలో మోసానికి పాల్పడిన నీరవ్ మోడీ విదేశాలకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. సోమవారం రాత్రి బిఎస్ఇ ఫైలింగ్‌లో రూ.12,700 కోట్లకు పైగా మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పేర్కొంది. దీంతో మంగళవారం ట్రేడింగ్‌లో పిఎన్‌బి షేర్లు కుప్పకూలాయి. సుమారు 9 శాతానికి పైగా పతనమయ్యాయి. బ్యాంక్ షేరు విలువ 52 వారాల కనిష్ఠానికి పడిపోయింది. అలాగే ఎన్ఎస్ఇలోనూ నష్టాలు కొనసాగాయి. ఉదయం షేరు విలువ రూ.106.80 వద్ద ప్రారంభమై 8.82శాతం పడిపోయింది.

7– 8 శాతం వృద్ధి రేటు సాధిస్తాం : అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: అనేక సంస్కరణలు, సానుకూల అంతర్జాతీయ వాతావరణం నేపథ్యంలో భారత్ ఆర్థిక వృద్ధి రేటు 7 నుంచి 8 శాతం సాధించే సామర్థ్యం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఇక్కడ మంగళవారం నిర్వహించిన భారత్– కొరియా బిజినెస్ సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చే 10 నుంచి 20 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా భారత్‌కు ప్రతికూల వాతావరణ ఉందని.. ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా మారాయని తెలిపారు. దేశంలో వృద్ధి రేటు 7 నుంచి 8 శాతానికి చేరుకుంటుందని ప్రజలు భావిస్తున్నారని, అయితే అంతకుమించి వృద్ధి రేటును సాధించే సత్తా భారత్‌కు ఉందని జైట్లీ విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా మూడో త్రైమాసికంలో(అక్టోబర్–డిసెంబర్)లో దేశీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా ఉందని మోర్గాన్ స్టాన్లీ, రైటర్స్ పోల్ రెండు నివేదికలు అంచనా వేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18) జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ జిడిపి 6.3 శాతం నమోదవగా, అంతకుముందు తొలి త్రైమాసికంలో 5.7 శాతంతో పోలిస్తే పెరిగింది. ఏడాది – ఏడాది ఆధారంగా చూస్తే జిడిపి వృద్ధి రేటు 7 శాతానికి పెరగనుందని, అంతకుముందు సెప్టెంబర్ ముగింపు త్రైమాసికంలో 6.3 శాతంతో పోలిస్తే మెరుగవనుందని నివేదిక పేర్కొంది. అయితే 2016 నవంబర్‌లో అనూహ్యంగా పెద్ద నోట్లను రద్దు చేయడం, అలాగే ఆందోళనల మధ్య 2017 జులైలో జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు వంటి అంశాలు జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)కి ఆటంకంగా మారాయని నివేదికలు తెలిపాయి. పరిశ్రమ, సేవల రంగంలో వృద్ధి రేటు పెరగనుండగా, అదే సమయంలో వ్యవసాయ రంగంలో వృద్ధి క్షీణించనుందని తెలిపాయి.

మార్కెట్‌ను ముంచిన బ్యాంకింగ్



ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రుణాల మోసం మరింత పెరగడంతో ఈక్విటీ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. పిఎన్‌బి షేరు భారీగా నష్టపోవడం.. అదే బాటలో బ్యాంకింగ్ షేర్ల భారీ పతనంతో మంగళవారం మార్కెట్ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 99.36 పాయింట్లు నష్టపోయి 34,346.39 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 10,554.30 వద్ద ముగిసింది. మార్కెట్‌లో పి–నోట్ల పెట్టుబడులు ఎనిమిదిన్నరేళ్ల గరిష్టానికి చేరాయనే సమాచారం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో రెండు రోజుల వరుసగా లాభాల ముగింపుకు బ్రేక్ పడింది. బ్యాంక్ నిఫ్టీ 304.30 పాయింట్లు అంటే 1.18 శాతం నష్టపోయి 25,383.60 పాయింట్ల వద్ద ముగిసింది. క్రితం లాభాల ముగింపును కొనసాగిస్తూ తొలుత ప్రధాన సూచీలు లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్ 34,522 పాయింట్ల వద్ద, నిఫ్టీ 10605 వద్ద ప్రారంభమయ్యాయి. అయితే పిఎన్‌బి తాజా ప్రకటనలో రూ. 11,400 కోట్ల కుంభకోణానికి మరో రూ.1300 కోట్లు పెరిగాయని చెప్పడంతో బ్యాంకింగ్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవగా.. మార్కెట్ తిరిగి నష్టాల్లోకి జారుకుంది. ఎన్ఎస్ఇలోని నిఫ్టీ పిఎస్‌యు బ్యాంక్ 3.50 శాతం, ప్రైవేట్ బ్యాంక్ 1శాతం, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.18శాతం వరకు పతనమై మార్కెట్ నష్టాల ముగింపు కారణమయ్యాయి. ఎన్‌టిపిసి, హీరో మోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు 1నుంచి 2శాతం లాభపడ్డాయి. కోల్ ఇండియా, సన్‌ఫార్మా, యాక్సిక్ బ్యాంక్, ఎస్‌బిఐ, అంబుజా షేర్లు 2 నుంచి 4 శాతం మేరకు నష్టాలను నమోదు చేశాయి.

విదేశీ పెట్టుబడులను రక్షిస్తాం

- పరిశ్రమలకు భారత్ ఎంతో అనువైనది
- భారత్– కొరియా బిజినెస్ సదస్సులో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ)లను తాము రక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. మంగళవారం సిఐఐ, డిఐపిపిలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన భారత్– కొరియా బిజినెస్ సదస్సులో ఆయన ప్రసంగించారు. వృద్ధికి ఊతం అందించే విదేశీ నిధులను ప్రోత్సహిస్తామని, వాటి రక్షణ కల్పిస్తామని అన్నారు. భారత్ పరిశ్రమలకు అనువైనదని, ఇక్కడ వ్యాపారాలకు అంతా సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. స్థిరమైన వ్యాపార వాతావరణం కల్పించే దిశగా ప్రభుత్వ కృషి చేస్తోందని, నిర్ణయాల్లో మధ్యవర్తిత్వాన్ని తొలగించామని అన్నారు. 'ఇప్పుడు భారత్ వ్యాపారాలకు సిద్ధంగా ఉంది. పరిశ్రమలకు భారత్ ఎంతో స్వేచ్ఛా గమ్యం, ఇలాంటి స్వేచ్ఛా వాతావరణ ప్రపంచంలో ఎక్కడా కనిపించదు' అని ప్రధాని అన్నారు. ఆసియాలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్.. విదేశీ పెట్టుబడులకు ఎల్లప్పుడు తలుపులు తెరిచే ఉంచిందని, 90 శాతానికి పైగా అనుమతులు ఆటోమెటిక్ మార్గంలోనే జరుగుతున్నాయని మోడీ వివరించారు. ఒక్క రక్షణ రంగంలో తప్ప.. మిగతా అన్ని తయారీ రంగాల్లో పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతులు అవసరం లేదని ఆయన చెప్పారు. తాము ఆశించినట్టుగా వచ్చిన పెట్టుబడులకు భద్రత కల్పించడంలో కట్టుబడి ఉన్నామని అన్నారు. తమ ఆర్థిక వ్యవస్థలో పాలుపంచుకుంటున్న కొరియా వ్యాపారాలకు భారత్ విలువ ఇస్తుందని పేర్కొన్నారు

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,241.55	2,198.30	2,236.00	2,193.80	42.20	1.92
భారతి ఎయిర్‌టెల్	432.65	424.30	430.50	423.15	7.35	1.74
ఎన్‌టిపిసి	166.00	162.55	165.55	162.95	2.60	1.60
హీరోమోటోకార్ప్	3,593.95	3,545.00	3,585.50	3,537.85	47.65	1.35
రిలయన్స్	955.80	938.35	950.50	938.70	11.80	1.26
ఇన్ఫోసిస్	1,153.65	1,125.65	1,150.20	1,138.60	11.60	1.02
హెచ్‌యుఎల్	1,352.50	1,334.10	1,346.35	1,333.30	13.05	0.98
బజాజ్ ఆటో	3,058.00	3,022.00	3,034.70	3,008.70	26.00	0.86
అల్ట్రాటెక్ సిమెంట్	4,185.20	4,139.80	4,176.10	4,140.80	35.30	0.85
పవర్‌గ్రిడ్ క్రాప్	198.25	195.55	197.75	196.15	1.60	0.82

టాప్ లూజర్స్ (-)


కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
అంబుజా సిమెంట్	260.90	249.55	251.40	262.95	11.55	4.39
యాక్సిస్ బ్యాంకు	551.60	536.15	538.40	552.30	13.90	2.52
ఎస్‌బిఐ	275.90	265.95	267.60	274.45	6.85	2.50
సన్‌ఫార్మా	563.45	542.05	544.80	555.95	11.15	2.01
కోల్ ఇండియా	316.95	307.20	309.00	314.05	5.05	1.61
జీ ఎంటర్‌టైన్	589.00	575.00	576.50	585.45	8.95	1.53
ఐసిఐసిఐ బ్యాంకు	327.05	319.65	322.15	327.05	4.90	1.50
బిపిసిఎల్	436.35	424.45	426.95	433.00	6.05	1.40
గెయిల్	474.35	455.00	457.05	463.20	6.15	1.33
మారుతి సుజుకి	9,114.95	8,872.60	8,891.20	9,005.35	114.15	1.27

పిఎం విదేశీ టూర్ల బిల్లుల వివరాలు తెలుపండి



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ విదేశీ పర్యటనల విమాన ప్రయాణ ఖర్చులపై కేంద్రీయ సమాచార కమిషన్ (సిఐసి) ఆరాతీస్తోంది. ప్రధాని మోడీ 2013 నుంచి 2017 వరకూ జరిపిన విదేశీ పర్యటనలకు ఎయిరిండియాకు ఎంత మేరకు బిల్లులు చెల్లించారు? ఎంత వ్యయం అయిందనేది కనుగొంటున్నారు. దీనిపై లెక్కలు సమర్పించాలని సిఐసి వర్గాలు ఇప్పుడు విదేశాంగ మంత్రిత్వశాఖను ఆదేశించింది. ప్రధాని విదేశీ పర్యటనలకు భారతీయ వైమానిక దళానికి, ఎయిరిండియాకు ఎంత మేరకు బిల్లులు చెల్లించాలనేది తెలియచేయాలని సిఐసిని రిటైర్డ్ నౌకాదళాధికారి కమాండర్ లోకేశ్ భత్రా అభ్యర్థించారు. అయితే చెల్లించిన మొత్తాలు, ప్రభుత్వానికి విమానయాన సంస్థలు దాఖలు చేసిన బిల్లుల వివరాలు అందించడం కుదరదని , వేర్వేరు చోట్ల రికార్డులలో ఉంటాయని, వీటన్నింటిని సమాచారం అందించడం కుదరదని విదేశాంగ మంత్రిత్వశాఖ తెలియచేసింది. అయితే ఈ వాదన సరి కాదని , వ్యయం వివరాలను సమర్పించాల్సిందేనని చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్‌కె మాథుర్ ఆదేశించారు. 2013 నుంచి 17 వరకూ ప్రధాని విదేశీ పర్యటనకు విమానయాన ఖర్చుల వివరాల కోసం తాము తొలుత మంత్రిత్వశాఖను సంప్రదించామని అయితే వారి నుంచి సరైన సమాచారం రాలేదని దీనితో సిఐసిని ఆశ్రయించామని భత్రా తెలిపారు. సమాచార హక్కుకు సంబంధించి సిఐసి దేశంలో సంపూర్ణ అధీకృత సంస్థగా ఉంది.

సిపిఐ నేత ప్రబోధ్ కన్నుమూత



మన తెలంగాణ /కోల్‌కత్తా/హైదరాబాద్ : సిపిఐ సీనియర్ నాయకులు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ప్రబోధ్ పాండా (72) కన్నుమూశారు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయంలో పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయినట్లు పార్టీ సీనియర్ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఆయనకు భార్య,కొడుకు, కోడలు ఉన్నారు. పాండా సిపిఐ తరుపున 2001 నుంచి 2014 వరకు మూడు సార్లు మిద్నాపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. కాగా, గత పార్టీ మహాసభల్లో పాండా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు కూడా.

సిపిఐ సంతాపం : సిపిఐ మాజీ ఎంపి ప్రబోధ్ పాండా మృతికి సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు సంతాపాన్ని తెలిపారు. పాండా అకాల మరణం కమ్యూని స్టు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని వారు ఒక సంయుక్త సంతాప సందేశంలో పేర్కొన్నారు.

సిద్ధరామయ్యది డబ్బుల సర్కార్



దేవాంగిరి (కర్ణాటక):కర్ణాటకలోని సిద్ధరామయ్యది 'డబ్బులు ప్రథమం' సర్కార్ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ ఎడ్యూరప్ప 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిఎం అభ్యర్థిగా ఎడ్యూరప్పను బిజెపి తెరపైకి తెచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా ర్యాలీలో మోడీ ప్రసంగిస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వానికి ఇక నూకలు చెల్లినట్టేనని అన్నారు. కర్ణాటకలో ఏ పని జరగాలన్న అన్నింటికీ డబ్బులు చెల్లించాల్సిందేనని, ప్రభుత్వ పని తీరు ఈ విధంగా తయారైందని విమర్శించారు. 'డబ్బులు ప్రథ మం, అవి చెల్లిస్తేనే పనులు జరుగుతాయి' అని అన్నారు. 'డబ్బులు ప్రథమం సంస్కృతి మీకు కావాలా? ఈడబ్బుల సంస్కృతితో సాధారణ వ్యక్తి న్యాయం పొందగలడా?'అని ప్రశ్నించారు. ఈ డబ్బుల ప్రభుత్వం త్వరలోనే దిగిపోతుందని, త్వరలోనే నిజాయతీ కలిగిన ప్రభుత్వం ఏర్పడబోతోందని అన్నారు.'ఎందుకంటే దానికి ఓ కారణం ఉంది. డబ్బులు ప్రభుత్వం స్థానంలో ప్రజల బాగోగులు చూసే, వారి కోసం పనిచేసే ప్రభుత్వం రాబోతోంది' అని చెప్పారు. 'దేశవ్యాప్తంగా మీరు చూడండి, ఎక్కడైనా ప్రజలకు తమకు అవకాశం లభిస్తే, ముం దుగా కాంగ్రెస్ తరిమికొట్టడానికే చూస్తున్నారు' అని విమర్శించారు. ఎందుకంటే దేశంలోని అన్ని సమస్యలకు మూలకారణం కాంగ్రెసేనని అన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా సిద్ధరామయ్య ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారన్నారు.

నేవీ 'మిలన్'కు మేం రావడం లేదు

న్యూఢిల్లీ : వచ్చే నెల 6 నుంచి ఎనిమిది రోజుల పాటు నిర్వహించబోయే నావికా దళ విన్యాసాలు 'మిలన్'కు హాజరుకావడం లేదని మాల్దీవుల ప్రభుత్వం తెలియజేసింది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ ఆ దేశాన్ని భారత్ ఆహ్వానించింది. ఈ ఆహ్వానాన్ని మాల్దీవుల ప్రభుత్వం మంగళవారం తిరస్కరించింది. ఆ దేశంలో నెలకొన్న అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'మాల్దీవుల ప్రభుత్వాన్ని నభారత్ ఆహ్వానించింది. అయితే ఆ ప్రభుత్వం కార్యక్రమానికి హాజరుకావడం లేదని తెలిపింది, దీనికి ఎలాంటి కారణాన్ని తెలియజేయలేదు'అని నేవీ ప్రధాన అధికారి అడ్మిరల్ సునీల్ లాంబా తెలిపారు. ఆ దేశంలో ఉన్న పరిస్థితులను బట్టి అక్కడి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆయన తనను కలిసిన విలేకరులకు చెప్పారు. అండమాన్ నికోబార్ ద్వీపాల్లో భారత్ నిర్వహించబోయే ఈ అతిపెద్ద నావికా దళ విన్యాసాలకు 16 దేశాల అధినేతలను ఆహ్వానిస్తున్న విషయం విదితమే.

కశ్మీర్‌లో ఐసిస్ ఉనికి లేదు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో భయానక ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉనికి లేదని మంగళవారం కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలిపింది. కశ్మీర్ లోయలో ఈ గ్రూప్‌నకు భౌతిక అవస్థాపన, సిబ్బంది, దాని ఉనికి ఎంతమాత్రం లేదని హోంశాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. ఆదివారం పోలీస్ ఫరూక్ అహ్మద్ యతూ హత్యలో ఐఎస్ హస్తం లేదని కేంద్రం నొక్కి చెప్పింది. పాకిస్థాన్ కేంద్రంగా నడిచే లష్కరే తోయిబా లేదా స్థానిక మిలిటెంట్ గ్రూప్ ఇషా ఫజల్‌పై అనుమానాలున్నట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.కాగా,డిజిపి ఎస్‌పి వాయిడ్ శ్రీనగర్‌లో మాట్లాడుతూ ఈ చర్యకు పాల్పడింది ఐఎస్‌ఐఎస్ అని స్పష్టమైందని, ఇది ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. 2017లో శ్రీనగర్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది ముగీస్ హతమవ్వగా, సబ్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ తక్ ప్రాణాలు ఆర్పించారు. ఈ ఘటనకు తమదే బాధ్యత అంటూ ఐఎస్ అధికారిక న్యూస్ ఏజెన్సీ అమాక్ ప్రకటించింది.

త్రిపురలో బిజెపి విజయం?

మేఘాలయాలో ఎన్‌పిపి ?, ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రం త్రిపురలో బిజెపి భారీ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ సర్వేలో వెల్లడించారు. ఇక మేఘలయా, నాగాలాండ్‌లో బిజెపి బలం పెంచుకుంటుందని స్పష్టం అయిందని తెలిపారు. మంగళవారం ఎగ్జిట్ ఫలితాలను వెల్లడించారు. త్రిపురలో వామపక్ష కూటమిని బిజెపి –ఐపిఎఫ్‌టి కూటమి ఓడిస్తుందని 51 ఓట్ల శాతం వాటాతో 35 –45 స్థానాలు దక్కించుకుంటుందని జన్‌కీబాత్ – న్యూస్ ఎక్స్ అధ్యయన సంస్థ తెలిపింది. ఇక యాక్సిస్‌మైఇండియా ఎగ్జిట్‌పోల్‌లో బిజెపి కూటమి 49 ఓట్ల శాతంతో 44 నుంచి 50 సీట్లు దక్కించుకుంటుందని తెలిపారు. ఇక అధికార లెఫ్ట్‌ఫ్రంట్‌కు 45 నుంచి 46 శాతం ఓట్లు వచ్చినా 14– 23 స్థానాలు వస్తాయని, ఇతరులు 11 శాతం ఓటువాటాతో మూడు లోపు స్థానాలు దక్కించుకుంటాయని సంస్థ తెలిపింది. అయితే త్రిపురలో బిజెపి, వామపక్ష కూటమి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని సి వోటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. త్రిపురలో సిపిఎం 26 నుంచి 34 సీట్లు తెచ్చుకోవచ్చు. బిజెపి కూటమికి 24 నుంచి 32 స్థానాలు రావచ్చునని తెలిపారు. కాంగ్రెస్‌కు కేవలం రెండు లోపు స్థానాలు వస్తాయని , ఓట్ల శాతం 7.2 ఉంటుందని నిర్ధారించారు. ఇక కాంగ్రెస్ అధికారంలో ఉన్న మేఘాలయాలో సర్వే ఫలితాలలో కాంగ్రెస్ పరాజయం పొందుతుందని విశ్లేషించారు. ఇక్కడ నేషనల్‌పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) 23 నుంచి 27 స్థానాలను, బిజెపి 8– 12 స్థానాలను గెల్చుకుంటుందని అంచనా వేశారు. ఇక కాంగ్రెస్‌కు 13 నుంచి 17 స్థానాలు వస్తాయని జన్‌కీ బాత్ న్యూస్ ఎక్స్ ఎగ్జిట్ పోల్‌లో వెల్లడైంది. కాంగ్రెస్‌కు 21 శాతం ఓట్ల వాటా ఉంటుందని తెలిపారు. ఇతరులు రెండు నుంచి ఆరు స్థానాలు పొందుతారు. ఇక నాగాలాండ్‌లో బిజెపి– ఎన్‌డిపిపి కూటమి అధికారంలోకి వస్తుందని అక్కడ ఎన్‌పిఎఫ్ కంచుకోటకు బీటలు తప్పవని వెల్లడించారు.

ప్రమాదవశాత్తే శ్రీదేవి మృతి

- దుబాయ్ అధికారుల నిర్ధారణ
- ఆ తర్వాతే బోనీ కపూర్ కుటుంబానికి భౌతికకాయం అప్పగింత



దుబాయ్ : నటి శ్రీదేవి మృతిపై క్షణక్షణంగాగంటల పాటు సాగిన ఉత్కంఠ ముగిసింది. శ్రీదేవి హోటల్ గదిలో బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయిందని నిర్ధారణ అయినట్లు దుబాయ్ ప్రాసిక్యూషన్ వారు వెల్లడించారు. ఫోరెన్సిక్ నివేదికలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత శ్రీదేవిది ప్రమాదవశాత్తూ జరిగిన మృతిగా నిర్ధారించుకుంటున్నట్లు మంగళవారం మధ్యాహ్నం దుబాయ్‌లో అత్యున్నత విచారణా వ్యవస్థ అయిన ప్రాసిక్యూషన్ వర్గాలు ప్రకటించాయి. వెనువెంటనే వివిధ కోణాల్లో సాగిన దర్యాప్తు ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు, మృతి కేసులో విచారణ ముగిసినందున, కేసును మూసివేస్తున్నట్లు దుబాయ్ పోలీసులు సాయంత్రం వెల్లడించారు. దీనితో అన్ని క్లియరెన్స్ పత్రాలు భారతీయ ఎంబసీ వర్గాలకు అందడంతో శ్రీదేవి భౌతిక కాయం స్వదేశానికి చేరుకోవడానికి వీలేర్పడింది. దీనికి ముందు వైద్య ప్రక్రియలో భాగంగా మృతదేహం ఎంబామింగ్ ప్రక్రియకు తరలించారు. శ్రీదేవి పార్థివ దేహం స్వాధీనం చేసుకునేందుకు శ్రీదేవి మేనల్లుడు సౌరభ్ మల్హోత్రా ఆసుపత్రికి చేరుకున్నారు. శనివారం రాత్రి దుబాయ్‌లోని జుమైనా ఎమిరేట్స్ హోటల్‌లో నటి శ్రీదేవి మృతి చెందారు. తొలుత గుండెపోటుతో మృతి చెందినట్లుగా వార్తలు వెలువడ్డాయి.అయితే తరువాత ఆమె బాత్‌టబ్‌లో స్పృహలేని స్థితిలో పడి చనిపోయినట్లుగా తెలియడంతో ఫోరెన్సిక్ నివేదికపై అత్యున్నత ప్రాసిక్యూషన్ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దుబాయ్‌లోని జుమైరాహ్ ఎమిరేట్స్ హోటల్ గదిలో శ్రీదేవి మృతి చెందారు. ఈ దశలో అన్ని స్థాయిలలో సంబంధితులను విచారించిన తరువాత ప్రాసిక్యూషన్ వారు ఫోరెన్సిక్ నివేదికలోని అంశాలు సరిగ్గానే ఉన్నాయని నిర్ధారించారు. దీనితో కేసును క్లోజ్ చేస్తున్నట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకూ శ్రీదేవి భర్త ఇతరులపై విచారణ సాగుతుందని, శ్రీదేవి భౌతికకాయం తరలింపు ఆలస్యం అవుతుందనే వార్తలకు తెరపడుతూ బోనీ కపూర్, కుటుంబసభ్యులు రిలయన్స్ వారి ప్రత్యేక విమానంలో శ్రీదేవి భౌతిక కాయంతో పాటు ముంబైకి చేరుకునేందుకు వీలేర్పడింది. కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారని దుబాయ్ మీడియా ఆఫీసు ఒక ప్రకటన వెలువరించింది. పూర్తి స్థాయి దర్యాప్తు ముగిసిన నేపథ్యంలో మృతదేహం అప్పగింతకు ఉన్నత స్థాయిలో నిర్ణయం జరిగిందని వెల్లడించారు. ఆసుపత్రిలో కాకుండా వేరే చోట జరిగే మరణాలపై సాధారణంగా పాటించే అన్ని నిబంధనల మేరకు దర్యాప్తు జరిగింది. సెలబ్రిటీ కావడంతో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా క్షుణ్ణంగా విచారణ జరిగిందని అధికారవర్గాలు తెలిపాయి. శ్రీదేవి భౌతిక కాయాన్ని ఇండియాకు తీసుకువెళ్లేందుకు, తండ్రికి సహకరించేందుకు నటుడు అర్జున్ కపూర్ ముంబై నుంచి దుబాయ్‌కు చేరుకున్నారు.

ముంబైలో అభిమానుల నిరీక్షణ

శ్రీదేవి భౌతిక కాయం ముంబైకి చేరుకుంటుందనే వార్తల నేపథ్యంలో వేలాది మంది అభిమానులు, సినీ ప్రముఖులు ముంబైలో ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం పవన్‌హాన్స్ శ్మశాన వాటికలో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేపట్టారు. శ్రీదేవి నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే శ్రీదేవి కూతుళ్లు జాహ్నవి, కుషి కపూర్‌లో నటుడు అనిల్ కపూర్ నివాసంలో ఉన్నారు. తల్లిని అంతిమంగా చూసేందుకు ఎదురుచూస్తున్నారు. ముంబైలో అనిల్‌కపూర్ నివాసం వద్ద బందోబస్తు ముమ్మరం చేశారు.









తమిళనాడులో దళిత బాలుడి హత్య

సోదరి, తల్లిపై అత్యాచారం

విల్లుపురం : తమిళనాడులో ఒక దళిత కుటుంబంపై దాడి జరిగింది. ఈ ఘటనలో 12 సంవత్సరాల దళిత బాలుడు మృతి చెందగా, బాలుడి సోదరుడు, తల్లి గాయపడ్డారు. విల్లుపురానికి సమీపంలోని వెల్లపుత్తూర్ గ్రామంలో దాదాపు వారం రోజుల క్రితం జరిగిన దాడి ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఈ కుటుంబంపై దాడికి దిగినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి సోదరి, తల్లిపై లైంగిక దాడి జరిగిందని, వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. బాలికను తల్లిని పుదుచ్చేరికి సమీపంలోని జిప్మెర్ వైద్య సంస్థలో చికిత్సకు చేర్పించారు. దళిత కుటుంబంపై దాడికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పిఎంకె నాయకులు, ఎంపి అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. దుండగులు బాలుడిని చంపివేశారని, ఇద్దరు మహిళలపై అత్యాచారం జరిగిందని, స్పృహ లేని స్థితిలో వారు ఘటనా స్థలి లో పడి ఉన్నారని తెలిపారు. వారి తలలకు బలమైన గాయాలు అయ్యాయ ని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక భూ వివాదానికి సంబంధించి గ్రామస్థు లు దళితులపై దాడులు సాగిస్తున్నారని, ఈ క్రమంలోనే ఈ దారుణాలు జరిగాయని రాజకీయ పార్టీల నేతలు విమర్శించారు. బాలుడిని గొంతుకోసి చంపివేశారని,మహిళలపై అమానుష రీతిలో అత్యాచారం జరిగిందని నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనపై ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

హజ్ విమాన చార్జీల్లో భారీ రాయితీ !



న్యూఢిల్లీ : గత నెలలో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఉన్న రాయితీలను ఎత్తివేసిన కేంద్ర ప్రభుత్వం మంగళవారం శుభవార్త చెప్పింది. హజ్ యాత్రికులకు విమాన చార్జీల్లో భారీ తగ్గింపును ప్రకటించింది. 'విమానాల్లో హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికుల కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఛార్జీల్లో భారీగా రాయితీలు కల్పిస్తోంది' అని కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. 'ఎయిర్ ఇండియా, సౌదీ ఎయిర్ లైన్స్, ఫ్లైనాస్ విమానాల్లో ప్రయాణించే వారికి ఈ రాయితీలు అందనున్నట్లు మంత్రి తెలిపారు. 2013–14లో అహ్మదాబాద్ నుంచి వెళ్లే వారిలో ఒక్కొక్కరికి రూ.98,750 విమాన చార్జీ అయ్యేది. తాజా రాయితీలతో అది రూ.65,015లకు తగ్గింది. అలాగే ముంబయి నుంచి వెళ్లే వారికి రూ.57,857 ఖర్చవుతుంది. గతంలో ఇది రూ.98,750గా ఉండేది అని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 1.75 లక్షల మంది భారత్ హజ్ యాత్రకు వెళ్తారని అంచనా వేస్తున్నారు. 2012 సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఉన్న రాయితీలను ఎత్తివేసింది.

మళ్లీ కొట్టను.. తిట్టనంటేనే వస్తా!

ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు లేఖ రాసి సమావేశంలో పాల్గొన్న సిఎస్



న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) అన్షు ప్రకాశ్ మంగళవారం నాడు మంత్రి వర్గ సమావేశంలో పాల్గొన్నారు. సిఎస్‌పై ఆప్ ఎంఎల్‌ఎల దాడి ఘటన తర్వాత ఆయన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అధికారులతో సమావేశం కావడం ఇదే మొదటిసారి. వచ్చే నెలాఖరులోగా ఢిల్లీ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉంది. ఇందుకోసం సిఎంతో ఆయన మరోసారి మంగళవారం సమావేశం కావాల్సి ఉంది. బడ్జెట్ సమావేశాలపై చర్చించాల్సి ఉంది.ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి ముందు ఆయన ముఖ్యమంత్రికి ఓ లేఖ రాశారు. తనపై భౌతికంగా దాడి చేయబోమని, దుర్భాషలాడబోమని హామీ ఇస్తేనే సమావేశానికి హాజరవుతానని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశ తేదీలను ఖరారు చేయడానికి, ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగేందుకు గాను బడ్జెట్‌ను ఆమోదింపజేయడానికి, ఈ భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో సిఎస్ పేర్కొన్నారు. ఈ లేఖలో 'ఢిల్లీ ఉద్యోగులు కష్టపడిపనిచేస్తున్నారు.ప్రభుత్వపాలన సజావుగా సాగాలని కోరుకుంటున్నారు.బడ్జెట్ సమావేశాలతోనే అది సాధ్యం.అందుకే దానికి సంబంధించిన తేదీలు ఫైనల్ చేయడానికి నేను, మా ఇతర అధికారులు సమావేశానికి వస్తున్నాం.అయితే మాపై ఎలాంటి దాడి జరగదని సిఎం హామీ ఇస్తేనే వస్తాం'అంటూ ఆయన పేర్కొనడం గమనార్హం.

ఎంఎల్‌ఎకు నో బెయిల్ : కాగా, సిఎస్‌పై దాడి కేసులో అరెస్టయిన ఆప్ ఎంఎల్‌ఎ ప్రకాశ్ జర్వాల్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. సిఎస్‌పై దాడి ఘటన నేపథ్యంలో ఐఎఎస్, డానిక్స్, డాస్ కేడర్ అధికారులంతా మంత్రులతో రాతపూర్వకంగానే సమాచార కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే, బడ్జెట్ సమావేశాల సందర్భంగా నిర్వహించే మంత్రివర్గ సమావేశానికి ప్రజాప్రయోజనాల రీత్యా హాజరు కావాలని ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్యవేదిక సమావేశంలో తీర్మానించుకున్నారు. సిఎం,డిప్యూటీ సిఎంలు రాతపూర్వకంగా క్షమాపణ చెప్పేంత వరకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజన సమయంలో ఐదు నిమిషాల పాటు మౌనం పాటించాలని, మంత్రులతో సమాచారానికి లేదా ఇతరత్రా ఏ కార్యకలాపాలైనా కూడా రాతపూర్వకంగానే కొనసాగించాలని ఐక్యవేదిక నిర్ణయించింది.

'సోహ్రాబుద్దీన్' కేసు మరో న్యాయమూర్తిని బలిగొంది



న్యూఢిల్లీ : సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసు వ్యవహారం మరో న్యాయమూర్తిని బలిగొందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈ అంశానికి సంబంధించిన పలు పిటిషన్లను బొంబాయి హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్‌కు కేటాయించిన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సోహ్రాబుద్దీన్ కేసులో మరో న్యాయమూర్తిని బలిచేశారు, సిబిఐ ని సవాల్ చేసిన జస్టిస్ రేవతి దేరెను తొలగించారు, ఈ కేసులో అమిత్ షాను హాజరుకావాలని కోరిన జడ్జి జస్టిస్ జేటీ ఉత్పత్‌ను పక్కకు తప్పించారు' అని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో సంక్లిష్ట సందేహాలు లేవెన్తిన జస్టిస్ లోయా మరణించారని, కేసును విచారిస్తున్న న్యాయమూర్తినీ తప్పించారనే మీడియా కథనాలను కూడా రాహుల్ తన ట్వీట్‌లో పొందుపరిచారు. ఉగ్రవాదులతో సంబంధాలున్న గ్యాంగ్‌స్టర్ సోహ్రాబుద్దీన్ షేక్‌ను 2005 నవంబర్‌లో గుజరాత్ పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతామార్చారనే ఆరోపణలున్నాయి. కాగా ఈ కేసు నుంచి అప్పటి గుజరాత్ హోంమంత్రి అమిత్ షా సహా మరి 15 మందికి 2016, 2017లో సిబిఐ కోర్టు విముక్తి కల్పించింది.

ఈశాన్యంలో ప్రశాంతంగా పోలింగ్

నాగాలాండ్‌లో 75%, మేఘాలయలో 67%, మార్చి 3న ఫలితాలు



న్యూఢిల్లీ: ఈశాన్యంలోని రెండు రాష్ట్రాలో మంగళవారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది. నాగాలాండ్‌లో 75 శాతం, మేఘాలయలో 67 శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల సంఘం(ఇసి) అధికారులు తెలిపారు. గత అసెంబ్లీలో ఎన్నికల్లో నాగాలాండ్‌లో 90.57 శాతం, మేఘాలయలో 89 శాతం పోలింగ్ జరగడం ఇక్కడ గమనార్హం. ఇది రాసే సమయానికి ఇంకా చాలా మంది ఎన్నికల ఓటింగ్ కోసం క్యూలో నిలుచుని ఉన్నందున చివరికి పోలింగ్ శాతం పెరగొచ్చని తెలుస్తోందని ఆ ఎన్నికల అధికారి చెప్పారు. మేఘాలయలో ఎన్నికలు ఎలాంటి హింసాత్మక సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంతంగా జరిగినట్లు ఆన్ స్పెషల్ డ్యూటీ(ఒఎస్‌డి)పై ఉన్న ఎన్నికల కమిషనర్ చంద్ర భూషణ్ కుమార్ తెలిపారు. మేఘాలయలోని 59 అసెంబ్లీ స్థానాలకు 3025 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 18న ఎన్‌సిపి అభ్యర్థి చనిపోయినందువల్ల విలియంనగర్(ఎస్‌టి) స్థానం ఎన్నికలను వాయిదా వేశారు. ఈ 59 అసెంబ్లీ స్థానాలకు 18 లక్షలకు పైగా ఓటర్లు పాల్గొంటున్నారు. వారిలో పురుష ఓటర్లు 8.96 లక్షలు కాగా, మహిళా ఓటర్లు 9 లక్షల మంది ఉన్నారు. మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో మేఘాలయ ఒకటి అనేది ఇక్కడ గమనించాలి. ఎన్నికల సంఘం ఖర్చు పర్యవేక్షణ బృందం మేఘాలయలో 25,000 లీటర్ల మద్యాన్ని, రూ. 1.20 కోట్లను పట్టుకుంది. ఇదిలా ఉండగా నాగాలాండ్‌లోని 59 అసెంబ్లీ స్థానాల్లో ఒక అభ్యర్థి పోటీలేకుండానే ఎన్నికయ్యాడు. నాగాలాండ్‌లో 11.91 లక్షలకు పైగ ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 6.01 లక్షలు కాగా, మహిళా ఓటర్లు 5.89 లక్షల మందని ఎన్నికల కమిషనర్ సుదీప్ జైన్ విలేకరులకు తెలిపారు. నాగాలాండ్‌లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు త్రిపుర రాష్ట్ర ఓట్ల లెక్కింపుతో పాటుగా మార్చి 3న నిర్వహించనున్నారు.



అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు తాలిబన్లు సిద్ధం

కాబుల్: ఘర్షణలతో తల్లడిల్లుతున్న అఫ్ఘానిస్థాన్‌లో 'శాంతి పరిష్కారం'కు అమెరికాతో ప్రత్యక్ష చర్చలను తాలిబన్లు కోరుకుంటున్నారు. తాలిబన్లు, ఐసిస్ గ్రూపు తీవ్రవాదులు ఇటీవలి మాసాల్లో జరిపిన దాడుల్లో పౌరుల మరణాల సంఖ్య బాగా పెరిగిపోయింది. అఫ్ఘానిస్థాన్ బలగాలు జరిపిన ప్రతిదాడుల వల్ల కూడా రక్తపాతం మరింత పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అమెరికాతో నేరుగా చర్చలు కోరుతూ సోమవారం రాత్రి తాలిబన్లు ఓ ప్రకటనను పోస్ట్ చేశారు. అయితే దీనిపై అమెరికా అధికారుల నుంచి ఎటువంటి ప్రతిస్పందన వెలువడలేదు. చర్చల్లో కాబుల్ ప్రభుత్వాన్ని కూడా కలుపుకుపోవాలని అమెరికా చాలా కాలంగా వాదిస్తోంది. ఇదిలా ఉండగా చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ప్రజలకు, అమెరికా కాంగ్రెస్(పార్లమెంటు)కు తాలిబన్లు ఫిబ్రవరి మొదట్లోనే బహిరంగ లేఖ కూడా రాశారన్నది ఇక్కడ గమనార్హం. కాబుల్‌లో దాడులకు చిర్రెత్తిపోయిన డొనాల్డ్ ట్రంప్ చర్చలు జరిపే ప్రసక్తేలేదని జనవరిలో అన్నారు. ఏది ఏమైనప్పటికీ 'కాబూల్ సమావేశంలో తాలిబన్లు, పాకిస్థాన్‌కు సంబంధించిన సమగ్ర శాంతి ప్రణాళికను సమర్పిస్తాం'అని అఫ్ఘాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ మంగళవారం చెప్పారు. గత ఏడాది జూన్‌లో జరిగిన సమావేశానుసరించి ఈ సమావేశం ఉండనుంది.

పార్క్ గుయెన్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష

దక్షిణకొరియా ప్రాసిక్యూటర్ల డిమాండ్

సియోల్: అనేక అవినీతి కుంభకోణాల కారణంగా పదవీచ్యుతురాలైన దక్షిణ కొరియా మాజీ అధ్యక్షురాలు పార్క్ గుయెన్ హైకు 30 ఏళ్ల జైలు శిక్ష విధించాలని న్యాయవాదులు మంగళవారం డిమాండ్ చేశారు. ఆమెను 2017 మార్చిలో పదవి నుంచి తొలగించారు. మాజీ నియంత పార్క్ చుంగ్ హీ కూతురైన ఆమె దాదాపు ఏడాదికిపైగా జైలు జీవితం గడుపుతున్నారు. 'అనేక కుంభకోణాల్లో నిందిరాలు, దేశానికి 18వ అధ్యక్షురాలిగా పనిచేసిన పార్క్ గుయెన్ హైకు 30 ఏళ్ల జైలు శిక్ష, 118.5 బిలియన్ డాలర్ల జరిమానా విధించాలని కోర్టును కోరుతున్నాం' అని న్యాయవాదులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. పార్క్ కేసు విచారణ తీర్పు తేదీని మంగళవారం విచారణ అనంతరం ప్రకటించనున్నారు. 'అక్రమ రాజకీయ శక్తులు, ఆర్థిక శక్తులతో పార్క్ కుమ్మక్కయ్యారు' అని ప్రాసిక్యూటర్లు విమర్శించారు. ఆమెపై దాదాపు 18 అభియోగాలున్నాయి. ప్రజలు ఆమెకు కట్టబెట్టిన అధికారాలను ఆమె దుర్వినియోగం చేశారన్నారు. తనపై నేరాభియోగాలు, విచారణ అంతా రాజకీయ కక్షతో జరుపుతున్నవేనని పార్క్ గుయెన్ హై అనడమేకాక,గత అక్టోబరు నుంచి కోర్టుకు హాజరుకావడం కూడా మానుకున్నారు. ఆమెకు ఇప్పటికీ చాలా మంది మద్దతు ఉంది. ఆమె పతనంతో మేలో జరిగిన ఎన్నికల్లో వామపక్ష మొగ్గుచూపే డెమొక్రాటిక్ పార్టీదే పైచేయి అయింది. అధ్యక్ష ఎన్నికల్లో మూన్ జే–ఇన్ సునాయాసంగా గెలిచారు.సామాన్యంగా ఉంటూ, పేదలకనుకూల విధానాలు పాటించడం,ఉత్తర కొరియాతో చర్చలు జరిపేందుకు అనుకూలత చూపుతున్నందున మూన్ జే–ఇన్‌కు ఇప్పుడు ప్రజాదరణ బాగా పెరిగింది.ఇటీవల ఆమె ప్యాంగ్ చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌ను కూడా విజయవంతంగానిర్వహించారన్నది గమనార్హం.

స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థుల అవస్థలు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ఉపకార వేతనాలు సకాలంలో అందక విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది.అవసరమైన ఉపకార వేతనాల మొత్తానికి, ప్రభుత్వం ఆమోదించినదానికీ చాలా వ్యత్యాసమే ఉంది. ఆమోదించినదాంట్లోనూ విడుదలైంది చాలా స్వల్పం. దీంతో అర్హులైన నిరుపేద విద్యార్థులు ఉపకార వేతనం అందక ఇబ్బంది పడుతున్నారు.గత మూడేళ్ళుగా ఉపకార వేతనాల పరిస్థితి నిరాశాజనకంగా ఉందని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2017–18 విద్యా సంవత్సరంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగులు, ఇబిసి, మైనారిటీ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రిఇంబర్స్‌మెంట్‌కు రాష్ట్రవ్యాప్తంగా రూ.1833.15 కోట్ల డిమాండ్ ఉంటే ప్రభుత్వం ఆమోదించింది మాత్రం రూ. 745.20 కోట్లు మాత్రమే. ఇందులో ఇప్పటివరకు విడుదల చేసింది కేవలం రూ.39.87 కోట్లే. ఇంకా రూ.705.33 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ డిమాండ్ 1261.77 కోట్లు ఉంటే ప్రభుత్వం ఆమోదం తెలిపింది మాత్రం 543.42 కోట్లకే. ఇందులో రూ.20.83 కోట్లు విడుదలైంది. ఇక స్కాలర్‌షిప్‌ల కోసం డిమాండ్ 571.36 కోట్లు ఉంటే రూ. 201.80 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.అందులోనూ 19.03 కోట్లు మాత్రమే విడుదలైంది.వాస్తవ డిమాండ్‌కు, ప్రభుత్వం ఆమోదించిన మొత్తానికి, విడుదల చేసిన మొత్తానికి ఎక్కడా పొంతన కనిపించడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని వర్గాలకు చెందిన 1.56 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి కూడా. గత మూడేళ్ళుగా స్కాలర్‌షిప్‌లు తగ్గుతూ వస్తున్నాయి. 2016–17విద్యా సంవత్సరంలో రూ.2,518.81 కోట్ల డిమాండ్‌కు గాను రూ.2,290.79 కోట్లను ప్రభుత్వం ఆమోదించింది. అందులో రూ.1955.53కోట్లు విడుదల చేసింది. గతవిద్యా సంవత్సరంలో ప్రభుత్వం మంజూరు చేసి ఇంకా విడుదల చేయాల్సింది రూ.335.25 కోట్లు. 2015–16లోనూ రూ.28.43 కోట్లు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉంది.గతంతో చూస్తే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రిఇంబర్స్‌మెంట్‌తగ్గుతూ ఈ ఏడాదితగ్గింది.దీంతోచాలా మంది విద్యార్థులు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు.

శిశు మందిరాల్లో 18 మంది మృతి

హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

మన తెలంగాణ/ హైదరాబాద్ : చెత్త కుండీల్లో పసికందు.. రోడ్డు పక్కన శిశువు.. నిర్మానుష్య ప్రాంతంలో దొరికిన పసికందు.. ఇలా దారుణ దయనీయ స్థితిలో దొరికిన పసికందులను ప్రభుత్వం నిర్వహించే శిశు మందిరాలకు తరలిస్తారు. అలా చేరిన అభాగ్యుల్లో 18 మంది శిశువులు ఏడాది కాలంలో కన్నుమూశారు. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకూ 18 మంది పసికందులు చనిపోయారు. వీరు రోడ్డు పక్కన దొరికనప్పటికే వారి ఆరోగ్య పరిస్థితులు విషమించాయి. వారి ప్రాణాలు నిలిపేందుకు వైద్యులు చేసిన అన్ని ప్రయత్నాలు ఫలించని పరిస్థితుల తర్వాతే వారు పుట్టిన కొద్ది గంటలకో.. రోజులకో తుది శ్వాస విడిచేశారు...అని తెలంగాణ సర్కార్ హైకోర్టుకు విన్నవించింది. ప్రభుత్వ ఆధీనంలోని శిశు మందిరాల్లో 40 మంది పిల్లలు చనిపోయారని, శిశువుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆ వ్యాజ్యాన్ని మరోసారి విచారణ చేపట్టింది. గతంలో బెంచ్ ఆదేశాల మేరకు తెలంగాణ సర్కార్ ఏడాది కాలంలో 18 మంది నవజాత శిశువులు దొరికిన కొద్ది కాలానికే లోకాన్ని విడిచారని తెలిపింది. శిశు మందిరాల్లోని ఇతర పిల్లలకు పౌష్టికాహార సమస్యలేమీ లేవని, వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని, శిశుమందిరాల నిర్వహణ ప్రమాణాలతోనే ఉందని తెలిపింది. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని తెలంగాణ సర్కార్ తరఫు లాయర్ చెప్పారు. కౌంటర్ వ్యాజ్యాన్ని దాఖలు చేయాలని సర్కార్‌ను ఆదేశించిన బెంచ్ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.


భద్రతకు తొలి ప్రాధాన్యం : జిఎం




మన తెలంగాణ / హైదరాబాద్ : రైళ్ల నిర్వహణలో భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, భద్రతా చర్యల్లో రాజీపడవద్దని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైల్ నిలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైళ్ళ నిర్వహణలో భద్రత, సమయ పాలన, సరుకు రవాణపై డివిజనల్ మేనేజర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎస్‌సిఆర్ అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, పిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కె.వి.శివప్రసాద్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ట్రాక్ నిర్వహణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసిన అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఆర్‌ఓబిలు, ఆర్‌యుబిల నిర్మాణం, సరుకు రవాణ లక్ష్యాలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.

గ్రహాంతర వాసులతో మానవుల భేటీ?

● వచ్చే శతాబ్దిలో తారసపడుతారు ● ఆ కలయిక స్నేహపూర్వకంగా ఉండకపోవచ్చు: భౌతిక శాస్త్రవేత్త






న్యూఢిల్లీ: గ్రహాంతర వాసులసలు ఉన్నారా, లేరా? అనే మీమాంస ఉన్న స్థితిలో వచ్చే శతాబ్దిలో మానవులకు వారు తారసపడనున్నారని సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త, భవిష్యత్తు ఊహాకర్త మిచియో కాకు తెలిపారు. గతవారం ఆయన రెడిట్ ఎఎంఎ(ఆస్క్ మీ ఎనీథింగ్)లో ఆయన ఈ విషయాన్ని చెప్పారు. న్యూయార్క్‌లోని సిటీ యూనివర్సిటీలో సైద్ధాంతిక భౌతికశాస్త్రవేత్త ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను 'మనం గ్రహాంతరవాసులతో పరిచయాన్ని ఏర్పరచుకుంటామా?' అని అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ 'వచ్చే శతాబ్దిలో మనం గ్రహాంతరవాసులతో పరిచయం ఏర్పరచుకుంటాం' అన్నారు. 'గ్రహాంతర వాసుల సంభాషణను మనం రేడియో టెక్నాలజీ ద్వారా వినగలం, దాంతో వారున్నారన్న విషయాన్ని కూడా గ్రహించగలం, అయితే వారు ఏమి మాట్లాడుకుంటున్నారన్నది అర్థం చేసుకోలేకపోవచ్చు' అని ఆయన తెలిపినట్లు 'న్యూస్‌వీక్' పత్రిక పేర్కొంది. 'గ్రహాంతరవాసులతో మాట్లాడటం కష్టం. ఎందుకంటే వారు మనకన్నా పదుల రెట్ల కాంతిసంవత్సరాల దూరంలో ఉన్నారు. కనుక మనం వారి సాంకేతిక స్థాయిని అర్థం గ్రహించాలంటే మనం వారి భాషను అర్థం చేసుకోగలగాలి' అని కాకు వివరించారు. 'మానవులు ఆ గ్రహాంతర వాసులతో భేటి అయినప్పుడు వారు 'వార్ ఆఫ్ వరల్డ్స్' సినిమాలో గ్రహాంతరవాసుల మాదిరి దూకుడుగా ప్రవర్తించొచ్చు లేదా వారు శాంతియుతంగా మేమున్నాము అని ప్రకటించొచ్చు' అని అన్నారు. అయితే వారు మనతో శాంతియుతంగా మెలుగుతారని తాననుకోవడంలేదని, మనం వారి స్థాయిలో మాట్లాడలేనందుకు వారు మనల్ని అడవి జంతువుల మాదిరి చూసే అవకాశం ఉందని వివరించారు. ఎన్నో ఏళ్లుగా గ్రహాంతరవాసుల కోసం 'ఎలీయన్ హంటింగ్ లేక యుఫో హంటింగ్' పేరిట పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. చాలా మంది పరిశోధకులు తగిన ఆధారాలతో వారున్నారని కూడా గట్టిగా అంటున్నారు. కానీ అమెరికా అంతరిక్ష పరిశోధన కేంద్రం 'నాసా' మాత్రం అదంతా చెత్త వాదన అంటూ కొట్టి పారేస్తున్నది. గ్రహాంతరవాసులున్నారన్న విషయాన్ని నాసా కావాలనే దాచి ఉంచుతోందని చాలా మంది ప్రముఖ గ్రహాంతరవాస పరిశోధకులు భావిస్తున్నారు. గ్రహాంతర వాసులతో మానవులు తారసపడడం అనే 'జూ థియరీ' వెలుగులోకి వచ్చింది.మానవులున్నారన్న విషయం గ్రహాంతరవాసులకు తెలుసునని, అయితే వారు మనతో పరిచయం పెట్టుకోకుండానే దూరం నుంచి గమనిస్తున్నారని కాకు సూచించారు. జంతుప్రదర్శనశాలలోని జంతువులను జూకీపర్ ఎలగైతే దూరం నుంచి కనిపెడుతుంటాడో అదేవిధంగా గ్రహాంతర వాసలు మనల్ని దూరం నుంచి గమనిస్తున్నారని, మనం మనంతటగా పరిణామం చెందాలని చూస్తున్నారని ఆయన తెలిపారు.

దక్షిణ చైనా సముద్రంలో పరిస్థితి జఠిలం : వియత్నాం

కోడ్ ఆఫ్ కండక్ట్ (సిఒసి) సానుకూలం

న్యూఢిల్లీ: దక్షిణ చైనా సముద్రంలో పరిస్థితి ఇంకా జటిలంగా ఉన్నప్పటికీ ప్రాదేశిక అంశాలపై చైనా, ఆసియాన్ దేశాలు నిబంధనావళికి కట్టుబడి ఉన్నాయని వియత్నాం రాయబారి టోన్ సిన్ తన్హ్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన పొరుగు దేశాలు, ముఖ్యంగా చైనా వంటి దేశానికి హనోయ్ ప్రాముఖ్యతనిస్తుందని పేర్కొన్నారు. విదేశాంగ మంత్రులు రూపొందించిన నిబంధనావళిని గత ఏడాది నవంబర్‌లో కోడ్ ఆఫ్ కండక్ట్‌కు చైనా, ఆసియాన్ దేశాలు ఆమోదం తెలిపాయన్నారు. చైనాతో వియత్నాంకు బలమైన ఆర్థిక సంబంధాలున్నాయని టోన్ తెలిపారు. ఈ సమస్యను మనం జటిలం చేయకూడదని ఆయన పేర్కొన్నారు. చైనా 'ఒకే బెల్ట్ ఒకే రోడ్' (ఒబిఒఆర్) ప్రాజెక్టుపైఅడిగిన ప్రశ్నకు ఆ విషయాన్ని అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఒబిఒఆర్‌లో భాగమైన చైనా, పాక్ ఎకనామిక్ కారిడర్ (సిపిఇసి) పాక్ ఆక్రమిత కాశ్మీర్ గూండా వెలుతోంది. దీంతో ఒబిఒఆర్‌పై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది.


సౌదీ ఆర్మీచీఫ్‌పై వేటు



దుబాయ్ : సౌదీ అరేబియాలో కీలక సైనిక ప్రక్షాళన జరిగింది. యెమెన్‌లో యుద్ధ సంక్షోభం నేపథ్యంలో సౌదీ సైనిక దళాల ప్రధానాధికారితో పటు ఇతర రక్షణ అధికారులను తొలిగించారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. పూర్తి స్థాయిలో రక్షణ మంత్రిత్వశాఖ ప్రక్షాళన ఉంటుందని, ఇందులో భాగంగానే ఆర్మీచీఫ్, ఇతర అధికారుల మార్పు జరగిందని అధికార వర్గాలు తెలిపాయి. ఇక దేశంలో మహిళకు కీలక విధుల అప్పగింత విస్తృతానికి చర్యలు కూడా చేపట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా కార్మిక, సామాజిక వ్యవహారాల ఉప మంత్రిగా మహిళను నియమిస్తూ సౌదీ రాజు సల్మాన్ ఆదేశాలు వెలువరించారు. దేశ రక్షణ మంత్రిత్వశాఖ పరిపుష్టికి రూపొందించిన పలు విధాన పత్రాలకు కింగ్ సల్మాన్ ఆమోదం తెలిపారని ప్రకటన వెలువడింది. కార్యనిర్వాహక సరళిలో భారీ స్థాయిలో మార్పులు ఉంటాయి. సైనిక వ్యవస్థాగత పునర్నిర్మాణ ప్రక్రియకు ప్రాధాన్యత ఇస్తారు. అదే విధంగా పరిపాలనా, మానవ వనరుల అవసరాల భర్తీ ప్రక్రియలో కూడా సమూల మార్పులు ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ఉన్నత స్థాయి రక్షణ వ్యవస్థ మార్పులలో భాగంగా ఆర్మీ చీఫ్ అబ్దుల్ రహ్మాన్ బిన్ సలేహ్ అల్ బున్యాన్‌ను పదవి నుంచి తొలిగించారు.బున్యాన్ స్థానంలో ఇప్పుడు ఫయ్యాద్ బిన్ హమీద్ అల్ ర్వాఇలీ నియమితులు అయ్యారు. అతి పేద అరబ్ దేశం అయిన యెమెన్‌లో యుఎఇ ఆధ్వర్యంలోని సౌదీ సంకీర్ణ సేనలు ప్రతిష్టంభన నివారణలో వైఫల్యం చెందడంతో సౌదీ రాజు దీనికి చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు.

అది చైనా సొంత విషయం

జి జిన్‌పింగ్ పదవికి కాలపరిమితి లేకపోవడంపై అమెరికా వ్యాఖ్య



వాషింగ్టన్: చైనా అధ్యక్షుడికి పదవీ కాల పరిమితి అనేదే లేకుండా చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి) చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన చెందడం లేదని వైట్‌హౌస్ పేర్కొంది. తమ దేశానికి 'ఏది ఉత్తమమో' నిర్ణయించుకునే హక్కు చైనాకు ఉందని వ్యాఖ్యానించింది. అమెరికా వైట్‌హౌస్ ఆచితూచి తన ప్రతిస్పందన తెలిపింది. 1949 లో పీపుల్స్ రిపబ్లిక్‌ను స్థాపించినప్పటి నుంచి చైనా లో అధికారంలో ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు రెండు పర్యాయాలకు మించి అధికారంలో కొనసాగకూడదన్న ఆంక్షను తొలగిస్తూ ఆదివారం రాజ్యాంగ సవరణ ప్రతిపాదన చేసింది. 'తమ దేశానికి ఏది ఉత్తమమనుకుంటే దానిని చైనా చేస్తుందని నమ్ముతున్నాం' అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ రోజువారీ విలేకరుల సమావేశంలో తెలిపారు. చైనా అధ్యక్ష,ఉపాధ్యక్ష పదవుల కాల పరిమితి ఆంక్ష తొలగింపు నిర్ణయంపై ఎలాంటి విమర్శలు చేయకూడదని వైట్‌హౌస్, అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్ణయించుకున్నాయి. ఇదిలా ఉండగా చైనాలో సమిష్టి నాయకత్వ విధానంను తొలగించి జి జిన్‌పింగ్‌కు ఏక నాయకత్వ విధానాన్ని సిపిసి పట్టంకట్టడంపై కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. కాగా చైనాలోని అనేక మంది నెటిజన్లు చైనాకొత్త విధానాన్ని సమర్థించడంలేదని సమాచారం.

ఎఫ్‌ఎస్‌సి వెబ్‌సైట్ పునరుద్ధరణ

మార్చిలో కొత్త ఆహార భద్రత కార్డుల జారీ



మనతెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: అర్హులైన వారందరికీ కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసే దిశగా పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది.ఇప్పటి వరకు మూసి వేసిన ఎఫ్‌ఎస్‌సీ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించి కార్డులను జారీ చేసేందుకు ఆశాఖ సన్నాహాలు చేస్తోంది. టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెల్లరేషన్ కార్డులను రద్దు చేసి కొత్తగా ఆహారభద్రత కార్డులను మంజూరు చేసింది. కార్డుల జారీ, యూనిట్ల చేర్పు లు, మార్పులకు ఒక డెడ్‌లైన్ లేకపోవడంతో కొత్త కార్డుల దరఖాస్తులు, కార్డులో చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తుల స్వీకరణ బాధ్యతను ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌కు బదిలీ చేసింది. మీ సేవా, ఈ సేవాల ద్వారా పౌరసరఫరాల దరఖాస్తుల స్వీకరించి ఆహారభద్రత కార్డులను జారీ చేసింది. అయితే హైదరాబాద్ మహానగరంలో రెండేళ్ల క్రితం ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ప్రయోగాత్మకంగా ఈ పాస్ ద్వారా సరుకుల పంపిణికీ పౌరసరఫరాలశాఖ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మహానగరంలో ఈ ప్రయోగం విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ పాస్ విస్తరణకు పౌరసరఫరాలశాఖ సన్నాహాలు చేపట్టింది. ఈ పాస్ విస్తరణకు ఎలాటి ఆటంకాలు ఏర్పడకుండా ఫుడ్ సెక్యూరిటీ కార్డుల అప్‌డేట్ వెబ్‌సైట్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో అప్పటి నుంచి కొత్తగా ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తులు, రద్దయిన కార్డులు, యూనిట్ల పునరుద్ధరణ, కార్డుల్లో యూనిట్ల చేర్పులు, మార్పులకు అవకాశం లేకుండాపోయింది.ప్రస్తుతంమహానగరంలో ఇప్పటి వరకు ఆహారభద్రత కార్డులు లేని కుటుంబాలు మూడు, నాలుగు లక్షల వరకు ఉండవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో లక్ష మంది వరకు కొత్త కార్డుల కోసం జిల్లా పౌరసరఫరాల శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు వరుసగా మూడు నెలలు రేషన్ తీసుకోలేదని, సొంతిళ్లు, వాహనాలు కలిగి ఉన్నారన్న సాకుతో అధికారులు పెద్ద సంఖ్యలో ఆహారభద్రత కార్డులను తొలగించారు.తొలగించిన వాటి ల్లో అర్హులైన పేదలకు సంబంధించిన కార్డులున్నాయి.

అప్ డేట్ వెబ్‌సైట్ మూతతో తిరిగి కొత్త కార్డుల జారీ పూర్తిగా నిలిచిపోయింది. అలాగే రద్దయిన కార్డుల పునరుద్ధరించుకునే అవకాశం లేకుండాపోయింది. గత ఎనిమిది నెలలుగా వెబ్‌సైట్ నిలిపివేయడంతో కొత్తగా ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల స్వీకరణ, యూనిట్ల చేర్పులు, మార్పులు ,తొలగింపు యూనిట్ల పునరుద్ధరణలకు అవకాశం లేకుండా పోవడంతో పేద ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పాస్ విస్తరణ ప్రక్రియ కోసం వెబ్‌సైట్‌ను తత్కాలికంగా నిలిపివేసిన అధికారులు అది పూర్తి కావడంతో తిరిగి పునరుద్ధరించేందుకు కసరత్తు చేస్తున్నారు. మార్చిలో వెబ్‌సైట్ పునరుద్ధరించగానే పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగి రద్దు అయిన కార్డులు, యూనిట్లను పునరుద్ధరించడానికి పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో పేద ప్రజల నుంచి హర్షతీరేకం వ్యక్తమౌతోంది.



ప్రహరీ నిర్మాణాలూ వద్దు : హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆసిఫ్‌నగర్ ఏరియాలోని భోజగుట్ట ప్రాంత భూముల్లో నిర్మాణాలే కాకుండా ప్రహరీని కూడా నిర్మించొద్దని ముస్తఫాహిల్స్ హౌసింగ్ సొసైటీ నితాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. సొసైటీకి భూకేటాయింపుల రద్దుకు కలెక్టర్ సిఫార్సుపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్ ఆదేశించింది. సొసైటీకి భూకేటాయింపుల్ని ప్రశ్నిస్తూ సీపీఎం నాయకుడు శ్రీనివాస్ వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

పరీక్ష ఫలితాలు వెల్లడించొద్దు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఉభయ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రైవేట్ బిఇడి/డిఇడి కాలేజీలు నిర్వహించిన పరీక్షల ఫలితాల్ని వెల్లడించారని హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. కన్వీనర్ కోటా సీట్లు భర్తీ కానప్పుడు యాజమాన్య కోటా కింద ఆయా కాలేజీ యాజమాన్యాలు సీట్లను భర్తీ చేయడాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం తప్పుపట్టింది. అమరావతి డిఈడి కాలేజీ, వినుకొండ లోని ఎస్ఆర్ డిఇడి, జీఎస్సార్ డిఇడి కాలేజీలు (లేడీస్), సలామ్ డిఈడీ కాలేజీ, అలీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, వివేకానంద బీఈడీ కాలేజీ, కందుకూరులోని అజాద్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, నవ చైతన్య కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆత్రేయపురంలోని మహాత్మాగాంధీ డిఇడి తదితర కాలేజీల్లో అడ్మిషన్లు చట్ట వ్యతిరేకంగా జరిగాయని పేర్కొంటూ మాధవరావు వేసిన రిట్‌ను బెంచ్ విచారించింది. ఆ నాలుగు జిల్లాల్లో ఒకే వ్యక్తి ఏకంగా 21బిఇడి/డిఇడి కాలేజీల్ని నడుపుతున్నారని పిటిషనర్ లాయర్ బెంచ్ దృష్టికి తెచ్చారు. ఒకే కాలేజీలో నాలుగైదు కాలేజీలు నడుపుతున్నారని, ఈ అక్రమాలపై అధికారుల నివేదికలో తేలిందని, అయినా కాలేజీల్లో అడ్మిషన్లు జరిగిపోతున్నాయని, విద్యార్థు లు కాలేజీలకు వెళ్లకపోయినా కోర్సులు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు ఇస్తున్నారని పిటిషనర్ లాయర్ చెప్పారు. కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ సర్కార్‌ను ఆదేశించినబెంచ్ విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోసం దరఖాస్తుల స్వీకరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : డాక్టర్ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బిఆర్. జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఎంపిక కోసం ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో వివిధ ఎస్సీ సంఘాలతో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో గుర్తింపు పొందిన సంఘాల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించాలన్న నిర్ణయం జరిగింది. అందిన దరఖాస్తులను పరిశీలన నిమిత్తం ప్రభుత్వానికి పంపనున్నట్లు ఎస్సీ అభివృద్ధిశాఖ సంచాలకులు పి.కరుణాకర్, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ అభివృద్ధిశాఖ సంచాలకులు కరుణాకర్ మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి వచ్చే ఏడాది బడ్జెట్‌లో ఎక్కువ నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు 80 శాతం ఫలితాలను సాధించాయని తెలిపారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ బి.ఆనంద్ కుమార్, ఎస్సీ అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు అత్యుతానంద గుప్తా, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జీ డిఎస్‌డిఓ విద్య, పలు ఎస్సీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహోపకరణాల రంగంలోకి మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్

కంపెనీ టు కన్జూమర్ కోసం బ్యాచ్‌టాగ్ డాట్ కామ్: సిఇఒ మధుకర్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఫార్మసీ రంగంలో ప్రత్యేకతను చాటుకున్న మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ సంస్థ నూతన రంగంలోకి అడుగు పెడుతోంది. గృహోపకరణాలతో పాటు భవన నిర్మాణ సామాగ్రిని వినియోగదారులకు అందించేందుకు 'బ్యాచ్‌టాగ్ డాట్'ను వేదికగా ఏర్పాటు చేసిందని సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ మధుకర్ తెలిపారు.. అన్ని రకాల నాణ్యమైన వస్తువులను చవక ధరలకే అందించేందుకు వీలుగా ఈ వ్యాపారాన్ని చేపడుతున్నామని, కంపెనీ టు కన్జూమర్ అనే విధానాన్ని అవలంబించనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు కావాల్సిన వస్తువులు నేరుగా కంపెనీని నుంచి అందేలా చూస్తామన్నారు. మీడియా సమావేశంలో కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్‌తో కలిసి సీఈఓ మధుకర్ వ్యాపారానికి సంబంధించిన అంశాలను వివరించారు. బ్యాచ్‌టాగ్ డామ్ కామ్ అనేది కొనుగోలుదారులు విస్తృత్రశేణి ప్రిమియం, క్వాలిటి ఉత్పాదక కలిగిన వస్తువులను ఫ్యాక్టరీ నుంచి నేరుగా రిటైల్‌గా పొందేందుకు వేదికలాంటిందన్నారు. దీని వల్ల మార్కెట్ ధరలపై 40 నుంచి 80 శాతం వరకు ఆదా అవుతుందన్నారు. మొదటి శ్రేణి వస్తువులను అందించేందుకు పరిశ్రమలోకి ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్‌లతో బ్యాచ్‌టాగ్ డామ్ కామ్ ఒప్పందం చేసుకుందన్నారు. ధరలతో పోటీ పడుతున్న నేటి పరిస్థితుల్లో నాణ్యత, కళాత్మకత తోకూడిన వస్తువులను తక్కువ ధరలకే అందించడమే తమ లక్ష్యమన్నారు. తమ సంస్థ అందించే వస్తువులలో ఫర్నిచర్, గృహోపకరణాలు, భవన నిర్మాణ సామాగ్రి, లెదర్ పోర్ట్ పోలియో బ్యాగ్స్, వాలెట్స్, బ్యాక్‌ప్యాక్స్ ఉన్నాయని తెలిపారు. నెల రోజుల తర్వాత ఎయిర్ కండిషనర్లు, టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషన్లు, ఇతర గృహోపకరణాలు అందిస్తామని వారు వివరించారు.

ఈ సారి ఆ సిరీస్‌లు టీమిండియావే: సౌరవ్ గంగూలీ



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్ ద్వారా టీమిండియా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. వన్డేలు, టి–20లలో సిరీస్‌లు గెలవడం ద్వారా ఇతర జట్లకు భారత్ సరికొత్త సవాల్ విసిరిందన్నాడు. త్వరలో జరిగే ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లలో భారత్ విజయం సాధించడం ఖాయమని గంగూలీ జోస్యం చెప్పాడు. గతంతో పోల్చితే కోహ్లి సారథ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియాలో గెలవాలనే ఆకాంక్ష వంద శాతం పెరిగిందన్నాడు. దీనికి చక్కటి ఉదాహరణ సఫారీ గడ్డపై టీమిండియా ప్రదర్శనే నిదర్శనమన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ చాలా బలంగా మారిందన్నాడు. భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, అశ్విన్, జడేజా, ఇషాంత్, షమి తదితరులతో భారత్ బౌలింగ్ చాలా పటిష్ఠంగా ఉందన్నాడు. బుమ్రా, భువనేశ్వర్‌లు మూడు ఫార్మాట్‌లలో కూడా మెరుగైన బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నారన్నాడు. సౌతాఫ్రికాలో భారత్ సాధించిన విజయాల్లో బౌలర్ల పాత్ర చాలా కీలకమన్నాడు. ఒక టెస్టులో 20 వికెట్లను తీయడం భారత బౌలర్లు అలవాటుగా మార్చుకున్నారన్నాడు. ఇది జట్టుకు ఎంతో ఊరటనిచ్చే అంశమన్నాడు.

ఆసీస్ సిరీస్‌కు
మహిళా జట్టు ఎంపిక

- మిథాలీరాజ్‌కి పగ్గాలు
- హర్మన్‌ప్రీత్‌కు వైస్ కెప్టెన్సీ



ముంబయి: సొంతగడ్డపై పటిష్ఠమైన ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత మహిళా క్రికెట్ జట్టును ప్రకటించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్–ఆస్ట్రేలియా జట్లు తలపడుతాయి. ఇందులో పాల్గొనే జట్టుకు మిథాలీ రాజ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది. మూడు మ్యాచ్‌లకు కూడా గుజరాత్‌లోని వడోదర నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. తొలి వన్డే మార్చి 12న జరుగుతుంది. రెండో వన్డే మార్చి 15న నిర్వహిస్తారు. ఆఖరి వన్డే 18న జరుగనుంది. కాగా, మిథాలీరాజ్‌కు డిప్యూటీగా హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యవహరిస్తోంది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో గాయపడిన వెటరన్ ఫాస్ట్ బౌలర్ జులన్ గోస్వామికి సిరీస్‌లో చోటు దక్కలేదు. గోస్వామి పూర్తి ఫిట్ సాధించక పోవడంతో ఆమెకు విశ్రాంతి కల్పించారు. యువ క్రికెటర్ జమీమా రోడ్రిక్స్‌కు జట్టులో స్థానం లభించింది. వికెట్ కీపింగ్ బాధ్యతలను సుష్మా వర్మ చేపడుతుంది. ఇటీవల దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపై వన్డేల్లో, టి–20ల్లో ఓడించిన భారత జట్టు స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. పటిష్ఠమైన ఆస్ట్రేలియాకు గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా సిరీస్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మందన, రోడ్రిక్స్ అద్భుత ఫాంలో ఉండడం భారత్‌కు కలిసి వచ్చే అంశం.

జట్టు వివరాలు: మిథాలీ రాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్ (వైస్ కెప్టెన్), స్మృతి మందన, పూనమ్ రౌత్, వేద కృష్ణమూర్తి, జమీమా రోడ్రిక్స్, మోనా మిశ్రం, సుష్మా వర్మ (వికెట్ కీపర్), రాజేశ్వరి గైక్వాడ్, దీప్తి శర్మ, శిఖా పాండ, సుకన్య పరిద.



ముక్కోణపు టి–20 సిరీస్

సీనియర్లు లేకున్నా
భారతే ఫేవరెట్

మన తెలంగాణ/క్రీడావిభాగం: శ్రీలంక జరిగే ముక్కోణపు ట్వంటీ–20 క్రికెట్ టోర్నమెంట్‌లో టీమిండియానే ఫేవరెట్‌గా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సీనియర్లు లేకున్నా టోర్నీలో పాల్గొంటున్న శ్రీలంక, బంగ్లాదేశ్‌కంటే భారతే మెరుగైన జట్టని వారు అభిప్రాయపడుతున్నారు. రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా టోర్నమెంట్‌ను గెలుచుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయని వారంటున్నారు. యువ ఆటగాళ్ల రాకతో జట్టు మరింత బలోపేతంగా మారిందన్నాడు. ప్రస్తుతం జట్టుకు ఎంపికైన వారికి ఐపిఎల్‌లో ఆడిన అనుభవం ఎంతో ఉపకరిస్తుందని వారు పేర్కొంటున్నారు. ఐపిఎల్‌లో అదర గొట్టిన రిషబ్ పంత్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్ తదితరులు లంక గడ్డపై మెరుపులు మెరిపించే అవకాశాలున్నాయని వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్, మనీష్ పాండే, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, దినేష్ కార్తీక్‌లతో బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. వీరికి తోడుగా సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా ఉండనే ఉన్నాడు. ఎటువంటి బౌలింగ్‌నైన చిన్నాభిన్నం చేసే సత్తా రైనా సొంతం. ఇప్పటికే దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 సిరీస్‌లో రైనా మెరుగైన ఆటతో ఆకట్టుకున్నాడు. దీంతో లంక టోర్నీకి ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యాడు. రైనా చెలరేగితే భారత్‌కు విజయం నల్లేరుపై నడకేనని చెప్పొచ్చు. ఇక, దక్షిణాఫ్రికా సిరీస్‌లో పేలవమైన ఫాంతో నిరాశ పరిచిన రోహిత్ శర్మ లంకలో చెలరేగాలనే పట్టుదలతో ఉన్నాడు. తనకు అచ్చివచ్చే ఉపఖండం పిచ్‌లపై తనదైన శైలీలో విజృంభించేందుకు సిద్ధమయ్యాడు. పొట్టి ఫార్మాట్‌లో అద్భుత రికార్డు కలిగిన రైనా కెప్టెన్‌గా విజయవంతం అయ్యాడు. ఐపిఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు సారథ్యం వహించడం రోహిత్‌కు కలిసి వచ్చే అంశం. విరాట్ కోహ్లి, ధోని తదితరులు లేకున్నా భారత్‌కు వచ్చే లోటేమీలేదు. జట్టు లో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదు. ఒం టిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే చాలా ఆటగాళ్లు జట్టు కు అందుబాటులో ఉన్నారు. వీరంత ఐపిఎల్‌లో మెరుపులు మెరిపించిన వారే కావడం విశేషం. శార్దూల్ ఠాకూర్, సిరాజ్, చాహల్, ఉనద్కట్ తదితరులతో బౌలింగ్ కూడా చాలా పటిష్టంగా ఉంది. చాహల్, వాషింగ్టన్ సుందర్‌లకు పొట్టి క్రికెట్‌లో మెరుగైన రికార్డు ఉన్న విషయం తెలిసిందే. ఇది కూడా భారత్‌కు కలిసి వచ్చే అంశమే. భారత్ ముక్కోణపు టోర్నమెంట్‌లో విజేత నిలిచే అవకాశాలు చాలా అధికంగా కనిపిస్తున్నాయి. బరిలో ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్‌లను కూడా తక్కువ అంచనా వేయలేం. అయితే భారత్‌ను ఓడించి టైటిల్‌ను గెలుచుకోవడం మాత్రం ఇరు జట్లకు అంత తేలిక కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





విజయ్ హజారే ట్రోఫీ

విజేత కర్ణాటక



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మకమైన విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో కర్ణాటక జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం ఇక్కడి ఫిరోజ్ షా కోట్లా మైదానంలో జరిగిన ఫైనల్లో కర్ణాటక 41 పరుగుల తేడాతో సౌరాష్ట్రను ఓడించింది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించిన ఈ మ్యాచ్‌లో కర్ణాటక స్వల్ప లక్ష్యాన్ని సైతం కాపాడుకుని చాంపియన్‌గా అవతరించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక 45.5 ఓవర్లలో 253 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర 46.3 ఓవర్లలో 212 పరు గులకే కుప్పకూలి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యా టింగ్ చేపట్టిన సౌరాష్ట్రకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభించిన ఓపెనర్ సమర్థ్ వ్యాస్ రెండు ఫోర్లతో 10 పరుగులు చేసి తొలి ఓవర్ చివరి బంతికి ఔటయ్యాడు. దీంతో సౌరాష్ట్ర కష్టాలు ప్రారంభమయ్యాయి. తర్వాత వచ్చిన డి.జడేజా (1) కూడా నిరాశ పరిచాడు. ఈ రెండు వికెట్లు కూడా ప్రసిధ్ కృష్ణకు దక్కాయి. త ర్వాత వచ్చిన కెప్టెన్ చటేశ్వర్ పుజారా ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్య త తనపై వేసుకున్నాడు. అతనికి ఓపెనర్ అవి బరోట్ అండగా నిలి చాడు. ఇద్దరు కర్ణాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా బౌండరీల తో స్కోరు వేగం తగ్గకుండా చూశారు. ఈ జంటను విడగొట్టేందుకు కర్ణా టక బౌలర్లు చాలా సేపు శ్రమించాల్సి వచ్చింది. అయితే 4 ఫోర్లతో 30 పరుగులు చేసిన అవి బరోట్‌ను స్టువర్ట్ బిన్నీ వెనక్కి పంపాడు. తర్వాత సౌరాష్ట్ర వరుస క్రమంలో వికెట్లు కోల్పోయింది. కృష్ణప్ప గౌతమ్ కీలక సమయంలో వికెట్లు తీసి సౌరాష్ట్ర ఇన్నింగ్స్ దెబ్బతీశాడు. ఒకవైపు వికె ట్లు పడుతున్నా కెప్టెన్ పుజారా పోరాటం కొనసాగించాడు. చివరికి 127 బంతుల్లో పది ఫోర్లు, ఒక సిక్స్‌తో 94 పరుగులు చేసి రనౌట్‌గా వెను దిరిగాడు. దీంతో సౌరాష్ట్ర ఇన్నింగ్స్ 212 పరుగుల వద్ద ముగిసింది. కర్ణాటక జట్టులో కృష్ణ, గౌతమ్ మూడేసి వికెట్లు పడగొట్టారు.

ఆదుకున్న మయాంక్ : అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటకకు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ కరుణ్ నాయర్ (0), తర్వాత వచ్చిన లోకేష్ రాహుల్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. దీంతో జట్టు ఐదు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ తనపై వేసుకున్నాడు. అతనికి రవికుమార్ సమర్థ్, పవన్ దేశ్ పాండే అండగా నిలిచారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రవికుమార్ (48) పరుగులు చేశాడు. పవన్ నాలుగు ఫోర్లు, సిక్స్‌తో 49 పరుగులు సాధించాడు. శ్రేయస్ గోపాల్ ఆరు ఫోర్ల తో వేగంగా 31 పరుగులు చేశాడు. మరోవైపు అద్భుత ఇన్నింగ్స్‌ను ఆదిన మయాంక్ అగర్వాల్ 79 బంతుల్లోనే 11 ఫోర్లు, మూడు సిక్సర్ల తో 90 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. సౌరాష్ట్ర బౌలర్లలో మక్వా నా నాలుగు, ప్రేరక్ మన్కడ్ రెండు వికెట్లు తీశారు.

వారితో ఇబ్బంది ఉండదు: అశ్విన్



న్యూఢిల్లీ: జట్టులో సీనియర్లు ఉన్నా వారిని కలుపుకొని ముందుకు వెళతానని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు కెప్టెన్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. క్రిస్‌గేల్, యువరాజ్ సింగ్, ఆరోన్ ఫించ్, డేవిడ్ మిల్లర్ వంటి స్టార్ క్రికెటర్లు ఉండడం తనకు కలిసి వచ్చే అంశమన్నాడు. వీరి సహకారంతో జట్టును విజయపథంలో నడిపించడమే తన ఏకైక లక్ష్యమన్నాడు. సీనియర్లతో ఇబ్బందులు తలెత్తే ప్రసకేలేదన్నాడు. అందరిని కలుపుకొని సమష్టిగా ముందుకు పోతానని స్పష్టం చేశాడు. ఐపిఎల్‌లో కెప్టెన్‌గా వ్యవహరించడాన్ని అరుదైన గౌరవంగా భావిస్తానన్నాడు. జట్టు యాజమాన్యం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నాడు. సీనియర్ల సేవలను ఉపయోగించుకొని ముందుకు సాగుతానన్నాడు. ఐపిఎల్‌లో చాలా కాలం చెన్నైకు ప్రాతినిథ్యం వహించిన తాను కొంత కాలంగా వివిధ ఫ్రాంచైజీల తరపున బరిలోకి దిగానన్నాడు. గాయాల వల్ల కిందటి సీజన్‌లో బరిలోకి దిగలేదన్నాడు. అయితే ఈసారి తనకు ఏకంగా కెప్టెన్సీ దక్కడం చాలా ఆనందంగా ఉందన్నాడు. జట్టును ఏకతాటిపై తెచ్చి ముందుకు తీసుకెళ్లేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తానని తెలిపాడు. యువరాజ్, గేల్, ఫించ్, మిల్లర్ వంటి అగ్రశ్రేణి క్రికెటర్లు ఉండడంతో తమ జట్టుకు మంచి అవకాశాలు ఉన్నాయన్నాడు. సమష్టిగా పోరాడి విజయాలు అందుకుంటామనే నమ్మకం తనకుందన్నాడు. కాగా, తన వన్డే కెరీర్ ముగిసి పోయిందని భావించడం లేదన్నాడు. మళ్లీ టీమిండియాకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు ఇంకా మిగిలే ఉన్నాయన్నాడు. యువ బౌలర్లు కుల్దీప్, చాహల్‌లను విరోధులుగా భావించడం లేదన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే వారికి వన్డే, టి–20 జట్టులో స్థానం సురక్షితం అయ్యిందన్నాడు. వారి ప్రతిభే వారిని జట్టులో స్థానాన్ని పదిలం చేసిందని పేర్కొన్నాడు. కాగా, అఫ్గాన్ యువ స్పిన్నర్ ముజీబ్ జర్దాన్ నుంచి కొత్త చిట్కాలు నేర్చుకునేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని అశ్విన్ వివరించాడు. గతంతో పోల్చితే ఈసారి ఐపిఎల్‌లో హోరాహోరీ ఖాయమన్నాడు. అన్ని జట్లలోనూ సమీకరణాలు మారాయని దీంతో పోటీలు ఆసక్తికరంగా సాగడం తథ్యమన్నాడు. ఇదిలావుండగా జట్టు మార్గదర్శిగా వీరేంద్ర సెహ్వాగ్ ఉండడం తనకు మరింత ఊరటనిచ్చే అంశమన్నాడు. అతని సలహాలు, సూచనలు తీసుకుంటూ జట్టును గెలుపు దిశగా నడిపిస్తాననే నమ్మకాన్ని అశ్విన్ వ్యక్తం చేశాడు.

ట్రై సిరీస్‌కు మాథ్యూస్ దూరం



కొలంబో: స్వదేశంలో జరిగే ముక్కోణపు ట్వంటీ–20లో సిరీస్‌లో బరిలోకి దిగక ముందే ఆతిథ్య శ్రీలంక జట్టుకు కోలుకోలేని షాక్ తగిలింది. వన్డే కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ ఎంజిలో మాథ్యూస్ గాయం కారణంగా టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని శ్రీలంక బోర్డు మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన మాథ్యూస్ దూరం కావడం లంకకు పెద్ద లోటేనని విశ్లేషకులు అంటున్నారు. భారత్, బంగ్లాదేశ్‌లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌లో మూడో జట్టుగా లంక పాల్గొంటుంది. కొంత కాలంగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న లంకకు ఇటీవల బంగ్లాదేశ్‌లో సాధించిన విజయాలు ఊరటనిచ్చాయి. ఇదే జోరును స్వదేశంలో జరిగే ముక్కోణపు టోర్నమెంట్‌లో కొనసాగించాలని భావించింది. అయితే గాయాలు ఆ జట్టుకు ప్రతికూలంగా పరిణమించాయి. మాథ్యూస్ ఇప్పటికే జట్టుకు దూరం కాగా ఇతర కీలక ఆటగాళ్లు కూడా గాయాలతో సతమతమవుతున్నారు. కీలక ఫాస్ట్ బౌలర్ నువాన్ ప్రదీప్‌ను గాయం వెంటాడుతోంది. దీంతో అతను టోర్నీలో ఆడడం ప్రశ్నార్థకంగా మారింది. కుశాల్ పెరీరా, చమీర కూడా గాయాలతో బాధపడుతున్నారు. వీరు కూడా టోర్నీలో ఆడేది అనుమానమే. కాగా, కీలక ఆటగాళ్లు దూరమైన లంక బోర్డు మాత్రం జట్టు విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉంది. ఈ టోర్నీలో పాల్గొనే జట్టుకు చండీమల్ సారథ్యం వహించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.